www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 28, సంచిక: 259 | శుక్రవారం | 13-03-2026 | హైదరాబాద్

Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar

పేజీలు: 12 | వెల రూ. 5.00




తెలంగాణకు ఐకాన్
ఉస్మానియా విశ్వవిద్యాలయం
రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధికి రూట్ మ్యాప్
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి 03

గ్యాస్ సంక్షోభం!
హాస్టళ్లలో 'ఆహారం కోత'లు 05

# భారత నౌకలకు అనుమతి!

## 'హోర్ముజ్' ద్వారా క్రూడ్ ఆయిల్ దిగుమతికి తొలగిన అడ్డంకులు?

**న్యూఢిల్లీ:** గ్యాస్‌తోసహా దేశంలో పెట్రో ఉత్పత్తుల కొరత తీవ్రమవుతున్న నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వం కొంత ఊరట కలిగించే ప్రకటన చేసింది. హోర్ముజ్ జలసంధి ద్వారా వచ్చే భారత పతకాలంగల నౌకలను అడ్డుకోబోమని ఇరాన్ హామీ ఇచ్చినట్టు పేర్కొంది. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన రవాణా మార్గాల భద్రతపై తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా హోర్ముజ్ ప్రాంతంలో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఈ సముద్ర మార్గం ద్వారా భారత దేశం దిగుమతి చేసుకునే క్రూడ్ ఆయిల్‌లో సుమారు 40 శాతం రవాణా అవుతుంది. అందువల్ల అక్కడి పరిస్థితులు భారత ఇంధన భద్రతపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. భారత ప్రభుత్వం వర్గాల ప్రకారం, ఇరాన్ భారత జెండాతో ప్రయాణించే ఆయిల్ ట్యాంకర్ నౌకలకు హోర్ముజ్ జలసంధి ద్వారా సురక్షితంగా వెళ్లేందుకు అనుమతి ఇవ్వనుంది. అయితే ఇరాన్‌కు చెందిన మరో వర్గం మాత్రం అలాంటి ఒప్పందం ఏదీ కుదరలేదని పేర్కొంది. ఈ విభిన్న వ్యాఖ్యలతో పరిస్థితి కొంత అనిశ్చితంగా ఉంది. ఇటీవల ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చీతో భారత విదేశాంగ మంత్రి జైశంకర్ వరుసగా మూడు సార్లు ఫోన్ ద్వారా చర్చలు జరిపారు. ఈ చర్చల్లో ముఖ్యంగా సముద్ర రవాణా భద్రత, భారత ఇంధన భద్రతపై చర్చించినట్లు భారత విదేశాంగ శాఖ తరువాయి 2లో



### యుద్ధ విరమణకు ఇరాన్ సానుకూలం..

ఇరాన్ షరతులు

యూదు ఉన్మాది ఇజ్రాయెల్, అమెరికా కలిసి ప్రారంభించిన యుద్ధాన్ని ముగించేందుకు ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కయాన్ సానుకూలత వ్యక్తం చేశారు. అయితే, ఇందుకుగాను మూడు షరతులు విధించారు.

**మొదటిది:** ఇరాన్‌కు ఉన్న చట్టబద్ధమైన హక్కులను ఇజ్రాయెల్ గుర్తించాలి.

**రెండవది:** యుద్ధ నష్టాన్ని చెల్లించాలి.

**మూడవది:** భవిష్యత్తులో దాడి చేయబోమని అంతర్జాతీయ గ్యారంటీ కావాలి.

ఈ మూడు షరతులను అంగీకరిస్తే, యుద్ధాన్ని నిలిపివేయడానికి ఇరాన్ సుముఖంగా ఉంది. కాగా, తమ లక్ష్యాలు ఇప్పటికే పూర్తయ్యాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఈ సందర్భంగా గుర్తుచేసుకోవాలి. యుద్ధం త్వరలోనే ముగుస్తుందని ఆయన చేసిన ప్రకటన, ఇరాన్ సానుకూల స్పందన పశ్చిమాసియాలో శాంతి నెలకొనే అవకాశాలు పెంచుతున్నాయి. అదే జరిగితే, గ్యాస్, ముడి చమురు కొరతకు తెరపడుతుంది.

# 16 నుంచి ఒంటిపూట బడులు

## పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలో మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలో ఈనెల 16వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పాఠశాల తరగతులు జరగనునున్నాయి. పదవ తరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలలో మాత్రం మధ్యాహ్నం 1గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు కొనసాగుతాయి. ప్రస్తుతం 2025–26 విద్యా సంవత్సరం చివరి పని దినమైన ఏప్రిల్ 23వ తేదీ వరకు 'ఒంటిపూట' బడులు విధానం కొనసాగుతుందని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. ఈమేరకు పాఠశాల తరువాయి 2లో





బలమైన భారతదేశానికి

# బలహీన ప్రధాని

## ట్రంప్‌కు సాగిలపడటం తప్ప మోదీ మరేపని చేయలేకపోతున్నారు

యుద్ధ ప్రభావంతో ధరల పెరుగుదల..

ముర్ము వైఖరి సమర్థనీయం కాదు

సిపిఐ జాతీయ నాయకుడు నారాయణ

కమ్యూనిస్టులను బలహీనపర్చడమే వారి ధ్యేయం : కూనంనేని

ప్రజాపక్షం/ఖమ్మం

ప్రపంచంలోనే అత్యంత బలమైన ప్రజాస్వామ్యవాదులున్న భారతదేశానికి మోదీ అత్యంత బలహీన ప్రధాని అని, యుద్ధాన్ని ఆపే కనీస పని చేయడం లేదని సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ కె. నారాయణ ఆరోపించారు. ట్రంపుకు సాగిలపడటం తప్ప మోదీ మరేపని చేయలేకపోతున్నారని ఇందిరాగాంధీకి ఉన్న ధైర్యంలో ఐదు శాతం కూడా లేదని ఆయన తెలిపారు. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో నారాయణ మాట్లాడుతూ భారతదేశంపై యుద్ధ ప్రభావం ప్రారంభమైందని గ్యాస్ ఇతర నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోతున్నాయని ఎగుమతులు నిలిచిపోవడంతో తరువాయి 2లో

ఫరూఖ్ అబ్దుల్లాపై

# హత్యాయత్నం

పిస్టల్‌తో దుండగుడి కాల్పులు

త్రుటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి



**జమ్మూ :** జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లాపై బుధవారం రాత్రి ఓ దుండగుడు హత్యాయత్నం చేశాడు. అయితే ఈ హఠాత్ ప్రమాదం నుంచి ఫరూఖ్ అబ్దుల్లా అత్యంత చాకచక్యంగా తప్పించుకున్నారు. ఈ సంఘటన కలకలం రేపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇక్కడ ఒక వివాహమహోత్సవ శుభ కార్యక్రమానికి హాజరై బయటకు వెళుతున్న మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాపై వెనకనుంచి పిస్టల్‌తో ఓ దుండగుడు పాయింట్‌బ్లాంక్ రేంజిలో కాల్పులకు పాల్పడ్డాడు. ఈ దాడిని గమనించిన ఫరూఖ్ అబ్దుల్లా అత్యంత చాకచక్యంగా తప్పించుకున్నారని అధికారులు తెలిపారు. ఈ సంఘటన జరిగినప్పుడు తరువాయి 2లో

పశ్చిమాసియా పరిస్థితిపై...

ఉభయ సభలలో చర్చ జరగాలి

కేంద్రానికి ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్ 05

# ఆందోళనలో ప్రధాని మోదీ

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ వ్యాఖ్య

ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై పార్లమెంటు ప్రాంగణంలో ప్రతిపక్ష పార్టీల నిరసన



**న్యూఢిల్లీ:** దేశంలో గ్యాస్ సరఫరా కొరతపై ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో రాజకీయంగా కూడా ఈ విషయం పెద్ద చర్చకు దారితీస్తున్నది. వంట గ్యాస్ విషయంలో భయపడాల్సిన అవసరం లేదని ప్రజలకు భరోసా ఇస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అందుకు భిన్నంగా ఇతర కారణాలతో తానే స్వయంగా ఆందోళన చెందుతున్నారని కాంగ్రెస్ నేత తరువాయి 2లో



# హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్

## గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తెలంగాణ

'ఐలైన్ స్టూడియోస్' కార్యాలయాన్ని ప్రారంభించిన సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

'నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే సాక్షాత్తూ హాలీవుడ్ ఇక్కడికి వచ్చినట్లే' అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్ రావడం ఎంతో గర్వకారణమని తెలిపారు. హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన 'ఐలైన్ స్టూడియోస్' కార్యాలయాన్ని గురువారం ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ దిగ్గజ సంస్థ అయిన నెట్‌ఫ్లిక్స్ తన విస్తరణకు హైదరాబాద్‌ను ఎంచుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

**ఫ్యూచర్ సిటీలో నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్..**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న 'ఫోర్త్ సిటీ' (ఫ్యూచర్ సిటీ)లో నెట్‌ఫ్లిక్స్ తన కార్పొరేట్ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. దీనికి కావాల్సిన భూమితో పాటు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని హామీనిచ్చారు. వ్యాపారానికి అనుకూలమైన రాష్ట్రంగా తెలంగాణ నిలుస్తుందన్నారు. 'తెలంగాణ అంటేనే వ్యాపారం' అని, పెట్టుబడిదారులకు ఎల్లప్పుడూ ప్రభుత్వం పూర్తి రక్షణ ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రపంచంలోని టాప్ 500 కంపెనీలను తెలంగాణకు తీసుకురావడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పని చేస్తోందన్నారు.

**సినీ రంగానికి కేరాఫ్ అడ్రస్‌గా భాగ్యనగరం..**

గతంలో మద్రాసులో ఉన్న పరిశ్రమను ఎన్‌టిఆర్, ఏఎన్‌ఆర్ వంటి మహానుభావులు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని తెలుగు చిత్ర పరిశ్రమ ప్రస్థానాన్ని సిఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. నేడు బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, కల్కి వంటి సినిమాలతో తెలుగు సినిమా సాంకేతికత ప్రపంచ స్థాయికి చేరిందన్నారు. నెట్‌ఫ్లిక్స్ తరువాయి 2లో

కవితకు ఢిల్లీ హైకోర్టు

# నోటీసులు

అందజేసిన సిబిఐ అధికారులు

ప్రజాపక్షం/హైదరాబాద్



ఢిల్లీ లిక్కర్ కేసులో హైకోర్ట్ జారీ చేసిన నోటీసులను సిబిఐ అధికారులు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు అందజేశారు. ఈనెల 16వ తేదీన ఢిల్లీ హైకోర్ట్‌కు హాజరుకావాలని ఆ నోటీసులో పేర్కొన్నారు. ఈ మేరకు హైకోర్ట్ నోటీసులను కవితకు అందజేసేందుకు సిబిఐ అధికారులు హైదరాబాద్‌లోని కవిత ఇంటికి చేరుకున్నారు. అయితే ఆ సమయంలో ఆమె అందుబాటులో లేకపోవడంతో కవిత భర్త అనిల్‌కుమార్‌కు నోటీసులను అందజేసినట్టు తెలిసింది. ఢిల్లీ లిక్కర్ కేసులో ఇటీవల చార్జెస్ ఫ్రేమ్ చేయడానికి కూడా రౌస్ అవెన్యూ కోర్టు నిరాకరిస్తూ ఆ కేసును కొట్టేవేసిన విషయం తెలిసిందే. ఈ తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ అధికారులు ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. దీంతో ఢిల్లీ హైకోర్ట్ ఈ కేసుతో సంబంధం ఉన్న వారికి నోటీసులు జారీ చేసింది. ఇందులో భాగంగానే కల్వకుంట్ల కవితకు కూడా నోటీసులు జారీ చేశారు.

**న్యాయబృందంతో చర్చిస్తాం: కవిత**

హైకోర్ట్ నోటీసుల అంశంపైన తమ న్యాయబృందంతో చర్చిస్తామని కల్వకుంట్ల కవిత తెలిపారు. సత్యం తనకు తోడుగా ఉంటుందని, కేసు విషయంలో అధికారులకు సంపూర్ణంగా సహకరిస్తానని ఆమె ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు.




# నేటి నుంచి షోరూంలోనే వాహనాల రిజిస్ట్రేషన్

అమల్లోకి 'ఆన్‌లైన్' విధానం

ఉత్తర్వులు జారీ చేసిన రవాణా శాఖ కమిషనర్

ప్రజాపక్షం/హైదరాబాద్



వాహనాలు కొనుగోలు చేసిన షోరూంలోనే శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఆన్‌లైన్ విధానం అమలు చేస్తూ రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. 'జనవరి 24, 2026 నుండి రవాణా శాఖలో డీలర్ పాయిం ట్ రిజిస్ట్రేషన్ విధానం అమలు చేయబడింది. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి నాన్‌ట్రాన్స్‌పోర్ట్ మోటార్ సైకిళ్లు, కార్లు మొదటి రిజిస్ట్రేషన్ సమయంలో ఆర్‌టిఏ కార్యాలయాలకు వాహనాన్ని చూపించే అవసరాన్ని తొలగిస్తూ ముందుగా ఉత్తర్వులు జారీ చేయబడిన విషయం తరువాయి 2లో

మహిళా రైతుల డేటాను సేకరించి

# ప్రత్యేక విధానాన్ని రూపొందించాలి



ఐఐటి మద్రాస్ పరిశోధకురాలు వాణి ప్రశంస

ప్రజాపక్షం/హైదరాబాద్

మహిళా రైతుల డేటా సేకరించి ప్రత్యేక విధానం రూపొందించాలని ఐఐటి మద్రాస్ పరిశోధకురాలు (పిహెచ్‌డి) వాణి ప్రశంస అన్నారు. ఐక్య రాజ్యసమితి 2026 సంవత్సరాన్ని మహిళా రైతు సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో మహిళా రైతు సదస్సు జరిగింది. ఈ సదస్సుకు డాక్టర్ పర్లపల్లి అరుణదేవి (అసిస్టెంట్ ప్రొఫెసర్) అధ్యక్షత వహించారు. సదస్సుకు వాణి ప్రశంస, పరుచూరి జమున ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తరువాయి 12లో

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
13-03-2026
www.prajapaksham.in



## పోలీసు రక్షణలో మొజ్తాబాకు చికిత్స

### ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికారిక ప్రకటన



**మాస్కో :** మొజ్తాబా ఖమేనీ గాయపడి ఇరాన్ పోలీసుల రక్షణలో చికిత్స తీసుకుంటున్నారని ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఎస్మాయిల్ బఘై కొరియర్ వార్తాపత్రిక "డెల్లా సెరా"కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని టాస్ వార్తాసంస్థ గురువారం ప్రకటించింది. ఆయన ఆరోగ్యంగానే ఉన్నారని బఘై చెప్పారు. గాయాలు ఆయనను బాధ పెట్టలేదని, ఆయన బాగానే ఉన్నారని చెప్పారు. దేశ సర్వోన్నత పదవికి ముగ్గురు పోటీ పడ్డారని, కానీ 88 మంది సభ్యులుగల ఇరాన్ నిపుణుల చట్టసభలో ఎక్కువ మంది మొజ్తాబా నాయకత్వం అవసరమే ముగ్గురుకాపారని, ఆయనే నిపుణుల సభ కొత్త సర్వోన్నతనేతగా ఎన్నుకుందని ఎస్మాయిల్ బఘై తాజా ప్రకటనలో చెప్పారు. ఆయన చికిత్స పొందుతున్నట్లు ముందురోజు అనధికారిక వార్తలు వచ్చినప్పటికీ తాజాగా ఇరాన్ విదేశీమంత్రిత్వశాఖ అధికారికంగా ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. దీంతో మొజ్తాబా విషయంలో సందేహాలన్నీ తీరిపోయాయి. ఫిబ్రవరి 28వ తేదీ మొదటిరోజు జరిగిన భీకర దాడిలో ఇరాన్ సర్వోన్నతనేత అలీ ఖమేనీ, ఆయన అల్లుడు, కుమార్తె, మనవరాలుకోపోటు ప్రస్తుతం కొత్త సుప్రీంగా నియమితులైన మొజ్తాబా ఖమేనీ భార్య కూడామరణించారు. తండ్రి అలీ ఖమేనీ మరణించినప్పటినుండీ ఆయన రెండో కుమారుడు,అధికార వారసుడుగా నియమితులైన మొజ్తాబా ఖమేనీ కూడా కనిపించడంలేదని ప్రపంచవ్యాప్తంగా ప్రశ్నలన్నీ ఫోకస్ పెడుతున్నాయి. ఇరాన్ సుప్రీం అధినేతగా ఎవ రిని నియమించినాగానీ హతమారుస్తామని ఇజ్రాయెల్ ప్రతిజ్ఞ చేసింది. ఐతే ఈ ఎన్నికను ట్రంప్ తిరస్కరించారు. ఆయన అసమర్థుడని, ఇరాన్‌లోని సకల వ్యవస్థలను సక్రమంగా నిర్వహించగల సామర్థ్యం ఆయనకు లేదని, ఒకవేళ అధికారం చేపట్టినా ఆయనను ఎంతోకాలం అధికారంలో కొనసాగనివ్వబోమని ట్రంప్ శపథం చేశారు. ఇరాన్ పాలకుణ్ణి ఎన్నుకోవడానికి తమ అనుమతి కావాలని ట్రంప్ అన్నారు. తమ దేశ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని ఇరాన్ తాత్కాలిక త్రిసభ్య పాలక మండలి కూడా ట్రంప్‌కు ఒక హెచ్చరిక చేసింది. ఈ పూర్వరంగంలో మొజ్తాబా చికిత్స పొందుతున్నట్లు వార్త వచ్చింది.

## బంగ్లాదేశ్ అధ్యక్షుడిని తొలగించాలని పార్లమెంటు ఎదుట నిరసన ప్రదర్శన



**ఢాకా :** జులై స్ఫూర్తిని, ఉద్యమాన్ని అవమానించిన బంగ్లాదేశ్ అధ్యక్షుణ్ణి పదవి నుండి తొలగించాలని కోరుతూ పార్లమెంటు ఎదుట గురువారం ప్రదర్శకులు నిరసన తెలియజేశారు. జులై ఉద్యమంలో మరణించినవారి కుటుంబీకులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఒకవైపు పార్లమెంటు తొలి సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఈ నిరసన ప్రదర్శన జరిగింది. దేశాధ్యక్షుడు మహ్మద్ షాబుద్దీన్ ను పదవి నుండి తొలగించడం, ప్రజాభిప్రాయ సేకరణ ప్రకారం సంస్కరణలు అమలు చేయడం, జులైలో జరిగిన దారుణ కేసులపై విచారణ చేయడం అనే మూడు డిమాండ్ల పరిష్కారం కోసం నేషనల్ సిటిజన్ పార్టీ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలు ఈ నిరసన ప్రదర్శన చేపట్టాయి. సామూహిక తిరుగుబాటు, అ మరవీరుల త్యాగం కారణంగా మీరు ఈరోజు పార్లమెంటులో కూర్చోగలుగుతున్నారని, అందువల్ల దేశాధ్యక్షుణ్ణి పదవి నుండి తొలగించాలని వారు కోరుతూ ప్ల కార్డులు ప్రదర్శించారు. జులై ఉద్యమంలో ప్రాణాలు అర్పించిన నైనా సు ల్తానా తల్లి ఐనున్ నహార్ మాట్లాడుతూ, కొత్త బంగ్లాదేశ్‌కోసం తమ పిల్లలు ప్రా ణాలు అర్పించినాగానీ ఆ కలలు నెరవేరలేదన్నారు. జులై ఛార్టర్ అమలులో ఇక జాప్యాన్ని సహించబోమన్నారు.

## బంగ్లాదేశ్‌లో ఇంటింటా స్వయం సమృద్ధే లక్ష్యం

### పార్లమెంటు తొలి సమావేశంలో ప్రధాని తారిఖ్ రెహ్మాన్ పిలుపు



**ఢాకా:** బంగ్లాదేశ్ ప్రతి కుటుంబం స్వయం సమృద్ధి సాధించడమే తమ ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుందని ఆ దేశ ప్రధానమంత్రి తారిఖ్ రెహ్మాన్ చెప్పారు. ప్రధానమంత్రి షేక్ హసీనా పదవీచ్యుతురాల్ని చేసిన తిరుగుబాటు ఉద్యమం తర్వాత జరిగిన ప్రతిష్ఠాత్మకమైన ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన బిఎన్‌పి చైర్మన్ తారిఖ్ రెహ్మాన్ ప్రధానమంత్రి పదవి చేపట్టిన తర్వాత ప్రథమంగా మొదటిసారి సమావేశమైంది. పవిత్ర ఖురాన్ పారాయణంతో సమావేశం ప్రారంభమైన తర్వాత తారిఖ్ రెహ్మాన్ స్వాగత ప్రసంగం చేశారు. గురువారం జాతీయ సంసద్ తొలి సమావేశంలో ఆయన మాట్లాడుతూ, బంగ్లాదేశ్‌లో ప్రతి కుటుంబానికీ స్వయంసమృద్ధం చేసేందుకు, దేశాన్ని సంపన్న, సురక్షి ప్రజాస్వామ్య కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రతిపక్షాలు కూడా పూర్తి సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. తాను తన పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ, పార్టీ అభిప్రాయాలు, జాతి, మతంతో సంబంధం లేకుండా దేశంలో ప్రజలను తాను ప్రాతినిధ్యం వహిస్తున్నానని స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలు కాపాడటమే తన రాజకీయమన్నారు. స్వావలంబన, సురక్షిత, ప్రజాస్వామ్య బంగ్లాదేశ్‌ను స్థాపించాలని బిఎన్‌పి రాజకీయ లక్ష్యంగా నిర్దేశించుకుందని, ప్రజాస్వామ్యాన్ని ప్రేమించే ప్రజలందరూ తమకు పూర్తి మద్దతు తెలియజేయాలని కోరారు. ఈ మహోన్నతమైన పార్లమెంటులో ప్రతి సభ్యుడూ సహకారం అందించాలని కోరుతున్నానన్నారు. వివిధ రాజకీయపార్టీలు భిన్నాభిప్రాయాలు, కార్యక్రమాలు అమలు చేసినప్పటికీ ప్రజాస్వామ్య విలువల రక్షణ, దేశసార్వభౌమాధికార రక్షణలో మాత్రం ఏకాభిప్రాయం ఉండాలన్నారు. బానిసత్వం, ఫాసిజం లేని సురక్షిత,సార్వభౌమ, సుసంపన్న, ప్రజాస్వామ్య బంగ్లాదేశ్ సాధనలో మన మధ్య (రాజకీయపార్టీల మధ్య) ఎలాంటి భిన్నాభిప్రాయాలు ఉండకూడదన్నారు. దేశబహిష్కృతురాలైన హసీనా ప్రభుత్వం పార్లమెంటును జాతీయ కార్యకలాపాల వేదికగా తీర్చిదిద్దడంలో విఫలమైందని, దేశాన్ని బలహీన పరచిందని విమర్శించారు. దేశంలో కొత్త పాలనా యంత్రాంగం జాతీయ పార్లమెంటును దేశంలోని సమస్యల పరిష్కారానికి ఒక నిర్మాణాత్మకమైన చర్చావేదికగా మార్చాలని కోరుకుంటోందని అన్నారు.

## చైనా చాంగ్ ఈ–7 చంద్రాన్వేషణ ఈ ఏడాదే

**బీజింగ్ :** భూమి ఉపగ్రహం చంద్రుణ్ణి క్షుణ్ణంగా లోతుగా అన్వేషణ చేయడానికి చైనా చేపట్టిన ప్రతిష్ఠాత్మకమైన అన్వేషణయానం ఈ ఏడాదిలో షురూ కానున్నది. చంద్రుణ్ణి కేంద్రంగా చేసుకుని అనంత రోదసి అన్వేషణకు శ్రీకారం చుట్టడం, చంద్రుడి దక్షిణ ధ్రువంలో నీటిని లక్ష్యంగా చేసుకుని ప్రయోగాలు,లోతైన పరిశీలన నిమిత్తం ఈ ఏడాదిలోనే చైనా ప్రయోగాలు సన్నద్ధం అవుతోంది. భవిష్యత్తులో చంద్రుడిపై స్థిరమైన మానవ ఉనికిని సాధించడం, కీలకమైన నీటి వనరులను అన్వేషించడం ఒక నిర్ధయాన్ని రావడంకోసం "చాంగ్ ఈ–7 చంద్రాన్వేషణ" ఈ ఏడాదిలోనే ప్రారంభిస్తోంది. ఇస్రో తరహాలో ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేసే చైనా ఏరోస్పేస్ సైన్స్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్ (సిఎఎస్‌సి) ప్రభుత్వ మీడియాకు ఈ విషయం గురువారం తెలియజేసింది. చైనా జాతీయ 14వ పీపుల్స్ కాంగ్రెస్ ముగింపు సమావేశాల సందర్భంగా కాంగ్రెస్ డిప్యూటీ, చైనా ఏరోస్పేస్ అండ్ టెక్నాలజీ కార్పొరేషన్‌లో లీడింగ్ ఇంజనీరు సన్ జెజౌ బీజింగ్ లో చంద్రాన్వేషణ కార్యక్రమం గురించి వివరించారు. చంద్రుడి దక్షిణ ధృవరేఖ వాతావరణం, నీటి మంచు నిల్వల అన్వేషణలపైనే ఎక్కువగా ఈ పరిశోధనల్లో దృష్టిపెడతామని ఆయన చెప్పారు. చంద్రుడిపై స్థలం ఆకృతి ఎలా ఉంది? అక్కడి భౌగోళిక వాతావరణం ఎలా ఉంది? నీటి నిక్షేపాలు, పదార్థాల కూర్పు వంటి అనేక అంశాలను ఖచ్చితత్వంతో అన్వేషించి కొలతలు తీసేందుకే ఈ అన్వేషణ ప్రారంభించినట్లు ఆయన చెప్పారు.



## చిలీ అధ్యక్షుడుగా జోస్ ఆంటోనియో కాస్ట్

**శాంటియాగో:** ప్రకృతి వనరులకు ప్రసిద్ధిగాంచిన దక్షిణ అమెరికా పశ్చిమప్రాంత దేశం చిలీ దేశాధ్యక్షుడుగా జోస్ ఆంటోనియో కాస్ట్ (60) పదవీ బాధ్యతలు తీసుకున్నారు. తీరప్రాంత నగరమైన వాల్ప రైసోలో ఆయన పదవీ ప్రమాణ స్వీకారం చేశారు.స్వేచ్ఛా ప్రజాస్వామ్య విధానాలను పూర్తిగా వ్యతిరేకించే పచ్చి ఛాందస జాతీయవాది, స్వంత్ర నాయకుడు, ట్రంప్ ఆశీర్వాదాలు పొందిన నాయకుడు జోస్ ఆంటోనియో కాస్ట్. 2002 2018 వరకు ఆయన ఛాంబర్ ఆఫ్ డిప్యూటీస్‌లో సభ్యుడుగా కొనసాగారు. 2016 వరకు ఇండిపెండెంట్ డెమొక్రటిక్ యూనియన్‌లో ఆయన సభ్యుడుగా కొనసాగారు. 2019లో రిపబ్లికన్‌పార్టీ స్థాపించారు. 2025 నవంబరులో జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టుపార్టీ అభ్యర్థి,కమ్యూనిస్టు ప్రభుత్వంలో కార్మికమంత్రి జాన్నెత్ జారాతో పోటీపడి డిసెంబరులో జరిగిన రన్నాఫ్ ఎన్నికల్లో విజయం సాధించారు. దేశంలో కమ్యూనిస్టు తరపున అధ్యక్షుడుగా ఉన్న గాబ్రియేల్ బోరిక్ పదవీకాలం ముగిసిన తర్వాత ఇప్పుడు ఆంటోనియో కాస్ట్ దేశాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ట్రంప్ తరహాలోనే దేశంలో అక్రమ వలసలను అరికడతానని ప్రజలకు భరోసా ఇచ్చి 58 శాతం ఓట్లు కాస్ట్ సంపాదించారు. కాస్ట్ చెప్పిన వాగ్దానాలు నెరవేర్చాలంటే సరిహద్దుల్లో భద్రతను కట్టుదిట్టం చేయాలి. అందుకు ఎంతగానో భారీ ఖర్చు చేయాల్సి ఉంటుంది. అదే ఆయనకు పెద్ద సవాలు. 1990లో చిలీలో ప్రజాస్వామ్యం తిరిగి వచ్చిన తర్వాత ప్రజలు ఇప్పటివరకూ ఎంతో స్వేచ్ఛగా జీవించారు. ఇక దేశంలో ఛాందసవాద పాలన ప్రారంభమయ్యే సూచనలు ఉన్నాయి.

## చైనా–ఉత్తర కొరియా మధ్య రైళ్ళ పునరుద్ధరణ



**బీజింగ్ :** చైనా–ఉత్తర కొరియా మధ్య రైళ్ళ రాకపోకలు తిరిగి ప్రారంభమయ్యాయి. చైనా రాజధాని బీజింగ్ నుండి ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్‌యాంగ్‌కు ప్రయాణికుల రైలు కె–27 గురువారం ఉదయం బయలుదేరి వెళ్ళింది. ఆరు సంవత్సరాల తర్వాత ఈ రైళ్ళ రాకపోకలు తిరిగి మొదలయ్యాయి. పొరుగుదేశాలతో సంబంధాలు బలోపేతం చేసుకోవడానికి ఇటీవలికాలంలో చైనా అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. చైనా సరిహద్దు నగరం డాంగ్‌యాంగ్‌లో ఆగి విరామం తీసుకున్న తర్వాత బోహై సముద్రం ఉత్తరం వైపు మళ్ళీ బయలుదేరి 24.40 గంటలసేపు రైలు ప్రయాణం చేసి శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు ప్యాంగ్‌యాంగ్ చేరుకుంటుంది. రెండు దేశాలమధ్యా ప్రజల రాకపోకలకు, స్నేహపూర్వక సంబంధాలకు ఇదెంతో ప్రయోజనకరంగా ఉంటుందని చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి చెప్పారు.

## ఇరాన్, లెబనాన్, ఇజ్రాయెల్‌లో 1800 మృతి : 12,500 మందికి గాయాలు

**ఐక్యరాజ్యసమితి :** అమెరికా–ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో 13 రోజులుగా ఇరాన్, లెబనాన్, ఇజ్రాయెల్ దేశాలలో 1800 మంది మరణించారనీ, మరో 12,500 మంది గాయపడ్డారనీ ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ ఘెబ్రేయేసస్ గురువారం చెప్పారు. ఈ ప్రాంతంలో ఆరోగ్య సౌకర్యాలపై కూడా దాడులు విపరీతంగా పెరిగాయని చెప్పారు. ఇరాన్‌లో 18, లెబనాన్‌లో 25, ఇజ్రాయెల్‌లో రెండు ఆరోగ్య సౌకర్యాలపై దాడులు జరిగినట్లు గు ర్తించామన్నారు. ఇరాన్‌లో తమ నిర్దేశిల దాడుల లక్ష్యాలు పూర్తయిన తర్వాత మాత్రమే యుద్ధం ముగుస్తుందని ట్రంప్ చెప్పారు. అమెరికా,ఇరాన్ చర్చల బల్ల దగ్గరకు రాకపోతే యుద్ధం మరో రెండు వారాలు కొనసాగే అవకాశాలు ఉన్నాయి.

## హైదరాబాద్‌కు నెట్‌ఫ్లిక్స్

(మొదటి పేజీ తరువాయి)

రాకతో మన స్థానిక సంస్కృతి, ప్రతిభ అంతర్జాతీయ వేదికపై మరింతగా మెరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

### క్రీడారంగంలో నెట్‌ఫ్లిక్స్ సహకారం..

నెట్‌ఫ్లిక్స్ ఇటీవల క్రీడా ప్రసారాలపై దృష్టి సారించడాన్ని ముఖ్యమంత్రి స్వాగతించారు. తెలంగాణలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని, క్రీడా మౌలిక సదుపాయాల కల్పనలో నెట్‌ఫ్లిక్స్ భాగస్వామ్యం కోరుకుంటున్నామని తెలిపారు. నెట్‌ఫ్లిక్స్ వృద్ధి, హైదరాబాద్ అభివృద్ధి ఒకే దిశలో సాగుతున్నాయని ముఖ్యమంత్రి అన్నారు. డివిడి అద్దె సంస్థగా ప్రారంభమైన నెట్‌ఫ్లిక్స్, ప్రపంచ ఓటిటి రంగంలో అగ్రస్థానానికి ఎదగడం ఎంతో ప్రేరణాత్మకమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిభను, మంచి కంటెంట్‌ను ప్రేక్షకులకు అందించడం నెట్‌ఫ్లిక్స్ లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సిఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు తదితరులు హాజరయ్యారు.

## ఆందోళనలో మోదీ

(మొదటి పేజీ తరువాయి)

రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. గ్యాస్ కొరత సమస్యపై ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్ ప్రాంగణంలో నిరసనలు చేపట్టాయి. ఈ నిరసనల్లో రాహుల్ గాంధీతో పాటు, ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర ప్రతిపక్ష ఎంపిలు పాల్గొన్నారు. పార్లమెంట్ భవనం సమీపంలోని మకర్ ద్వార్ వద్ద జరిగిన ఈ నిరసనలో కాంగ్రెస్, డిఎంకె, తృణమూల్ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీకి చెందిన ఎంపిలు కూడా పాల్గొన్నారు. వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై ప్రభుత్వం స్పష్టమైన సమాధానం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ ప్రధాన మంత్రి ప్రజలకు భయపడొద్దని చెబుతున్నప్పటికీ ఆయన స్వయంగా భయపడుతున్నారని ఎద్దేవా చేవారు. 'ప్రధాన మంత్రి కొన్ని అంతర్జాతీయ అంశాల కారణంగా ఒత్తిడిలో ఉన్నారు' అని ఆరోపించారు. ముఖ్యంగా అమెరికాలో ఉన్న జెఫ్రీ ఎప్‌స్టైన్ కేసుకు సంబంధించిన ఫైళ్ల అంశం, వ్యాపారవేత్త గౌతం అదానీపై అమెరికాలో జరుగుతున్న విచారణల కారణంగా ప్రధాని ఆందోళన చెందుతున్నారని రాహుల్ వ్యాఖ్యానించారు. అందుకే పార్లమెంట్‌లో జరిగే చర్చలకు మోదీ హాజరుకావడం లేదని కూడా ఆయన విమర్శించారు. ఈ నిరసన సమయంలో ప్రతిపక్ష ఎంపిలు 'నామ్ నరేంద్ర, కామ్ సరెండర్' వంటి నినాదాలు చేశారు. మహిళా ఎంపిలు ఒక మాక్ మట్టి పొయ్యిని తీసుకుని నిరసన తెలిపారు. ఇది గ్యాస్ కొరత కారణంగా ప్రజలు సంప్రదాయ వంట పద్ధతులకు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితిని సూచించే ప్రతీకగా ఉపయోగించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా ప్రభుత్వాన్ని విమర్శించారు. దేశం తీవ్రమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో ప్రధాన మంత్రి ఎన్నికల ప్రచారంలో నిమగ్నమై ఉన్నారని ఆయన ఆరోపించారు. దేశవ్యాప్తంగా గ్యాస్ కొరత వల్ల ప్రజలు క్యూలలో నిలబడాల్సి వస్తోందని, చిన్న పెద్ద పరిశ్రమలు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆయన పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ దౌత్య వైఫల్యం, ఇంధన విధానాల లోపం కారణంగా ఏర్పడిన పరిస్థితిగా ఖర్గే అభివర్ణించారు.

## రిజిస్ట్రేషన్

(మొదటి పేజీ తరువాయి)

తెలిసిందే. ఇప్పటివరకు డీలర్లు ఫాం20 (ఫైనాన్సియర్ సంతకంతో, అవసరమైతే), ఇతర పేపర్ ఆధారిత పత్రాలను స్పీడ్ పోస్ట్ లేదా కొరియర్ ద్వారా సంబంధిత ఆర్‌టిఎ కార్యాలయాలకు పంపిస్తున్నారు. అయితే ఈ విధానం వల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఆలస్యం జరుగుతున్నట్లు గమనించబడింది. ఈ నేపథ్యంలో క్రింది మార్పులను అమలు చేయాలని రవాణా శాఖ నిర్ణయించింది. ఈ ఆదేశాలు నేటి నుండి అమల్లోకి వస్తాయి' అని ఒక ప్రకటనలో తెలిపారు.

### ముఖ్య నిర్ణయాలు..

- నేటి నుండి, డీలర్లు ఆర్‌టిఎ కార్యాలయాలకు ఫాం20, ఇతర పేపర్ పత్రాలను ఫిజికల్‌గా సమర్పించే విధానాన్ని పూర్తిగా రద్దు చేయబడింది.
- ఇకపై డీలర్లు వాహన యజమానితో పాటు ఫైనాన్సియర్ (అవసరమైతే) సంతకాలతో కూడిన ఫాం20, ఇతర పత్రాల స్కాన్ కాపీలను మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- 13వ తేదీ తర్వాత జారీ అయ్యే టెంపరరీ రిజిస్ట్రేషన్ (టిఆర్) ఉన్న వాహనాలకు ఫిజికల్ పత్రాలు ఆర్‌టిఎ కార్యాలయాలు స్వీకరించవు.
- 13వ తేదీకి ముందు టిఆర్ పొందిన వాహనాలకు కూడా, డీలర్లు ఫాం 20తో పాటు ఇతర పత్రాల స్కాన్ కాపీలు అప్‌లోడ్ చేసి ఆన్‌లైన్ ద్వారా శాశ్వత రిజిస్ట్రేషన్ పొందే అవకాశం కల్పించబడింది.
- డీలర్లు అప్‌లోడ్ చేసే పత్రాలకు పూర్తి బాధ్యత వారిదే. తప్పుడు లేదా నకిలీ పత్రాలు సమర్పించినట్లయితే క్రిమినల్ చర్యలు తీసుకోబడతాయి.
- ఆర్‌టిఎ కార్యాలయాల్లో అందిన ఆన్‌లైన్ దరఖాస్తులను రెండు పని దినాల్లోపే పరిశీలించి ఆమోదం లేదా రివ్యూ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయబడినాయి. ఆలస్యం జరిగితే కఠిన చర్యలు తీసుకోబడతాయి.
- డీలర్లు తమ వద్ద 7 రోజులకు మించి దరఖాస్తులు పెండింగ్‌లో ఉంచకూడదు. ఉల్లంఘన జరిగినట్లయితే వారి లాగిన్ నిలిపివేయడంతో పాటు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోబడతాయి.
- అన్ని అధీకృత ఆటోమొబైల్ డీలర్లుపై మార్పులను గమనించి, వాహనాల శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఫాం20, ఇతర పత్రాలను కేవలం ఆన్‌లైన్ విధానంలోనే సమర్పించాలి.

## బలహీన ప్రధాని

(మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ ఉత్పత్తుల ధరలు కూడా పడిపోనున్నాయని ఆయ న తెలిపారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ ఆర్థిక వనరులున్న దేశాలపై దాడులు చేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని వెనుజులా తర్వాత ఇరాన్‌పై యుద్ధం చేస్తున్నాడని, క్యూబాపై కూడా దాడికి ప్రయత్నం చేస్తున్నాడని తెలిపారు. ట్రంప్‌ను చూసి మోదీ భయపడుతున్నాడని 140 కోట్ల మంది దేశ ప్రజల ఆత్మగౌరవాన్ని ట్రంప్‌కు తాకట్టుపెట్టారన్నారు. ట్రంప్ కు వ్యతిరేకంగా మోదీ నోరు విప్పాలని మూడో ప్రపంచ యుద్ధ పరిస్థితులు నెలకొంటున్న దశలో శాంతికి అలీనదేశంగా భారత్ గట్టి ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రపతి ద్రౌపతిముర్ము వైఖరి సమర్థనీయం కాదని రాష్ట్రపతిగా ఆదివాసీ మహిళ ఉన్నందుకు గర్వపడుతున్నాము కానీ ఆదివాసీలకు నష్టం చేసే చర్యలు ప్రభుత్వానికి అనుమతులివ్వడాన్ని మాత్రం సమర్థించబోమని ఆయన తెలిపారు. అటవీ హక్కుల చట్టాన్ని మార్చి అటవీ భూములను కార్పొరేట్‌కు అప్పగించే భాగంగానే ముర్ముకు రాష్ట్రపతి పదవిచ్చి ఆమె చేతనే ఆదివాసీలకు నష్టం కలిగించే చర్యలకు బిజెపి ఆమోదం తీసుకుంటుందన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను చంపి, అడవుల నుంచి ఆదివాసీలను తరిమి ఆ భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. మావోయిస్టు నేతలను చంపిన ప్రతిసారి కార్పొరేట్లకు వేల ఎకరాలు స్వాధీనం చేయడమే ఇందుకు నిదర్శనమన్నారు. వ్యక్తులుగా సంహరించి తాత్కాలికంగా ఆనందం పొందవచ్చునేమో కానీ సిద్ధాంతాన్ని నశింపజేయలేరని అది ఎవరి తరం కాదని నారాయణ తెలిపారు. మావోయిస్టు రహిత భారతదేశం కాదని పేదరిక రైతు భారతదేశంగా తయారు చేయాలని ఆయన అమిత్‌షాకు సవాల్ విసిరారు. ఖమ్మం వెలుగుమట్ల ఘటనపై స్పందిస్తూ భూస్వామ్య భూములను కమ్యూనిస్టులు ఆక్రమించే క్రమంలోనే భూదాన ఉద్యమం వచ్చిందన్నారు. ఈ దేశంలో ముఖ్యంగా తెలంగాణలో లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. వెలుగుమట్లలో నివాసాలను కూల్చడం ఎందుకు తిరిగి అక్కడే పట్టాలివ్వడం ఎందుకని నారాయణ ప్రశ్నించారు. అక్కడ నివసించే వారందరూ భారతీయులే కాబట్టి పేదలందరికీ పట్టాలు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అర్థం పర్థం లేని చర్యలు రియల్టర్ల కోసమే జరిగాయని ఇది దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు.

### కమ్యూనిస్టులను బలహీనపర్చడమే వారి ధ్యేయం : కూనంనేని

కమ్యూనిస్టులను బలహీన పర్చడమే వారి ధ్యేయమని అందుకే కమ్యూనిస్టులపై అనవసర విమర్శలు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. మేము ఎలా పనిచేయాలో మాకు తెలుసునని పేదల పక్షాన పనిచేయడమే మా కర్తవ్యమని విద్వేశంతో మాపై విమర్శలు చేయడం తగదన్నారు. రాష్ట్రంలో ఎనిమిది వేల మంది పేదలతో గుడిసెలు వేయించామని వాటికి పట్టాలివ్వాలని 58 జీవో ద్వారా రెగ్యులర్ చేయాలని పోరాడుతున్నామన్నారు. నివాస స్థలాల పంపిణీ, ఇండ్ల నిర్మాణం ప్రభుత్వ బాధ్యత అని అది భిక్ష కాదని కూనంనేని తెలిపారు. కమ్యూనిస్టుల పోరాట ఫలితంగానే లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిందని, నిత్యం ప్రజల కోసమే మా పోరాటమని కుహనా వాదుల సూచనలు మాకు అవసరం లేదన్నారు. మావోయిస్టుల త్యాగాలను సిపిఐ గుర్తించిందని, ప్రజా పోరాటాలకు కలిసి రావాలని కోరామన్నారు. వ్యక్తిగత అవసరాల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికే సిపిఐ కృషి చేస్తుందని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల అవసరం ఈ సమాజానికి ఉందని రానున్న కాలంలో మరింత బలపడాల్సిన అవసరం ఉందన్నారు. సిపిఐ ప్రజా ప్రతినిధులకు ఈనెల 13, 14 తేదీల్లో రెండు రోజుల పాటు పాల్వంచలో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి జాతీయ నాయకులు కె. నారాయణ, పల్లా వెంకటరెడ్డి, కె. రామకృష్ణ హాజరుకానున్నారని కూనంనేని తెలిపారు. మీడియా సమావేశంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 16 నుంచి ఒంటిపూట బడులు

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ సంచాలకులు డాక్టర్ ఇ.నవీన్ నికోలాస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ నెల 15వ తేదీ నుంచి ఒంటిపూట బడులు ప్రారంభకానున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కానీ 15వ తేదీ ఆదివారం కావడంతో ఆ మరుసటి రోజు నుంచి ఒంటిపూట బడుల విధానం ప్రారంభకానుంది. పదవ తరగతి పబ్లిక్ పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కొనసాగనున్నాయి. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం (మిడ్ డే మీల్స్) మధ్యాహ్నం 12.30 గంటలకు అందించనున్నారు. ఒంటిపూట బడుల విధానం కచ్చితంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని నవీన్ నికోలాస్ ఆదేశించారు. ఒంటిపూట బడులను అమలు తీరుపైన జిల్లా విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని అన్ని పాఠశాలలకు తెలియజేయాలని, అలాగే నిరంతరం పర్యవేక్షించాలని ఆయన సూచించారు.

## అబ్దుల్లాపై హత్యాయత్నం

(మొదటి పేజీ తరువాయి)

జమ్మూకశ్మీర్ ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సలహాదారు నాసిర్ అస్లాం వని ఆయన వెంట ఉన్నారు. కాగా నిందితుడు 63 ఏళ్ల కమల్ సింగ్ జమ్వాల్‌ను జమ్మూలోని పురానీ మండి నివాసిగా పోలీసులు గుర్తించారు. తాను 20ఏళ్లుగా ఫరూఖ్ అబ్దుల్లాను చంపేందుకు నిరీక్షిస్తున్నానని నిందితుడు కమల్‌సింగ్ జమ్వాల్ పోలీసుల విచారణలో చెప్పారు. ఈ హత్యాయత్నం ఘటనపై స్పందించిన జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా మాట్లాడుతూ తన తండ్రి ప్రాణాలను కాపాడినందుకు తాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెబుతున్నానని చెప్పారు. 'ప్రస్తుతానికి వివరాలు అస్పష్టంగా ఉన్నాయి. కానీ తెలిసిన విషయం ఏమిటంటే లోడ్ చేసిన పిస్టల్‌ను కలిగి ఉన్న ఓ వ్యక్తి పాయింట్‌బ్లాంక్ రేంజ్‌లోకి వెళ్లి కాల్పులు జరపగలిగాడు'. జమ్మూ గ్రేటర్ కైలాష్‌లోని రాయల్ పార్క్‌లో జరిగిన ఒక వివాహ వేడుకకు హాజరైన ఫరూఖ్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగిందని పోలీసులు చెప్పారు. భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆ చర్యను అడ్డుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారని, ఆ తర్వాత ఆ వ్యక్తిని కమల్‌సింగ్‌గా గుర్తించామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు. నేరానికి ఉపయోగించిన పిస్టల్‌ను నిందితుడి వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నట్లు ఆ ప్రకటన తెలిపింది. తదుపరి విచారణ కొనసాగుతున్నదని పోలీసులు చెప్పారు. సిసిటీవీ ఫుటేజీలో దుండగుడు ఫరూఖ్ అబ్దుల్లాను వెనక నుంచి సమీపించి చాలా దగ్గరగా కాల్పులు జరపడం కనిపించింది.జమ్మూ కశ్మీర్ భద్రతా విభాగానికి చెందిన ఇద్దరు అధికారులు, ఒక ఇన్‌స్పెక్టర్, ఒక సబ్ ఇన్‌స్పెక్టర్‌కు నిందితుడు మతిస్థిమితం లేని స్థితిలో కనిపించాడని అధికారులు వెల్లడించారు. పార్టీ నేత బి.ఎస్.చౌహాన్ కూతురి వివాహం కోసం కార్యక్రమానికి హాజరైన ఫరూఖ్ అబ్దుల్లా, సురీందర్ చౌదరి దాదాపు ఒక గంటకు పైగానే వివాహ వేదిక వద్ద గడిపారని అధికారులు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లా కూడా ఉన్న ఒక వివాహ పార్టీలో ఓ దండగుడు లైసెన్స్ పొందిన పిస్టల్‌ను ఉపయోగించి కాల్పులు జరిపిన సంఘటన చోటుచేసుకుంది. నిందితుడిని అరెస్ట్ చేశాం. సమగ్ర దర్యాప్తు జరుగుతోంది. ఈ ఘటనలో ఎలాంటి 'ఉగ్ర కోణం' లేదు అని ఎస్‌పి (సిటీ సౌత్) అజయ్ శర్మ తన 'ఎక్స్' పోస్ట్‌లో చెప్పారు. ఈ ఘటనపై ఉప ముఖ్యమంత్రి సురీందర్ చౌదరి ఆందోళన వ్యక్తం చేస్తూ 'ఇంత పెద్ద ఉపద్రవం ఎలా జరిగిందో భద్రతా అధికారులను, పోలీసులను మీరే అడగాలి' అని ఆయన విలేకరులను ఉద్దేశించి అన్నారు.

### జమ్మూ కశ్మీర్‌కు రాష్ట్ర హోదా రద్దే కారణం : ఖర్గే

నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు, మాజీ సిఎం ఫరూఖ్ అబ్దుల్లాపై బుధవారం రాత్రి జరిగిన హత్యాయత్నాన్ని పలువురు నాయకులు ఖండించారు. సంఘటనకు రాష్ట్ర హోదా రద్దునే కారణమని గురువారం రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఈ అంశాన్ని లేవనెత్తారు. మాజీ ముఖ్యమంత్రి భద్రతకు ముప్పు ఉన్నదని ఖర్గే ఆందోళన వ్యక్తంచేశారు. 'స్థానిక భద్రత, ఏర్పాట్లు గతంలో రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఉన్నప్పుడు అలాంటి సంఘటనలు జరుగలేదన్నారు. ఫరూఖ్ అబ్దుల్లాను చంపడం ప్రభుత్వ ఉద్దేశమా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రానికి పూర్తి హోదా లభించినప్పుడు ప్రజలు సురక్షితంగా ఉంటారని , కశ్మీర్ ప్రజలు మీ చేతుల్లో సురక్షితంగా లేరు' అని ఖర్గే కేంద్రాన్ని ఉద్దేశించి పేర్కొన్నారు. దీనిపై మాట్లాడిన కేంద్ర మంత్రి జె.పి.నడ్డా మాట్లాడుతూ ప్రభుత్వం ఫరూఖ్ అబ్దుల్లా భద్రత విషయానికి సంబంధించి తీసుకోవాల్సిన అన్ని చర్యలనూ చేపడుతుందని చెప్పారు. ఫరూఖ్ అబ్దుల్లాపై జరిగిన 'హత్యాత్మక దాడి' చాలా ఆందోళనకరమైన, చాలా తీవ్రమైన విషయం అని ఆయన అన్నారు. భారత ప్రభుత్వం ఈ విషయాన్ని చాలా తీవ్రంగా పరిగణిస్తోందని, సమగ్ర దర్యాప్తు జరుగుతున్నదని మంత్రి జె.పి.నడ్డా హామీ ఇచ్చారు.

### 'దేవుడు నన్ను రక్షించాడు' : విలేకరులతో ఫరూఖ్ అబ్దుల్లా

తనపై జరిగిన హత్యాయత్నం ఘటనపై మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దులా మాట్లాడుతూ 'దేవుడు నన్ను రక్షించాడు' అని వ్యాఖ్యానించారు. వేదిక వద్ద తగినంత భద్రత లేకపోవడంపై ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తనపై ఎవరు దాడి చేశారో తనకు తెలియదని 88ఏళ్ల అనుభవజ్ఞుడైన నాయకుడు ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. 'ఆ వ్యక్తి గురించి నాకేమీ తెలియదు. అతని ఉద్దేశం ఏమిటో కూడా తనకు తెలియదని ఇక్కడి భటిండాలోని ఆయన నివాసంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ హత్యాయత్నం ఘటన అనంతరం హోం మంత్రి అమిత్ షా ఫరూఖ్ అబ్దుల్లాకు ఫోన్ కాల్ చేసి మాట్లాడారని, దీనిపై సమగ్రంగా దర్యాప్తు చేస్తామని హామీఇచ్చారని తెలిపారు.

### హత్యాయత్నం ఘటనపై కేరళ సిఎం పినరయి దిగ్భ్రాంతి

జమ్మూ కశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూఖ్ అబ్దుల్లాపై హత్యాయత్నం ఘటనపై ఆయన తీవ్ర ఆందోళ వ్యక్తం చేశారు. జెడ్+ఎన్‌ఎస్‌జి ప్రొటెక్షన్ ఉన్నప్పటికీ ఇంత భద్రతా ఉల్లంఘన ఎలా జరిగిందని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ప్రశ్నించారు.ఈ సంఘటన అధికారుల నుంచి తక్షణ సమాధానాలను కోరుతున్న తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతోంది. ఫరూఖ్ సాబ్, అతని కుటుంబానికి మేం పూర్తి సంఘీభావం తెలియచేస్తున్నాం అని ఆయన అన్నారు. భారత ప్రజాస్వామ్యంలో హింసకు ఏ మాత్రం తావులేదని సిఎం విజయన్ నొక్కిచెప్పారు.

## భారత నౌకలకు అనుమతి!

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. అయితే ఈ చర్చల అనంతరం ఎలాంటి అధికారిక ఒప్పందం కుదిరిందనే విషయాన్ని రెండు దేశాలు కూడా స్పష్టంగా ప్రకటించలేదు. ఇదే సమయంలో సౌదీ అరేబియా నుంచి చమురు తీసుకువస్తున్న షెన్‌లాంగ్ అనే ఆయిల్ ట్యాంకర్ నౌక హోర్ముజ్ జలసంధి దాటి ముంబయి పోర్టుకు చేరుకుంది. ఈ నౌక స్యూజ్‌మాక్స్ తరహా పెద్ద ట్యాంకర్. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన తర్వాత మధ్యప్రాచ్యం నుంచి భారతదేశానికి చేరుకున్న తొలి చమురు ట్యాంకర్ ఇదే అని సమాచారం. ఇది భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్)కు చమురు అందిస్తుందని తెలిసింది. ఇలావుంటే, భారత ప్రభుత్వం తెలిపిన ప్రకారం ప్రస్తుతం హోర్ముజ్ జలసంధి తూర్పు, పడమర ప్రాంతాల్లో 28 భారత జెండా గల నౌకలు ప్రయాణిస్తున్నాయి. వీటిలో మొత్తం 778 మంది భారత నావికులు ఉన్నారు. వారి భద్రత కోసం నౌక యజమానులు, షిప్పింగ్ సంస్థలు, నియామక సంస్థలు, భారత రాయబార కార్యాలయాలు పరస్పరం సమన్వయంతో ముందుకు వెళుతున్నాయి. ఇక యుద్ధ పరిస్థితుల కారణంగా భారత్ మానవతా దృక్పథంతో కూడా చర్యలు తీసుకుంది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఒక నౌక ద్వారా వచ్చిన 183 మంది ఇరానియన్ నావికులకు భారత్ సురక్షిత ఆశ్రయం కల్పించింది. అదేవిధంగా బెంగాల్ ఖాతాలో జరిగిన ఒక నౌకాదళ వ్యాయామం అనంతరం వచ్చిన మూడు ఇరానియన్ నౌకలను కూడా భారత్ తన తీర ప్రాంతాల్లో నిలిపేందుకు అనుమతి ఇచ్చింది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇరాన్ హోర్ముజ్ జలసంధిలో కనీసం 16 వాణిజ్య నౌకలపై దాడులు చేసినట్లు సమాచారం. ఇటీవల భారత్‌లోని కాండ్లా పోర్టుకు వెళ్తున్న ఒక థాయ్ నౌకపై కూడా దాడి జరిగింది. ఈ ఘటనపై భారత్ తీవ్రంగా స్పందించింది. వాణిజ్య నౌకలను లక్ష్యంగా చేసుకోవడం అంతర్జాతీయ నౌకా రవాణా నియమాలకు విరుద్ధమని విదేశాంగ శాఖ పేర్కొంది. హోర్ముజ్ జలసంధి దాదాపు మూసివేసిన పరిస్థితి ఏర్పడటంతో భారత్ ప్రత్యామ్నాయ చమురు వనరులను వెతకాల్సిన అవసరం ఏర్పడుతున్నది. ముఖ్యంగా రష్యా నుంచి ఎక్కువ చమురు కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తోంది. ఏ విధంగా చూసినా, పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా సముద్ర మార్గాల భద్రత అనిశ్చితంగా మారిందనే వాస్తవం కళ్లకు కడుతుంది. ఇది భారత్ వంటి పెద్ద చమురు దిగుమతి దేశాలకు ఒక పెద్ద సవాలుగా మారింది. అందువల్ల భారత ప్రభుత్వం దౌత్యపరమైన చర్చలు కొనసాగిస్తూ ఒకవైపు నౌకా రవాణా భద్రతను కాపాడటంతో పాటు మరోవైపు ప్రత్యామ్నాయ ఇంధన సరఫరా మార్గాలను కూడా అన్వేషిస్తోంది.

కేంద్ర ప్రభుత్వ విధానాల వల్లే

# గ్యాస్ కొరత

మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధం కారణంగా, భారతదేశానికి గ్యాస్ సరఫరాలో అంతరాయం ఏర్ప డి వంటగ్యాస్, కమర్షియల్ సిలిండర్ల కొరత తీవ్రమైంది. ఈ సంక్షోభం వల్ల హోటళ్లు, రెస్టారెంట్లు మూతపడుతుండగా, సామాన్యులు గ్యాస్ బుకింగ్స్, డెలివరీలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనితో వంట కో సం ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న కేంద్ర ప్రభుత్వం నిమ్మకుండినట్లు వ్యవహరిస్తుంది. రాష్ట్రం నుండి 8 మంది ఎంపిలు ఉన్నారు. ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారు. రాష్ట్రానికి సరిపడ గ్యాస్ తీసుకురాలేకపోతున్నారు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్యాస్ సరఫరా పెంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం గ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయాల వల్ల రవాణా రంగం, చిన్న వ్యాపారాలు, గృహ వినియోగదారులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని సమీక్షి స్తూ ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్య లు తీసుకుంటోందని చెప్పారు. రాష్ట్రానికి అవసరమైన గ్యాస్ సరఫరా పెంచాలని కేంద్ర ప్రభుత్వాన్ని మంత్రి పొన్నం మరోసారి డిమాండ్ చేశారు.

# తెలంగాణకు ఐకాన్ ఉస్మానియా విశ్వవిద్యాలయం

• రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధికి రూట్ మ్యాప్ • రాష్ట్ర మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలంగాణ రాష్ట్రానికి ప్రత్యేక ఐకాన్‌గా నిలిచిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. అటువంటి విశ్వవిద్యాలయం మన రాష్ట్రంలో ఉండడం మనకెంతో గర్వకారణమని, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విభాగంలో నిర్మాణ్ 26 సాంకేతిక సదస్సును ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 1917లో స్థాపించిన ఈ విశ్వవిద్యాలయం తెలంగాణా రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిందన్నారు. అందుకు కొనసాగింపుగా 1929 లో విశ్వవిద్యాలయం సౌజన్యంతో ప్రారంభం అయిన ఇంజినీరింగ్ కళాశాల యావత్ భారతదేశంలోనే అత్యంత ప్రాశస్త్యమైన కళాశాలలలో ఆరవ స్థానంలో నిలిచిందని ఆయన చెప్పారు. అంతటి ప్రఖ్యాతిగాంచిన విశ్వవిద్యాలయం అభివృద్ధికి ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించడమే కాకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏకంగా రూ.వెయ్యి కోట్లు నిధులు మంజూరు చేయడం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఇక్కడి నుండి ఎంతో మేధో సంపద ఉత్పత్తి అయిందని, ఆ మేధస్సు ప్రపంచ స్థాయిలో అభివృద్ధికి దోహద పడుతుందన్నారు. సిలికాన్ వ్యాలీలో పనిచేస్తున్న మెజారిటీ ఇంజినీర్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండే ఎదిగిన వారు అని, అంతే గాకుండా గల్లీ నుండి డిల్లో స్థాయికి ఎదిగిన నేతలు, క్రీడాకారులు, ఉన్నత పదవులు చేపట్టిన వారి అడుగులు ఇక్కడి నుండే మొదలు అయ్యాయని ఆయన చెప్పారు. ఇంజినీరింగ్ విభాగం గురుంచి ఆయన ప్రస్తావిస్తూ తెలంగాణా రాష్ట్ర అభివృద్ధిలో ఇంజినీరింగ్ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందని ఆయన చెప్పారు. నిజాంసాగర్, నాగార్జునసాగర్, శ్రీశైలం వంటి భారీ ప్రాజెక్టులతో పాటు ఎస్ఎల్‌బిసి, దేవాదుల వంటి ఆధునిక ప్రాజెక్టులు ఇంజినీరింగ్ ప్రతిభకు అద్దం పడుతున్నాయన్నారు. నిర్మాణ్ 26 వంటి సాంకేతిక సదస్సులు విద్యార్థులకు పరిశోధన, సృజనాత్మక తాను పెంపొందించే వేడికలని ఆయన చెప్పారు. మన నిర్మాణాలు కేవలం కట్టడాలకే పరిమితం కాకుండా ప్రజల జీవితాలలో వెలుగులు నింపేందుకు దోహద పడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉద్బోదించారు.

ఖరీఫ్ సీజన్‌కు యూరియా నిల్వలపై

# రాష్ట్ర ప్రభుత్వం చర్యలు

**నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల కేటాయింపు కోరుతూ కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాబోయే ఖరీఫ్ 2026 వ్యవసాయ సీజన్‌కు ముందుగానే యూరియా నిల్వలు సిద్ధం చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సాగు సమయానికి యూరియా నిల్వలు సిద్ధంగా ఉంచుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి కీలక విన్నపం చేశారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు గాను ప్రతి నెల 2.00 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను కేటాయించాలని కోరుతూ కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డాకు ఆయన లేఖ రాశారు. గత గణాంకాలను విశ్లేషిస్తూ మంత్రి తుమ్మల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. 2024 ఖరీఫ్‌లో 4.65 లక్షల మెట్రిక్ టన్నుల ప్రారంభ నిల్వలు ఉండటంతో సరఫరా సాఫీగా సాగిందని, అయితే 2025లో అవి 1.99 లక్షలకు తగ్గడంతో ఇబ్బందులు ఎదురయ్యాయని గుర్తు చేశారు. ప్రస్తుత రబీ ముగిసే సమయానికి ఖరీఫ్ 2026 కోసం కేవలం 50 వేల మెట్రిక్ టన్నుల నిల్వలు మాత్రమే ఉండే అవకాశం ఉందని, అందుకే ముందస్తు కేటాయింపులు అత్యవసరమన్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో ఖరీఫ్ సీజన్ కొంత ముందుగానే ప్రారంభమవుతుంది. డిమాండ్ తక్కువగా ఉండే ఏప్రిల్, మే నెలల్లో నిల్వలు చేసుకుంటే, గరిష్ట వినియోగం ఉండే జూలై, ఆగస్టు (నెలకు 3 లక్షల టన్నుల అవసరం) నెలల్లో ఎరువుల కొరత రాకుండా చూడొచ్చు. రాష్ట్ర సాగు విస్తీర్ణంలో 70 శాతం ఖరీఫ్‌లోనే ఉంటుంది. ముఖ్యంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు యూరియా వినియోగం ఎక్కువని లేఖలో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు తెలిపారు.



**పారదర్శకత కోసం 'యూరియా యాప్'**

ఎరువుల పంపిణీలో అక్రమాలకు తావులేకుండా, పక్కదారి పట్టకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 'యూరియా యాప్'ను అందుబాటులోకి తెచ్చిందని మంత్రి తెలిపారు. దీని ద్వారా రైతులు తమ సమీపంలో ఎరువుల లభ్యతను తెలుసుకోవచ్చని, అధికారులు కూడా నిల్వలను నిరంతరం పర్యవేక్షించవచ్చని ఆయన తన లేఖలో వివరించారు. ఈ నేపథ్యంలో సరఫరా ప్రణాళిక కింద ఏప్రిల్, మే, జూన్ నెలలకు ప్రతి నెలా 2 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించాలని కేంద్రాన్ని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ కేటాయింపులు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే తగిన నిల్వలు ఏర్పరచుకుని ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎలాంటి అంతరాయం లేకుండా యూరియా అందుబాటులో ఉంచగలదన్నారు. రైతుల ప్రయోజనాల దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరితగతిన సరఫరా ప్రణాళికను ఆమోదిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆశాభావం వ్యక్తం చేశారు.




## భగత్ సింగ్ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలి

ఎఐవైఎఫ్ భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్ ప్రారంభోత్సవంలో ఇ.టి.నర్సింహ్మ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** భగత్ సింగ్ స్ఫూర్తితో దేశ నిర్మాణంలో యువత భాగస్వామ్యం కావాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ(సిపిఐ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి. నర్సింహా పిలుపునిచ్చారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ సి గ్రౌండ్స్‌లో 12వ తేదీ నుండి 17వరకు నిర్వహిస్తున్న భగత్ సింగ్ ప్రీమియర్ లీగ్ (బిపిఎల్) ప్రారంభోత్సవానికి ఇ.టి. నర్సింహా ముఖ్య అతిధిగా హాజరై, క్రీడాకారులతో కరచాలనం చేసి టోర్నీని ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ యువతకు ధైర్యం, త్యాగం, దేశభక్తి యొక్క ప్రతీక అని, ఆయన చూపిన మార్గం మనకు నేటికీ ప్రేరణ అని అన్నారు. నేటి యువత క్రీడల ద్వారా శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవడంతో పాటు సమాజం పట్ల బాధ్యతతో ముందుకు సాగాలన్నారు. ప్రస్తుతం సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్, మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కలవేణి శంకర్, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి. సత్య ప్రసాద్, శ్రీమాన్, ఎఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నేర్లకంటి శ్రీకాంత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్, కళ్యాణ్, మహేష్, ఎఐఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు అనీల్ కుమార్, ఓయు అధ్యక్షుడు ఉదయ్ కుమార్, భానులతో పాటు 10 టీమ్‌ల క్రీడాకారులు పాల్గొన్నారు.



ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న..

## ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇంటర్ బోర్డు నిబంధనలు పాటించకుండా ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు అఖిల భారత విద్యార్థి సమాఖ్య 'హైదరాబాద్ జిల్లా సమితి' ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్ నాంపల్లి కార్యాలయంలో ఇంటర్ బోర్డ్ జాయింట్ సెక్రటరీ వసుందరని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంత రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ 'రాష్ట్ర వ్యాపితంగా ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రైవేట్, కార్పోరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతున్నారు. పదవ తరగతి పరీక్షలు పూర్తి కాకముందే విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కలిసి మా కళాశాలలో చేరాలని ఒత్తిడి చేస్తున్నారు. జిల్లాలలో ఉన్న ఇంటర్ విద్యా శాఖా అధికారులు, కార్పోరేట్ విద్యాసంస్థలకు వత్తాసు పలుకుతూ ప్రోత్సహిస్తున్నారు. కావున ప్రైవేట్ ,కార్పోరేట్ విద్యాసంస్థలలో జరుగుతున్న ముందస్తు అడ్మిషన్లపై చర్య తీసుకోవాల్సిందిగా కోరడం జరిగింది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి అనిల్ , మెట్టెల చైతన్య యాదవ్, ఓయు అధ్యక్షులు ఉదయ్ కుమార్, శాంతి కుమార్ ,ఆఫీస్ బేరర్లు , రఘు, జోసెఫ్, భాను, అరుణ్ కుమార్, సిద్ధార్థ్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# 'టెస్కో' ద్వారానే విద్యార్థులకు వస్త్రాలు

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కూనంనేని సాంబశివరావును కోరిన అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ కార్యాలయాలు, స్కూల్స్, గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన బెడ్ షీట్లు, దుప్పట్లు, యూనిఫామ్ తదితర వస్త్రాలన్నీ టెస్కో ద్వారానే కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకురావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావును అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ ప్రతినిధి బృందం కోరింది. అఖిల భారత వీవర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి చాలా రాజేశ్వర్, రాష్ట్ర అధ్యక్షులు బసాబత్తిని రాజేశం, రాష్ట్ర కో ఆర్డినేటర్ గడ్డం వెంకటేశ్వర్లు, కోర్ కమిటీ సభ్యులు భోగం లక్ష్మయ్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, సమితి సభ్యులు కెవిఎల్ తదితరులు హైదరాబాద్,హిమాయత్ నగర్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయంలోని మఖ్దూం భవన్‌లో కూనంనేని సాంబశివ రావును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం జిఒను జారీ చేసినప్పటికీ సంక్షేమ శాఖ కార్యదర్శి టెస్కో ద్వారా కాకుండా, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా టెండర్ల ద్వారా కొనుగోలు చేయాలని నిర్ణయించారని వివరించారు. తద్వారా రాష్ట్రంలో దాదాపు లక్ష మంది చేనేత కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని వారు కూనంనేని సాంబశివరావు దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే రుణ మాఫీ అమలు కాక చేనేత కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టెండర్ల విధానాన్ని అమలు చేస్తే ఇతర రాష్ట్రాల నుండి నాణ్యతలేని వస్త్రాలను సరఫరా చేసే ప్రమాదం ఉందన్నారు. టెండర్ల ద్వారా చేనేత వస్త్రాల సేకరణను రద్దు చేసి, టెస్కో ద్వారానే కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరావాలని కోరారు. దీనిపైన కూనంనేని సాంబశివరావు స్పందిస్తూ టెండర్ల ద్వారా కాకుండా టెస్కో ద్వారానే ప్రభుత్వం వస్త్రాలు కొనుగోలు చేసే అంశాన్ని తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

## ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల సరఫరాను పునరుద్ధరించండి

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరీకి కెటిఆర్ లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వాణిజ్య,గృహ అవసరాలకు చెందిన ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల కొరత విషయంలో కేంద్ర ప్రభుత్వం తక్షణ మే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.వెంటనే గ్యాస్ సిలిండర్ల సరఫరాను పునరుద్ధరించకపోతే వేలాది వ్యాపార సంస్థలు మూతపడే ప్రమాదం ఉందని, తద్వారా లక్షలాది మంది కార్మికులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈమేరకు కెటిఆర్ కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరీకి లేఖ రాశారు. ప్రస్తుతం ఎల్‌పిజి సిలిండర్ల సరఫరాలో ఏర్పడిన తీవ్ర అంతరాయంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, పిజి హాస్టళ్లు, చిన్న చిన్న ఆహార వ్యాపారాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయన్నారు. చిన్న వ్యాపారులను రక్షించే విధంగా స్థాయిల వారీగా ఎల్‌పిజి కేటాయింపు వ్యవస్థను ప్రవేశపెట్టాలని, ఎల్‌పిజి సిలిండర్ల లభ్యతపై ప్రజలకు స్పష్టమైన సమాచారం అందించేందుకు రియల్ టైమ్ పబ్లిక్ డ్యాష్‌బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో వాణిజ్య సిలిండర్ల ధరలను పెంచకుండా తాత్కాలిక ధరల స్థిరీకరణ చేయాల ని ఆయన లేఖలో పేర్కొన్నారు. ఐటి కారిడార్ ప్రాంతాల్లో నివసిస్తున్న లక్షలాది మంది విద్యార్థులు, ఉద్యోగులు ఆధారపడే పిజి హాస్టళ్లకు ప్రత్యేక రక్షణ కేటగిరీ కింద గ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. గ్యాస్ ఆధారిత శ్మశాన వాటికల్లో కార్యకలాపాలు నిలిచిపోకుండా ఉండేందుకు వాటిని అత్యవసర సేవలుగా గుర్తించి, ప్రాధాన్యత కేటాయింపు ఇవ్వాలని సూచించారు.

## టిపిసిసి ఎస్‌సి సెల్ చైర్మన్‌గా కవ్వంపల్లి బాధ్యతల స్వీకారం

**హాజరైన టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం, వివేక్, అడ్లూరి, ప్రముఖులు**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో 17 % ఉన్న ఎస్‌సిలకు 5 ముఖ్యమైన స్థానాలు ఇచ్చామని, భవిష్యత్‌లో పదవుల పంపకాల్లో ఎస్‌సిలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ చెప్పారు. రాజయ్యను అర్థరాత్రి డిప్యూటీ సిఎం పదవి నుంచి కెసిఆర్ ఎలా తొలగించారో గుర్తు చేసుకోవాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో 100 సీట్లతో కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బిఆర్‌ఎస్ నాలుగు ముక్కలు అయ్యిందని, తెలంగాణలో బిజెపికి చోటులేదన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) ఎస్‌సి సెల్ చైర్మన్‌గా మానకొండూరు ఎంఎల్‌ఎ కవ్వంపల్లి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. గాంధీ భవన్‌లో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట్ స్వామి, అడ్లూరి లక్ష్మణ్, ఎఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎ.సంపత్‌కుమార్, ఎంఎల్‌ఎలు వేముల వీరేశం, లక్ష్మీ కాంత్, యెన్నం శ్రీనివాస్, మేడిపల్లి సత్యం, నాగరాజు, వినోద్, ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, ఎస్‌సి కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం, మాజీ ఎంఎల్‌ఎ మోత్కుపల్లి నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ క్లిష్ట సమయాల్లో దళితులు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచారని, పార్టీలో దళితులకు, ఆదివాసీలకు, బిసిలకు సముచిత స్థానం ఉంటుందన్నారు. బరువైన బాధ్యతను నమ్మకంతో సిఎంతో కలిసి కవ్వంపల్లి సత్యనారాయణపై పెట్టామన్నారు. కాంగ్రెస్ బలోపేతం కావాలనే ఉద్దేశ్యంతో కవ్వంపల్లి సత్యనారాయణకు పదవి ఇచ్చామని, దళితవాదంతో కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు అండగా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. 90 ఏళ్ల తర్వాత కుల సర్వే చేసి అధికారిక డాక్యుమెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. మంత్రి వివేక్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్‌సి సమాజం అన్ని రంగాల్లో న్యాయం సాధించేందుకు ఐక్యంగా ముందుకు సాగాలన్నారు. ఎస్‌సి సెల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కవ్వంపల్లి సత్యనారాయణపై పెద్ద బాధ్యత ఉందని, ఈ అవకాశాన్ని ఎస్‌సి సమాజం సమగ్ర అభివృద్ధికి ఉపయోగించుకోవాలని పార్టీ నాయకులు ఆశిస్తున్నారన్నారు. రాష్ట్రంలో కార్పొరేషన్లు, ఇతర సంస్థల్లో దళితులకు మరిన్ని స్థానాలు దక్కేలా ఎస్‌సి నాయకులందరూ ఐక్యంగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కవ్వం పల్లి సత్యనారాయణ సారథ్యంలో ఎస్‌సిల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకరావాలన్నారు. ఎస్‌సి, ఎస్‌టిల అభ్యున్నతికి ముఖ్యం విద్య మాత్రమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ నెహ్రూ నుండి రాహుల్ గాంధీ వరకు సామాజిక న్యాయం చేస్తున్నది, దేశ ఐక్యతకు పాటు పడేది కేవలం కాంగ్రెస్ మాత్రమేనన్నారు.




## సాధికారత దక్కేవరకూ బిసి మహిళలు పోరాడాలి

**బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్**

**ప్రజాపక్షం/హైదరాబాద్:** చట్టసభలలో అన్ని వర్గాల మహిళలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పించే వరకు పోరాడి సాధించాలని, అప్పుడే మహిళా సాధికారత లభిస్తుందని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బిసి మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మని మంజరి, బిసి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో గురువారం మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళా బిల్లు బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం సబ్ కోట కల్పించినప్పుడే మహిళా బిల్లుకు సంపూర్ణ సాధికారత లభిస్తుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్ డాక్టర్ రమణ నాయక్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం చంద్రశేఖర్ గౌడ్, బిసి మహిళ నేతలు రాధా రాణి, తారకేశ్వరి, జ్యోతి, సమతా యాదవ్, సంధ్యారాణి, సుజాత, ఉమాదేవి, మీనా, సరిత, విజయలక్ష్మి , రేణుక, తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్ పోలీసుల నిఘా

ఒక్క నెలలోనే 78 కేసులు నమోదు.. 117 మంది అరెస్ట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో ఫిబ్రవరి నెలలో మొత్తం 78 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని సైబర్ క్రైమ్ అడిషనల్ సిపి ఎం. శ్రీనివాసులు తెలిపారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' అనే ప్రత్యేక ఆపరేషన్ ద్వారా, హైదరాబాద్ సిటీ లా అండ్ ఆర్డర్ బృందాలతో కలిసి సైబర్ క్రైమ్ పోలీసులు 16 వివిధ రాష్ట్రాల నుండి 117 మంది నిందితులను అరెస్ట్ చేశామని, వీరికి సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లలో నమోదైన 74 కేసులతో సంబంధం ఉందని పేర్కొన్నారు. బాధితులకు మొత్తం రూ. 34,76,884 విజయవంతంగా రీఫండ్ చేయబడిందని తెలిపారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలని అడిషనల్ సిపి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: డివిజన్-30, జిహెచ్ఎంసి.

NIT No. 75 : NIT No.75/E.E.30/GHMC/2025-26 తేది: 11.03.2026

**పని పేరు:** జిహెచ్ఎంసి, కెజెడ్, డివిజన్-30 క్రింద వివిధ సివిల్ ఇంజనీరింగ్ పనులు, **అంచనా విలువ:** రూ.4.05 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది:* 11.03.2026న సా.5.00గం.ల నుండి మరియు *బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేది & సమయం:* 12.03.2026న సా.5.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-30, జిహెచ్ఎంసి 5వ అంతస్తు అబిడ్స్ పార్కింగ్ కాంప్లెక్స్, అబిడ్స్, హైదరాబాద్. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-30, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 16892-PP/CL/ADVT/1/2025-26, Date: 12-03-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్.

Short Tender Notice No. 22/EE.Div.NO.28/GHMC/2025-26 తేది: 12.03.2026

**Nit No.** Short Tender Notice No. 22/EE.Div.NO.28/GHMC/2025-26, తేది: 12.03.2026. **పని వివరణ:** నిర్వహణ పనులు (05) నెం.లు, **అంచనా విలువ:** రూ.74.16 లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** *ప్రారంభ తేది:* 13.03.2026న మ.3.00గం.ల నుండి మరియు *స్వీకరణకు ఆఖరి తేది & సమయం:* 17.03.2026న మ.3.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ షేక్ సనాఉద్దీన్. సెల్ నెం. 7993727669. జతపరచబడినవి: పనుల వివరములు కాపీ.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-28, సిఆర్‌జెడ్, జిహెచ్ఎంసి.

DIPR R.O. No. : 16917-PP/CL/ADVT/1/2025-26, Date: 12-03-2026

తెలంగాణ ప్రభుత్వం దేవాదాయ శాఖ
**శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము**
దర్వేశిపురం గ్రామము, కనగల్ మండలము, జిల్లా : నల్లగొండ.

టెండర్ నోటీస్ నెం: 13/SYT/2026 — టెండరు కం బహిరంగ వేలము — తేది: 11/03/2026

ఇందు మూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా! సదరు దేవస్థానమునకు సంబంధించిన టెండరు కం బహిరంగ వేలము వేలము ది: 17-03-2026 వారం రోజున మ. 1:00 గం.లకు దేవాలయ ప్రాంగణం నందు దేవాదాయ శాఖ అధికారుల సమక్షములో నిర్వహించబడును.
పూర్తి చేసిన టెండరు టెండరు షెడ్యూలు తేది: 17.03.2026 మ. 12:00 గం.ల వరకు దేవస్థానం నందు ఏర్పాటు చేసిన టెండరు బాక్స్ నందు వేయవలెను. అదే రోజు మ. 01:00 గం. లకు టెండరుదారుల సమక్షములో దేవాలయ ప్రాంగణం నందు బహిరంగ వేలము నిర్వహించబడును.

| క్ర.సం. | వేలము వివరములు | కాలపరిమితి 1 సం.ము | డిపాజిట్ డబ్బు | సీలు టెండర్ షెడ్యూల్ ధర | |
|---|---|---|---|---|---|
| 1 | తలనీలాల సేకరించుకొను హక్కు | తేది: 01.06.2026 నుండి 31.05.2027 వరకు | రూ. 2,00,000/- | రూ. 1000/- | ఏదేని జాతీయ బ్యాంకులో APGVB నల్లగొండ రామగిరి బ్రాంచ్ నందు చెల్లుబాటు అయ్యేటట్లు డి.డి. తీయవలెను. నగదు కూడా స్వీకరించబడును |
| 2 | చీరలు, వడిబియ్యం సేకరించుకొను హక్కు | తేది: 01.04.2026 నుండి 31.03.2027 వరకు | రూ. 1,00,000/- | రూ. 1000/- | |

డిపాజిట్ నగదు/ డి.డి.లు స్వీకరించబడును. డి.డి.లు కార్యనిర్వహణాధికారి, శ్రీ యల్లమ్మ అమ్మవారి దేవస్థానము, గ్రా. దర్వేశిపురం పేరుమీద తీయవలెను. వేలం పాటలు ప్రస్తుతం ఉన్నటువంటి అధిక పాట రూపాయల మీద నుండి పాట ప్రారంభించడం జరుగును.
**నోట్ :** సరైన పాట రాకున్న గానీ, సరైన కారణములు తెలుపకనే టెండర్లు రద్దు చేయుటకు గానీ, వాయిదా వేయుటకు గానీ దేవాదాయ శాఖ అధికారులకు పూర్తి అధికారము కలదు. ఇతర వివరాలు, వేలం షరతుల కొరకు దేవస్థాన కార్యాలయంలో సంప్రదించగలరు.

*సదా శ్రీ అమ్మవారి సేవలో...*

కె.భాస్కర్
సహాయ కమీషనర్
దేవాదాయ ధర్మాదాయ శాఖ, నల్లగొండ

*వివరాలకు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:*
*90000 10884, 9949609848, 9441823191.*

సం/- అంబటి నాగిరెడ్డి,
కార్యనిర్వహణాధికారి
సెల్: 9959198949

DIPR R.O. No. : 16908-PP/CL/ADVT/1/2025-26, Date: 12-03-2026

## గ్యాస్ బ్లాక్‌లో అమ్మితే డీలర్ షిప్ రద్దు చేస్తాం

మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం / సూర్యాపేట:** గ్యాస్‌ను బ్లాక్ మార్కెట్‌లో అమ్మితే డీలర్ షిప్ రద్దు చేస్తామని రాష్ట్ర పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి కెప్టెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇరాన్, ఇజ్రాయిల్, అమెరికా యుద్ధంతో రాష్ట్రంలో గ్యాస్ కొరకుతా ఉందని చెప్పారు. ప్రజలు ఈ విషయంలో ధైర్య పడవ వద్దన్నారు. గ్యాస్ బ్లాక్ దందాపై ప్రభుత్వం సీరియస్‌గా ఫోకస్ పెట్టిందని స్పష్టం చేశారు. బ్లాక్‌లో అమ్ముతే డీలర్ షిప్‌ను వెంటనే రద్దు చేస్తామని హెచ్చరించారు. డొమెస్టిక్ సిలిండర్లు గృహ అవసరాలకే అమ్మాలన్నారు. వీటిని పక్క దారి పట్టించి కమర్షియల్‌కు అమ్ముతే చర్యలు తప్పవు అన్నారు. గ్యాస్ నిల్వలకు సంబంధించి చీఫ్ సెక్రటరీ, పౌరసరఫరాల శాఖ కమిషనర్ తో కొరత పై చర్చించామని తెలిపారు. ప్రతి డీలర్ వద్ద స్టాక్ ఉండేలా చర్యలు చేపడతామన్నారు. కేంద్ర ప్రభుత్వ సమన్వయంతో సామాన్యుడికి గ్యాస్ కష్టాలు లేకుండా తెలంగాణ సర్కార్ చర్యలు చేపడుతుందని తెలిపారు.

## క్రమబద్ధీకరణపై పథకాన్ని పరిశీలించండి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంట్రాక్ట్, తాత్కాలిక ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగుల సేవలను క్రమబద్ధీకరించే అంశంపై సుప్రీంకోర్టు ఉమాదేవి కేసులో ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం పథకాన్ని రూపొందించే అంశాన్ని పరిశీలించాలని హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. జెఎన్‌టీయూ తనను సేవల నుంచి తొలగిస్తూ జారీ చేసిన మెమోను సవాలు చేస్తూ ఎ.నరసింహ దాఖలు చేసిన పిటిషన్‌పై సింగిల్ జడ్జి జిఒ 212 ప్రకారం ఆయన సేవలను క్రమబద్ధీకరించాలని ఆదేశిస్తూ మెమోను రద్దు చేశారు. ఆ ఉత్తర్వులను సవాలు చేస్తూ జెఎన్‌టీయూ దాఖలు చేసిన అప్పీల్‌ను చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌ల బెంచ్ విచారించింది. ఉమాదేవి తీర్పు ప్రకారం 10 ఏళ్లు సేవలు చేసిన ఉద్యోగుల క్రమబద్ధీకరణకు కమిటీ ఏర్పాటు చేసి పరిశీలించే పథకం రూపొందించవచ్చని ధర్మాసనం పేర్కొంది. దీనిపై ప్రభుత్వ అభిప్రాయం తెలియజేయాలని అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డికి సూచిస్తూ విచారణను ఏప్రిల్ 14కు వాయిదా వేసింది. అప్పటివరకు సింగిల్ జడ్జి ఉత్తర్వుల అమలుపై స్టే ఇచ్చింది.

## కాళేశ్వరం కమిషన్ కేసులో ఏప్రిల్ 8న తీర్పు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పి.సి. ఘోష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన విచారణ కమిషన్‌ను సవాలు చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, మాజీ మంత్రి టి. హరీశ్‌రావు, ఐఏఎస్ అధికారిణి స్మిత సభర్వాల్, రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎస్.కే. జోషి దాఖలు చేసిన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం తీర్పును ఏప్రిల్ 8న వెల్లడిస్తామని తెలిపింది. హరీశ్‌రావు తరపున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదిస్తూ ఏ పెద్ద ప్రాజెక్టులోనూ అంచనా వ్యయం పెరగకుండా ఉండదని, నాగార్జునసాగర్, శ్రీరాంసాగర్ తదితర ప్రాజెక్టుల్లో కూడా భారీగా పెరిగిందని, కాళేశ్వరంలో మాత్రం సుమారు 1.9 రెట్లు మాత్రమే పెరిగిందని పేర్కొన్నారు. కమిషన్ విచారణలో సహజన్యాయ సూత్రాలు పాటించలేదని, పిటిషనర్లపై ఆరోపణలు చేసిన సాక్షులను క్రాస్ ఎగ్జామిన్ చేసే అవకాశం ఇవ్వలేదని, ఆధారాలు ముందుగా అందజేయకుండా నివేదికలో ఏకపక్షంగా అభియోగాలు నమోదు చేశారని వాదించారు. కమిషన్ నివేదికను అసెంబ్లీకి సమర్పించే ముందు ప్రభుత్వమే ప్రెస్‌మీట్ ద్వారా వెల్లడించడం రాజకీయ దురుద్దేశాన్ని సూచిస్తోందని తెలిపారు. స్మిత సభర్వాల్, జోషి తరపున న్యాయవాదులు జె. రామచందర్‌రావు, తరుణ్ జి. రెడ్డి వాదిస్తూ తమ క్లయింట్లను సాక్షులుగా విచారించిన కమిషన్ నివేదికలో తప్పు చేసినట్లు పేర్కొనడం చట్టబద్ధం కాదన్నారు. ఇరుపక్షాలు ఒకటి రెండు రోజుల్లో రాతపూర్వక వాదనలు సమర్పించవచ్చని హైకోర్టు సూచించింది.

# ట్రంప్ యుద్ధం – శాంతి గేమ్ దారెటు?

- రెండు నెలల యుద్ధానికి 95 బిలియన్ల ఖర్చు
- హోర్ముజ్ జలసంధి మార్గమే ఇరాన్ అణ్వాయుధం!
- మళ్ళీ అమెరికాకు వియత్నాం, అఫ్ఘానిస్థాన్ తరహా అవమానమే!




**వాషింగ్టన్:** ట్రంప్ యుద్ధం–శాంతి (వార్ అండ్ పీస్) గేమ్ అడుతున్నారు. ప్రపంచంపై అమెరికా పూర్వాధిపత్యాన్ని సాధించాలనే లక్ష్యంతో అధికార పగ్గాలు చేపట్టి మాగా నినాదం, అమెరికా ఫస్ట్ నినాదాలను ముందుకు తెచ్చిన ట్రంప్ వట్టిపోయిన అమెరికా ఖజాజాను భర్తీ చేసుకునేందుకు టారిఫ్‌ల గేమ్ మొదలుపెట్టారు. ఆధిపత్య నిరూపణ కోసం సంధి సయోధ్య సమావేశాలకు శ్రీకారం చుట్టారు. ప్రపంచంలో యుద్ధాలన్నీ తానే ఆడ్డుకునే శాంతిదూతగా ముందుకు వచ్చిన ట్రంప్ వియత్నాం యుద్ధంలో ఘోర పరాజయం చూసిన అమెరికా చరిత్రను పునరావృతం చేసే పనిలో పడ్డారు. పదిరోజులు ఇరాన్‌తో యుద్ధం చేసిన తర్వాత మెల్లిగా తాను మాత్రం పక్కకు తప్పుకుని ఇజ్రాయెల్‌ను ఇరికించేందుకు పావులు కదుపుతున్నారు. యుద్ధం ముగిసిందంటూ ప్రకటనలు చేస్తున్నారు. కానీ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ మాత్రం అందుకు అంగీకరించడంలేదు. యుద్ధం ఎవరైతే మొదలుపెట్టారో వారే శాంతి చర్చలు ప్రారంభించాలని, వారే శాంతికి ప్రతాపాదనలు చేయాలని, ఇరాన్‌లో చేసిన దారుణ విధ్వంసానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తోంది. తీవ్రంగా గాయపడి చికత్స పొందుతున్న ఇరాన్ కొత్త సుప్రీం నేత మోజ్తాబా ఆసుపత్రి నుడే ఐఆర్‌జిసితో సంబంధాలు కొనసాగిస్తున్నారు. ఆయన నాయకత్వంలోనే దాడులలు చేస్తున్నామని, కొత్తగా ప్రారంభించిన దాడులను ఆయనకే అంకితం చేశామని నిమామకం ప్రకటన తర్వాత ఐఆర్‌జిసి పేర్కొంది. చర్చల ప్రతిపాదనను ఇరాన్ నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. యుద్ధం ఎప్పుడు ముగించాలో తామే నిర్ణయిస్తామని చెప్పడంతో ట్రంప్ ఇరకాటంలో పడ్డారు. పశ్చిమాసియాలో గల్ఫ్ దేశాలతో తమకు వైరం లేదని, అమెరికా స్థావరాలు ధ్వంసం చేయడమే లక్ష్యమని ఐఆర్‌జిసి ప్రకటించింది. దాంతోపాటు ఇప్పటికే అమెరికా స్థావరాలకు, ఆస్తులకు అపారనష్టం కలిగించింది. తేలుకుట్టిన దొంగలా అమెరికా దీనిని చెప్పుకోలేని పరిస్థితి వచ్చింది. అందుకే 9000 మంది సిబ్బందితోపాటు మొత్తం 45,000 మంది అమెరికన్లను స్వదేశానికి తరలించింది. ఈ యుద్ధంలో అమెరికావల్ల ఇరాన్ దాడుల ఫలితంగా ఖతార్ అతి తీవ్రంగా నష్టపోయింది. దేశంలో తీవ్ర వ్యతిరేకత రావడం, ప్రతిపక్షాలు మొదటినుండీ వ్యతిరేకంగా ఉండటం, అమెరికా వినియోగదారులకు కష్టాలు పెరిగిపోయి వారు ఆశలు వదిలేసుకోవడం,అన్నింటికంటే మిన్నగా ఈ ఏడాది నవంబరులో ద్వైవార్షిక ఎన్నికలు రావడం వంటి పరిణామాల మధ్య ట్రంప్ తెలివిగా తప్పించుకుని ఎలా బయట పడాలా? అని మార్గాలు వెతుకుతున్నారు. మాటమీద నిలబడని, నిలకడలేని ట్రంప్ గురించి ముందుగానే గ్రహించిన బ్రిటన్ సహా ఇతర యూరోపియన్ యూనియన్ దేశాలు తమ జాగ్రత్తలో తామున్నాయి. ఇక సోస్పెయిన్ పూర్తిగా అడ్డం తిరిగి ఇరాన్‌కు పూర్తి మద్దతుదారుగా మారిపోయింది. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభించిన తర్వాత మొదటి 100 గంటల్లోనూ అమెరికాకు యుద్ధం ఖర్చు 3.7 బిలియన్ డాలర్లుగా తేలిందని సిఎస్ఐఎస్ అంచనావేసింది. ఐదు బిలియన్ డాలర్లు అప్పటికే ఖర్చయ్యాయి. ఈ ఖర్చులు శరవేగంగా పెరగుతున్నాయి. నాలుగువారాల్లోనే యుద్ధం ముగిస్తామని ట్రంప్ మొదట అంచనావేశారు. అమెరికా సైనిక బలగాల సర్వాధినేత డాన్‌కైన్‌తో ఈ యుద్ధం విషయంలో ఆయనకు మొదట విభేదాలు వచ్చాయి. యుద్ధం చేయవద్దని ఆయన మొదట ఖరాఖండీగా ట్రంప్‌కు హెచ్చరిక చేశారు. కానీ ఖర్చు పెరగకుండా గత ఏడాది జులైలో తరహాలోనే కొద్ది గంటల్లోనే యుద్ధం ముగించేయాలని ట్రంప్ ఆయనపై ఒత్తిడి తెచ్చారు. ట్రంప్ యుద్ధం మానేద్దామనుకుంటే ఇరాన్ కొత్త షరతులు విధిస్తోంది. ట్రంప్‌ను నమ్ముకున్న గల్ఫ్ దేశాలు యుద్ధంలో ఇరాన్ దాడుల కారణంగా అపార నష్టాని చవిచూశాయి. ఇది గల్ఫ్ దేశాలకు ఒక కొత్త గుణపాఠంగా మారింది. దీంతో ట్రంప్ గొంతులో పచ్చివెలక్కాయ పడినట్లయింది. కానీ ఇప్పుడు హోర్ముజ్ జలసంధి ట్రంప్‌కు ఇరకాటంగా మారింది. ఆయన కారణంగా యావత్ ప్రపంచం చమురు సంక్షోభంలో కూరుకుపోయే ప్రమాదంలో పడింది. హోర్ముజ్ జలసంధి ఇరాన్‌కు ఒక పెద్ద ఆస్తిగా పెట్టని కోటగా మారింది. ప్రకృతి సహజసిద్ధంగా ఉన్న ఆ ఇరుకైన మార్గం నుండి ప్రజల చమురు అవసరాలు తీర్చే నౌకలన్నీ తప్పనిసరిగా ప్రయాణించి వెళ్ళడం ఇప్పుడు ఇరాన్‌కు ఒక గొప్ప బలంగా మారింది. ఈ బలమే అమెరికాకు అతిపెద్ద బలహీనతగా మారింది. అమెరికాకు ఉన్నంత ఆయుధబలం ఇరాన్‌కు లేకపోయి నాగానీ హోర్ముజ్ జలసంధితో అమెరికాను లొంగదీయ దానికి ఇరాన్‌కు అతిపెద్ద ఆయుధం లభించింది. ఇరాన్‌లో అమెరికా,ఇజ్రాయెల్ అపారనష్టం కలిగించాయి. దీనికి నష్టపరిహారం ఇవ్వాలని లేకపోతే హోర్ముజ్ జలసంధి ద్వారా ఏ ఒక్కనౌకనూ వెళ్ళనివ్వబోమని ఇరాన్ భీష్మ ప్రతిజ్ఞ చేసింది. దీనికితోడు ఇరాన్‌ను మధ్యవర్తిగా చైనాను తప్ప మరెవ్వరినీ అనుమతించే పరిస్థితులు కనిపించడంలేదు. చైనా మధ్యవర్తిత్వాన్ని ట్రంప్ అంగీకరిస్తారా? అనేది మిలియన్ డాలర్ ప్రశ్న. ఈ చిక్కుల్లోంచి ట్రంప్ ఎలా బయటపడతారన్నదే ఇప్పుడు అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం. లేకపోతే ట్రంప్‌కు వియత్నాంలో,అఫ్ఘానిస్థాన్‌లో అమెరికాకు ఎదురైన అవమానమే పునరావృతమయ్యేట్టు కనిపిస్తోంది.

## మహిళా భద్రత కోసం తెలంగాణ పోలీస్ చర్యలు అభినందనీయం

జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ పలు చర్యలు చేపట్టిందని జాతీయ మహిళా కమిషన్ చైర్ పర్సన్ విజయ రహట్కర్ అభినందించారు. ముఖ్యంగా ఇటీవల రాష్ట్ర పోలీస్ శాఖ మహిళ మద్దతు కోసం చేపడుతున్న వివరాలను తెలుసుకొని ప్రశంసించారు. మహిళల ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తూ, వారి భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ అన్యాయాలకు అడ్డుకట్ట వేయాలని ఆమె సూచించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా గురువారం మేడ్చల్ మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'మహిళా జన సున్వాయి' (బహిరంగ విచారణ) కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వచ్చిన సుమారు 35 ఫిర్యాదులను ఆమె స్వయంగా పరిశీలించారు. ప్రధానంగా గృహహింస, వేధింపులు, కుటుంబ సభ్యులు వదిలివేయడం, సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు బాధితుల నుంచి అందాయి. ప్రతి కేసును క్షుణ్ణంగా సమీక్షించిన చైర్‌పర్సన్, బాధితులకు తక్షణమే న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్‌సిఆర్‌బి 2023 గణాంకాల ఆధారంగా మహిళలపై పెరుగుతున్న నేరాల సరళిపై ఆమె చర్చించారు. దర్యాప్తు ప్రక్రియలో జాప్యం లేకుండా చూస్తూ, పోష్ చట్టం, గృహహింస నిరోధక చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. మహిళల భద్రత, గౌరవం విషయంలో రాజీ పడకూడదని, పోలీసులతో పాటు జిల్లా యంత్రాంగం సమన్వయంతో వ్యవహరించి మహిళలకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి, సిఐడి అడిషనల్ డిజిపి చారు సిన్హా, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ కె. అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి, హైదరాబాద్ అడిషనల్ సిపి ఎం. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సమాజాభివృద్ధికి అర్థశాస్త్ర పరిశోధనలే పునాది

ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం..




**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'సమాజ అభివృద్ధికి అర్థశాస్త్ర పరిశోధనలే పునాదిలాంటిదని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం అన్నారు. 'సమగ్ర వృద్ధి, సుస్థిర భారత అభివృద్ధి: సవాళ్లు'' అనే అంశంపైన నిజాం కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిజాం కళాశాల ఆడిటోరియంలో జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రొఫెసర్ పురుషోత్తం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అసమానతలు లేని అభివృద్ధి, నూతన ఉపాధి అవకాశాల కల్పనకు సమగ్రమైన పరిశోధనలు చేయ డం నేటి చారిత్రక అవసరమన్నారు. తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యులు డాక్టర్ చారకొండ వెంకటేష్ మాట్లాడుతూ నైపుణ్యం లేని విద్యార్థత లు, నాణ్యత లేని విద్యా విధానం నేటి తెలంగాణ అభివృద్ధికి ప్రధాన అడ్డంకులుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. కఠోర శ్రమతో వీటిని అధిగమించి సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిజాం కాలేజ్ ప్రిన్సిప ల్ ప్రొఫెసర్ సిహెచ్. శ్రీనివాస్, హైదరాబాద్ సెం ట్రల్ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మోహన్ రావు, ప్రొఫెసర్ ఐ. దేస్జి, ప్రొఫెసర్ నారాయణ, ప్రొఫెసర్ ఎం. రాములు, ప్రొఫెసర్ ఇంద్రకాంత్, ప్రొఫెసర్ ప్రతాపరెడ్డి, ప్రొఫెసర్ రమణమూర్తి, ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, డాక్టర్ రమేష్,ప్రొఫెసర్ ఎల్.సి. మల్లయ్య,కార్యక్రమ కోకన్వీనర్లు, నిర్వాహకులు డాక్టర్ సతీష్ రాయికింది, డాక్టర్ రంజిత్, డాక్టర్ యుగంధర్, సరిత తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ భవిష్యత్తు రవాణాకు 'మాస్టర్ ప్లాన్'

రూ.4 లక్షల కోట్లతో సమగ్ర మొబిలిటీ ప్లాన్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతాన్ని (హెచ్‌ఎంఎ) ప్రపంచస్థాయి రవాణా సౌకర్యాలతో తీర్చిదిద్దేందుకు హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండిఏ) కీలక అడుగు వేసింది. హైదరాబాద్ హోటల్ తాజ్ వివంటాలో గురువారం జరిగిన ప్రత్యేక వర్క్‌షాప్‌లో సమగ్ర మొబిలిటీ ప్లాన్ (సిఎంపి) ముసాయిదా సిఫార్సులను అధికారులు వెల్లడించారు. ఈ భారీ మౌలిక సదుపాయాల కల్పనకు 2050 నాటికి సుమారు రూ.4 లక్షల కోట్ల పెట్టుబడి అవసరమని అంచనా వేశారు. హెచ్‌ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఆర్ అండ్ బి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, టిజిఐసిసి వైస్ ఛైర్మన్, ఎం.డి., ఎఫ్‌సిడిఏ కమిషనర్ కె. శశాంక్, పట్టణ రవాణా అంశాల ప్రభుత్వ సలహాదారులు ఎన్.వి.ఎస్.రెడ్డి, డిటిసిపి డైరక్టర్ ఎస్. దేవేందర్ రెడ్డి, జెఎన్‌టియు కాకినాడ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె.ప్రసాద్, హెచ్‌ఎండిఏ ప్లానింగ్ డైరక్టర్లు రాజేంద్ర ప్రసాద్ నాయక్, విద్యాధర్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. లీ అసోసియేట్స్ రూ పొందించిన ఈ ప్రణాళికలో 2050 నాటికి నగర రవా ణా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు సూచించారు.

- ☞ 2050 నాటికి మొత్తం 556.6 కి.మీ. మేర అదనపు మెట్రో నెట్‌వర్క్.
- ☞ ఎంఎంటిఏస్ నెట్‌వర్క్‌ను 336.4 కి.మీ. మేర విస్తరించడం.
- ☞ దాదాపు 19,352 లేన్‌కిలోమీటర్ల మేర రోడ్డు నెట్‌వర్క్ పెంపు.
- ☞ 75 గ్రేడ్ సెపరేటర్లు, 120 ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు (ఎఫ్ఓబి), మూసీ నదిపై 29 కొత్త వంతెనల నిర్మాణం.
- ☞ హైదరాబాద్ నుండి బెంగళూరు, అమరావతి, చెన్నై నగరాలకు హైస్పీడ్ రైలు కారిడార్ల అభివృద్ధి.
- ☞ 7 అంతరాష్ట్ర బస్సు, ట్రక్ టర్మినల్స్ ఏర్పాటు.

### హైదరాబాద్‌ను సుస్థిర ఆర్థిక వృద్ధి వైపు బృహత్తర ప్రణాళిక : జయేష్ రంజన్

ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ మాట్లాడుతూ ఈ బృహత్తర ప్రణాళిక హైదరాబాద్‌ను సుస్థిర ఆర్థిక వృద్ధి వైపు నడిపిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఆర్థికాభివృద్ధిలో రవాణా వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, ఈ ప్రణాళిక నగరాన్ని గ్లోబల్ సిటీగా మారుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వికాస్ రాజ్ మాట్లాడుతూ హైదరాబాద్‌ను బెంగళూరు, అమరావతిచెన్నై నగరాలతో కలిపే హై స్పీడ్ రైలు కారిడార్ల అవసరాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ సలహాదారు ఎన్.వి.ఎస్. రెడ్డి 'ట్రాన్సిట్ ఫస్ట్' విధానంపై మొగ్గు చూపాలని, మెట్రో ఫేజ్2, లాస్ట్ మైల్ కనెక్టివిటీకి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

రవాణా సౌకర్యం పార్కింగ్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ ఈ ప్రణాళికను వికసిత్ భారత్ 2047 లక్ష్యాలకు అనుగుణంగా, రీజనల్ రింగ్ రోడ్ (ట్రిబుల్ ఆర్) వరకు విస్తరించాలని సూచించారు. ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి. జోయెల్ డేవిస్ మాట్లాడుతూ పాతబస్తీ, సైబరాబాద్ ప్రాంతాల్లో పార్కింగ్ మేనేజ్‌మెంట్, బేగం బజార్ వంటి ప్రాంతాల్లో లాజిస్టిక్స్ సమస్యల పరిష్కారానికి డీకెంజెషన్ వ్యూహాలు అవసరమని తెలిపారు.



## ప్రత్యేక ఉర్దూ డిఎస్‌సిని నిర్వహించండి

మంత్రి అజారుద్దీన్‌ను కోరిన ఎస్‌టియు టిఎస్ నాయకులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉర్దూ మీడియాం పాఠశాలల్లో అన్ని ఖాళీలను భర్తీ చేయాలని, ప్రత్యేక ఉర్దూ డిఎస్‌సిని నిర్వహించాలని ఎస్‌టియు టిఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. సదానందం గౌడ్,జుట్టు గజేందర్, మాజీ అధ్యక్షుడు ఎం. పర్వత్ రెడ్డి రాష్ట్ర మైనారిటీ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్‌ను కోరారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి అజారుద్దీన్‌ను వారు మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందన్నారు. అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఉండడంతో విద్యాబోధనకు ఆటంకం కలుగుతోందని వివరించారు. తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇఫ్తార్ విందుకు వారు మంత్రిని ఆహ్వానించారు. ఉర్దూ పాఠశాలలోని సమస్యలపైన మంత్రి సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు.

## ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్లపై అసెంబ్లీలో చర్చించండి

టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి నాయకులు ప్రతిపక్షనేతలకు వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం అసెంబ్లీలో చర్చించాలని ప్రధాన ప్రతిపక్ష పార్టీలను టిజిఎస్‌ఆర్‌టిసి జెఎసి నాయకులు కోరారు. ఈ నేపథ్యంలో బిఆర్‌ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీష్‌రావు, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహా తదితరులను కలిసి, సంబంధిత వినతి పత్రాలను జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, జెఎసి ప్రతినిధులు ఎ. ఆర్.రెడ్డి, జె.రాఘవులు అందజేశారు. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలనే అమలు చేయమని కోరుతున్నామని, ఇందులో కొత్త డిమాండ్లు లేవని వారన్నారు. జెఎసి ఆధ్వర్యంలో అనేకమార్లు మంత్రుల చుట్టూ, ఎమ్మెల్యేల చుట్టూ, అధికారుల చుట్టూ ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కాళ్ళు అరిగేలా తిరిగినప్పటికీ ఈ ప్రభుత్వానికి తమ మీద కనికరం కలగలేదని, రోజు రోజుకూ ఆర్‌టిసి సంస్థను నిర్వీర్యం చేస్తున్నారని, అందులో భాగంగానే వేలాది ప్రైవేట్ ఎలక్ట్రిక్ బస్సులను బలవంతంగా సంస్థపై నెట్టి, కార్మికుల ఉద్యోగాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్‌టిసి కార్మికుల పట్ల సానుకూలంగా స్పందించి, తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మికుల అశాంతి, అసంతృప్తి తీవ్ర రూపం దాల్చటం వల్ల విధిలేని పరిస్థితుల్లో శుక్రవారం నాడు మేనేజింగ్ డైరెక్టర్‌కి, ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇస్తున్నామని తెలిపారు. మమ్ముల్ని సమ్మె వైపు వె

## కోకాపేటలో 'ఓయాసిస్ ఫెర్టిలిటీ' కొత్త సెంటర్ ప్రారంభం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారతదేశపు ప్రముఖ సంతాన సాఫల్య చికిత్స నెట్‌వర్క్ 'ఓయాసిస్ ఫెర్టిలిటీ' హైదరాబాద్‌లోని కోకాపేటలో తన నూతన అత్యాధునిక కేంద్రాన్ని ప్రారంభించింది. ఇది హైదరాబాద్‌లో ఓయాసిస్‌కు 9వ కేంద్రం కాగా, దేశవ్యాప్తంగా 35వ కేంద్రం. పెరుగుతున్న డిమాండ్ మారుతున్న జీవనశైలి, ఆలస్యంగా వివాహాలు చేసుకోవడం వంటి కారణాల వల్ల సంతాన సాఫల్య చికిత్సలకు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెచ్చారు. ఐవిఎఫ్, ఐయూఐ, పురుషుల, మహిళల వంధ్యత్వ సమస్యల పరిష్కారం, ఫెర్టిలిటీ ప్రిజర్వేషన్ వంటి సేవలు ఇక్కడ లభిస్తాయి. ఓయాసిస్ ఫెర్టిలిటీ కోఫౌండర్ డాక్టర్ దుర్గా జి. రావు మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన, సైన్స్ ఆధారిత చికిత్సను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. గచ్చిబౌలి, కోకాపేట పరిసర ప్రాంతాల వారికి ఈ కేంద్రం ద్వారా మెరుగైన వైద్యం చేరువవుతుందని కన్సల్టెంట్ డాక్టర్ వల్లభరెడ్డి దేవి శ్యామల చెప్పారు. 2009లో ప్రారంభమైన ఓయాసిస్ ఫెర్టిలిటీ, శాస్త్రీయ నైపుణ్యం, అధిక సక్సెస్ రేటుతో వేలాది మంది దంపతుల తల్లి దండ్రుల కలలను నిజం చేస్తోందన్నారు.







## ట్రిబ్యునల్ ఏర్పాటు యోచన చేయండి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి యాక్ట్, సెక్షన్ 462ఎ మేరకు మున్సిపల్ బిల్డింగ్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్రానికి హైకోర్టు సూచన చేసింది. ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే కోర్టులపై కేసుల భారం తగ్గుతుందని చెప్పింది. ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తామంటే వెంటనే జ్యుడిషయల్ మెంబర్స్ ఇస్తామని తెలిపింది. దీనిపై రిపోర్టు ఇవ్వాలని చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌డివిజన్ బెంచ్ ఆదేశించింది.మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలం కొత్తపేటలో రాదేశ్యాం కన్‌స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్‌కు జారీ చేసిన భవన నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని కోరుతూ జె. శ్రీనివాస యాదవ్ వేసిన పిటిషన్‌పై విచారణను ఏప్రిల్ 15కి వాయిదా వేసింది. పిటిషన్‌పై స్పందిస్తూ సంబంధిత భవన అనుమతుల వివరాలను సమర్పించాలని జిహెచ్‌ఎంసిని ఆదేశించిన డివిజన్ బెంచ్ తదుపరి విచారణను వచ్చే నెల 15కు వాయిదా వేసింది.

## ఎయిర్‌టెల్ 'కస్టమర్ డే 2026'

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వినియోగదారుల అనుభవాలను మెరుగుపరచడమే లక్ష్యంగా 'ఎయిర్టెల్' నేడు దేశవ్యాప్తంగా 'కస్టమర్ డే 2026'ను నిర్వహించింది. ఈ కార్యక్రమంలో భాగంగా సంస్థలోని దాదాపు 20,000 మంది ఉద్యోగులు, నాయకత్వ బృందాల నుండి నిపుణుల వరకు తమ కార్యాలయాల నుండి బయటకు వచ్చి క్షేత్రస్థాయిలో కస్టమర్లతో నేరుగా ముచ్చటించారు. ఉద్యోగులు నేరుగా వినియోగదారుల ఇళ్లకు, రిటైల్ సెంటర్లకు వెళ్లి వారి సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఎయిర్టెల్ ఇండియా ఎండి, సిఈఓ శాశ్వత్ శర్మ మాట్లాడుతూ 'కస్టమర్ డే అనేది మా బాధ్యతను గుర్తు చేసే ఒక ముఖ్యమైన సందర్భం. వినియోగదారుల ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తూ, సేవల ప్రమాణాలను నిరంతరం పెంచడమే మా నిశ్చయం,' అని అన్నారు. స్పామ్, ఫ్రాడ్ ప్రొటెక్షన్, సులభతరమైన ఎయిర్టెల్ యాప్ ప్రయాణం వంటివన్నీ కస్టమర్ల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే రూపొందించినట్లు సంస్థ తెలిపింది. ప్రస్తుతం ఎయిర్టెల్ భారత్, ఆఫ్రికాలోని 15 దేశాల్లో 60 కోట్లకు పైగా వినియోగదారులకు సేవలు అందిస్తోంది.





## గ్యాస్ సంక్షోభం!
# హాస్టళ్లలో 'ఆహారం కోత'లు..

సమస్యల్లో 'మధ్యాహ్న భోజనం'

**న్యూఢిల్లీ:** భారతదేశంలో ఎల్‌పిజి గ్యాస్ కొరత క్రమంగా తీవ్రమవుతున్నది. గ్యాస్ సరఫరా అస్థిరత కారణంగా గృహ వినియోగదారుల నుంచి హోటళ్లు, చిన్న వ్యాపారాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వరకు అనేక రంగాలు ప్రభావితమవుతున్నాయి. ముఖ్యంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధం, హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో ఏర్పడిన ఉద్రిక్తత వల్ల ఇంధన సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. ఈ మార్గం ద్వారా ప్రపంచ చమురు, గ్యాస్ రవాణాలో గణనీయమైన భాగం జరుగుతుంది కాబట్టి, అక్కడి పరిస్థితులు భారత్ వంటి దిగుమతులపై ఆధారపడే దేశాలపై ప్రభావం చూపుతున్నాయి. భారతదేశంలో వంట గ్యాస్ ప్రధానంగా గృహ అవసరాలకు ఉపయోగపడుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఎల్‌పిజి వినియోగం పెరిగింది. ఈ పరిస్థితుల్లో గ్యాస్ సంక్షోభం ముంచుకొస్తే, ముందుగా గృహావసరాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. సిలిండర్లు సమయానికి అందకపోతే ప్రజలు కట్టెలు, బొగ్గు వంటి సంప్రదాయ ఇంధనాలకు తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి. ఇది ఆరోగ్య సమస్యలను, పర్యావరణ కాలుష్యాన్ని పెంచే ప్రమాదాన్ని తెచ్చిపెడుతుంది. ప్రస్తుతం కమర్షియల్ గ్యాస్‌కు కూడా క్రమంగా కొరత ఏర్పడుతున్నట్టు పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి. అనేక హోటళ్లు, రెస్టారెంట్లు, తినుబండార కేంద్రాలు పూర్తిగా ఎల్‌పిజి సిలిండర్లపై ఆధారపడతాయి. గ్యాస్ సరఫరా లోపం ఏర్పడితే వ్యాపారులు, ప్రత్యేకించి చిన్న హోటళ్లు, వీధి ఫుడ్ స్టాళ్లు సమస్యలు ఎదుర్కొంటాయి. మధ్యాహ్న ఆహార పథకం వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా గ్యాస్ కొరత వల్ల సమస్యలు చుట్టుముడుతున్నాయి. పాఠశాలల్లో అమలు చేస్తున్న పిఎం పోషణ్ వంటి పథకాలు గ్యాస్ కొరత కారణంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉంది. లక్షలాది మంది విద్యార్థులకు ప్రతిరోజూ అందించే ఈ భోజనాన్ని సిద్ధం చేయడానికి ఎల్‌పిజి ముఖ్యమైన ఇంధనం. గ్యాస్ అందకపోతే పాఠశాలలు కట్టెలు లేదా ఇతర ప్రత్యామ్నాయాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఇలాంటి చర్యలు తాత్కాలిక ప్రత్యామ్నాయాలే తప్ప, వీటిని దీర్ఘకాలికంగా కొనసాగడం సాధ్యం కాదు. ఈ సమస్యను ఎదుర్కోవడానికి కొన్ని వ్యూహాత్మక చర్యలు అవసరం. మొదటిగా, ప్రభుత్వం గ్యాస్ సరఫరా వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలి. ఆసుపత్రులు, పాఠశాలలు, సామూహిక వంటశాలలు అత్యవసర రంగాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలి. అవసరమైతే అత్యవసర నిల్వలను విడుదల చేయడం కూడా ఒక మార్గం. అదే సమయంలో ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించాలి. విద్యుత్ ఆధారిత వంట పరికరాలు, పైప్ గ్యాస్ వ్యవస్థలు, బయోగ్యాస్ వంటి మార్గాలను విస్తృతంగా అభివృద్ధి చేయాలి. నగరాల్లో పైప్ నేచురల్ గ్యాస్ (పిఎన్‌జి) నెట్‌వర్క్‌ను విస్తరించడం ద్వారా సిలిండర్లపై ఆధారాన్ని తగ్గించవచ్చు. గ్యాస్ బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా కట్టడి చేయడం అత్యంత ముఖ్యమైనది. కొరత సమయంలో కొందరు సిలిండర్లను నిల్వచేసి అధిక ధరలకు విక్రయించే ప్రమాదం ఉంటుంది. దీనిపై కఠిన పర్యవేక్షణ అవసరం. సరఫరా వ్యవస్థ పారదర్శకంగా ఉండేలా డిజిటల్ ట్రాకింగ్ వ్యవస్థలను ఉపయోగించాలి. గ్యాస్ వినియోగాన్ని సమర్థవంతంగా నిర్వహించడం, అవసరానికి మించి నిల్వ చేయకపోవడం వంటి విషయాలలో ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. వంట సమయంలో గ్యాస్ ఆదా చేసే పద్ధతులను కూడా ప్రోత్సహించాలి. మొత్తం మీద గ్యాస్ సంక్షోభం తాత్కాలికమైనదైనా దాని ప్రభావం విస్తృతంగా ఉంటుంది. సరైన ప్రణాళిక, ప్రత్యామ్నాయ వనరుల అభివృద్ధి, సమర్థవంతమైన నిర్వహణ ద్వారా ఈ సమస్యను అధిగమించడం సాధ్యం. ప్రభుత్వం, పరిశ్రమలు మరియు ప్రజలు కలిసి పనిచేస్తే గ్యాస్ కొరత ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. భారత్‌కు వచ్చే వాణిజ్య నౌకలను హోర్ముజ్ జలసంధి మీదుగా వెళ్లేందుకు ఎలాంటి అడ్డంకులు కల్పించబోమని ఇరాన్ హామీ ఇచ్చినట్టు వస్తున్న వార్తలు కొంత ఊరటనిస్తున్నాయి.




# నివారణ చర్యలు తీసుకుంటున్నాం

గ్యాస్ సంక్షోభంపై
కేంద్ర మంత్రి సురేష్ గోపి




**త్రిస్సూర్ (కేరళ):** దేశంలో ఏర్పడిన ఎల్‌పిజి గ్యాస్ సంక్షోభాన్ని నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అదనంగా గ్యాస్ సరఫరా పొందేందుకు భారత్‌కు కొత్త మార్గాలు కూడా తెరుచుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు. గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ, గ్యాస్ సరఫరా సమస్యపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రి హర్దీప్ సింగ్ పురి బుధవారం పార్లమెంట్‌లో ఇప్పటికే వివరణ ఇచ్చారని తెలిపారు. అయితే అంతర్జాతీయ దౌత్య సంబంధాల కారణంగా కొన్ని విషయాలను బహిర్గతం చేయలేమని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి ద్వారా జరిగే సరఫరాకు సంబంధించిన అంశాలు సున్నితమైనవని చెప్పారు. కాగా, పశ్చిమ ఆసియాలో జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ మార్గం పూర్తిగా మూతబడితే, ప్రపంచ వ్యాప్తంగా వాణిజ్య వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతింటాయని ఐక్యరాజ్య సమితి ఇప్పటికే హెచ్చరించింది. అలా జరిగితే ఆహార ధరలు పెరగడం, జీవన వ్యయం అధికమవడం వంటి ప్రభావాలు కనిపించే అవకాశముంది. ఈ విషయమై వివిధ దేశాలతో ప్రధాని నరేంద్ర మోదీ చర్చలు జరిపారని గోపి అన్నారు. కొన్ని ప్రత్యేక మినహాయింపులు కోరుతూ ఈ చర్చలు సాగినట్టు పేర్కొన్నారు. ఖచ్చితమైన గణాంకాలను వెల్లడించలేనప్పటికీ, భారత్‌కు అదనంగా ఎల్‌పిజి సరఫరాకు ఎలాంటి ఆటంకం ఉండదనే విశ్వసిస్తున్నట్టు చెప్పారు. గ్యాస్ కొరత కారణంగా ప్రజల రోజువారీ జీవితంపై ప్రభావం పడుతున్నప్పటికీ, అత్యవసర సేవలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఆసుపత్రులు, శ్మశానవాటికలు వంటి అవసరమైన సేవలకు గ్యాస్ సరఫరా నిరంతరంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అనేక దేశాలలో గ్యాస్ సంక్షోభం ప్రభావం కనిపిస్తున్నప్పటికీ, పరిస్థితిని అధిగమించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని ఆయన అన్నారు. గ్యాస్ ధరలను నియంత్రించేందుకు ఒక విధానం అమల్లో ఉందని, దాని ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని సురేష్ గోపి వివరించారు. ప్రస్తుతం ఉన్న సంక్షోభ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆయన తెలిపారు.

## నేతాజీ అస్తికలపై పిటిషన్ స్వీకరణకు సుప్రీం నిరాకరణ

**న్యూఢిల్లీ:** నేతాజీ అస్తికల విషయంలో దాఖలైన పిటిషన్‌ను విచారణకు స్వీకరించడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. జపాన్‌లోని టోక్యో నగరంలోని రెంకోజీ టెంపుల్ వద్ద ఉన్నాయని భావిస్తున్న నేతాజీ అస్తికలను భారతదేశానికి తీసుకురావాలని కోరుతూ ఈ పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను నేతాజీ కుటుంబానికి చెందిన ఆయన మనవడు ఆశిస్ రే దాఖలు చేశారు. ఈ కేసును ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌తో పాటు న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, విపుల్ ఎం. పాంచోలీతో కూడిన ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదనలు వినిపిస్తూ, నేతాజీ అస్తికలకు తగిన గౌరవంతో ముగింపు ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. అయితే కోర్టు ఈ పిటిషన్‌పై ఆసక్తి చూపలేదు. గతంలో కూడా ఇదే అంశంపై ఒక పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించినట్లు ధర్మాసనం గుర్తుచేసింది. కోర్టు ముఖ్యంగా ఒక కీలక ప్రశ్నను లేవనెత్తింది. నిజంగా అవి నేతాజీ అస్తికలేనని నిరూపించే స్పష్టమైన ఆధారాలు ఉన్నాయా? అని ప్రశ్నించింది. అలాగే నేతాజీ వంటి మహానేతకు దేశం మొత్తం గౌరవం చూపుతుందని కూడా పేర్కొంది. మరొక ముఖ్యమైన అంశంగా, నేతాజీకి వారసురాలైన ఆయన కుమార్తె అభిప్రాయం కీలకమని కోర్టు తెలిపింది. ఆమె స్వయంగా కోర్టు ముందు రావాలని సూచించింది. కుటుంబ సభ్యుల మధ్య కూడా ఈ విషయంపై విభేదాలు ఉన్నాయని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ పరిస్థితుల్లో పిటిషనర్ తరపు న్యాయవాది పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరగా, సుప్రీంకోర్టు దాన్ని అనుమతించింది.

# ముడి చమురు సరఫరాపై తీవ్ర అనిశ్చితి

పెరుగుతున్న ధరలు.. ప్రజల్లో భయాందోళనలు
భారత్‌లోనూ ప్రభావం చూపుతున్న యుద్ధ పరిస్థితులు



**న్యూఢిల్లీ/ బ్యాంకాక్:** ప్రపంచ మార్కెట్లలో ముడి చమురు ధరలు ఇటీవల తీవ్ర మార్పులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయ ప్రమాణంగా భావించే 'బ్రెంట్ క్రూడ్ ఆయిల్' ధర బ్యారెల్‌కు 120 డాలర్లను చేరింది. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులను పేర్కోవాలి. అదే విధంగా, హోర్ముజ్ జలసంధి వద్ద నెలకొన్న ఉద్రిక్తతలు కూడా క్రూడ్ ఆయిల్ సరఫరాపై అనిశ్చితిని పెంచుతున్నాయి. వివిధ దేశాల నుంచి రవాణా అయ్యే చమురులో సుమారు నాలుగో వంతు ఈ మార్గం ద్వారానే వెళుతుంది. ఈ ప్రాంతంలో నౌకాశ్రయ రవాణా దాదాపు నిలిచిపోవడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరాపై అనిశ్చితి పెరిగింది. ఇరాన్ వాణిజ్య నౌకలపై దాడులు చేయడం, గల్ఫ్ దేశాలలోని చమురు క్షేత్రాలు, రిఫైనరీలను లక్ష్యంగా చేసుకోవడం వల్ల సరఫరా తగ్గే ప్రమాదం ఉందనే భయం మార్కెట్లలో ఏర్పడింది. దీనివల్ల చమురు ధరలు ఒక్కసారిగా 9 శాతం పైగా పెరిగాయి. అదే సమయంలో అమెరికా ప్రమాణమైన వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ క్రూడ్ ఆయిల్ ధర కూడా బ్యారెల్‌కు సుమారు 94 డాలర్లకు చేరింది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి ఇంటర్నేషనల్ ఎనర్జీ ఏజెన్సీ (ఐఇఎ) అత్యవసర చర్యలు తీసుకుంది. ప్రపంచ మార్కెట్లలో ధరల ఒత్తిడిని తగ్గించేందుకు తమ అత్యవసర నిల్వల నుంచి సుమారు 400 మిలియన్ బ్యారెల్ల చమురును విడుదల చేయాలని నిర్ణయించింది. ఇదే సమయంలో అమెరికా కూడా తన 'వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్' నుంచి 172 మిలియన్ బ్యారెల్ల చమురును విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. దీనివల్ల మార్కెట్లలో సరఫరా కొంత పెరిగి ధరలు అదుపులోకి వస్తాయని ఆశిస్తున్నారు. అయితే యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో స్పష్టత లేకపోవడం వల్ల చమురు ధరలలో తీవ్ర హెచ్చుతగ్గులు కొనసాగుతున్నాయి. విశ్లేషకుల అంచనాల ప్రకారం పరిస్థితి మరింత తీవ్రతరమైతే ఒక బ్యారెల్ చమురు ధర 140 డాలర్ల వరకు చేరే ప్రమాదం ఉంది. ఈ అనిశ్చితి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం చూపుతోంది. చమురు ధరలు పెరగడం వల్ల ప్రపంచవ్యాప్తంగా రవాణా ఖర్చులు, ఇంధన, విద్యుత్ ఉత్పత్తి వ్యయాలు పెరుగుతాయి. దీని ప్రభావం ఆహార ధరలపై కూడా పడుతుంది. ఇప్పటికే అమెరికాలో వినియోగదారుల ధరలు గత ఏడాదితో పోలిస్తే 2.4 శాతం పెరిగినట్లు నివేదికలు చెబుతున్నాయి. గ్యాసోలిన్ ధరలు పెరగడం వల్ల ఈ ద్రవ్యోల్బణం మరింత అధికమకమవుతుందని అంటున్నారు. చమురు ధరల పెరుగుదల కారణంగా ప్రపంచ స్టాక్ మార్కెట్లలో కూడా పడిపోవడం కనిపించింది. జపాన్‌లోని నిక్కెయ్ 225, దక్షిణ కొరియాలోని కాస్పీ, హాంకాంగ్‌లోని హాంగ్ సెంగ్ ఇండెక్స్ వంటి ప్రధాన సూచీలు తగ్గాయి. పెట్టుబడిదారులు భవిష్యత్ ఆర్థిక పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆర్థిక వృద్ధి మందగించడం, ద్రవ్యోల్బణం ఒకేసారి పెరగడం అనే 'స్టాగ్‌ఫ్లేషన్' మరో ఆర్థిక ప్రమాదంగా మారే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. చమురు ధరలు పెరగడం, ఉద్యోగ అవకాశాలు తగ్గడం వ ంటి కారణాల వల్ల ఈ ప్రమాదం పెరుగుతుందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా చూస్తే, పశ్చిమాసియాలోని యుద్ధ పరిస్థితులు చమురు ధరలను మాత్రమే కాదు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థను గణనీయంగా ప్రభావితం చేస్తున్నాయి.

# గ్యాస్ ఏజెన్సీల వద్ద కట్టుదిట్టమైన భద్రత




**న్యూఢిల్లీ:** ఎల్‌పిజి గ్యాస్ సరఫరా లోపం తీవ్ర సమస్యగా మారడంతో, దేశ రాజధాని న్యూఢిల్లీలోని పలు గ్యాస్ ఏజెన్సీల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. గ్యాస్ కొరత కారణంగా నల్లబజార్ (బ్లాక్ మార్కెటింగ్) పెరిగే అవకాశం ఉందని భావించి పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రజలకు గ్యాస్ సిలిండర్లు సరైన విధంగా అందేలా చూసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న గ్యాస్ ఏజెన్సీల జాబితాను సిద్ధం చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. పోలీసుల ప్రకారం, గ్యాస్ ఏజెన్సీల వద్ద పోలీసులు, పిసిఆర్ వాహనాలు, మోటార్ సైకిల్ పట్రోలు బృందాలను నియమించారు. గ్యాస్ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం లేదా అధిక ధరలకు అమ్మడం వంటి చర్యలను అడ్డుకోవడమే ఈ చర్యల ప్రధాన ఉద్దేశ్యం. గ్యాస్ సరఫరా కొరతను ఉపయోగించుకుని కొందరు వ్యాపారులు సిలిండర్లను అధిక ధరలకు విక్రయించే ప్రయత్నం చేస్తున్నారని సమాచారం రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. కొంతమంది దుకాణదారులు చిన్న సిలిండర్లను అక్రమంగా నింపి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారని కూడా పోలీసులు గుర్తించారు. ఇటువంటి చర్యలు కేవలం చట్ట విరుద్ధమే కాకుండా ప్రమాదకరమని అధికారులు హెచ్చరించారు. అనధికారికంగా సిలిండర్లను నింపడం వల్ల అగ్నిప్రమాదాలు లేదా పేలుళ్లు జరిగే ప్రమాదం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో సాధారణ దుస్తుల్లో ఉన్న పోలీసు సిబ్బంది కూడా గ్యాస్ ఏజెన్సీల పరిసర ప్రాంతాలను గమనిస్తూ సమాచారం సేకరిస్తున్నారు. ఎవరైనా గ్యాస్ సిలిండర్లను అక్రమంగా అమ్ముతున్నట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కాగా, కొన్ని ప్రాంతాల్లో ప్రజలు ఖాళీ సిలిండర్లతో గ్యాస్ కోసం తిరుగుతున్న పరిస్థితి కనిపిస్తోంది. సాధారణంగా రూ.1000–1100కి లభించే గ్యాస్ సిలిండర్ కొన్నిచోట్ల రూ.3000 నుంచి రూ.4500 వరకు నల్లబజార్‌లో అమ్ముతున్నట్లు సమాచారం. పరిస్థితి దృష్ట్యా పోలీసులు గ్యాస్ సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు చర్యలు కొనసాగిస్తున్నారు.

# కట్టెల పొయ్యిపై వంటలు




**కోల్‌కతా/ న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్‌లో ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత ఇప్పుడు పాఠశాలల మధ్యాహ్న భోజన కార్యక్రమంపై ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో వంట గ్యాస్ అందకపోవడంతో విద్యార్థులకు అందించే భోజనాన్ని సిద్ధం చేయడం కష్టంగా మారింది. సాధారణంగా మధ్యాహ్న భోజన పథకం కింద ప్రతిరోజూ గ్యాస్ సిలిండర్లతో వంట చేస్తారు. అయితే ఇటీవల సరఫరా తగ్గిపోవడంతో కొన్ని పాఠశాలలు ప్రత్యామ్నాయ ఇంధనాలపై ఆధారపడాల్సి వస్తోంది. ఉదాహరణకు, దక్షిణ 24 పరగణాస్ జిల్లాలోని కృష్ణచంద్రాపూర్ హై స్కూల్‌లో సుమారు 1500 మంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి. కానీ గ్యాస్ సిలిండర్లు అందకపోవడంతో మార్చి 11న పాఠశాల అధికారులు మట్టి పొయ్యిలను ఉపయోగించి కట్టెలతో వంట చేయించారు. ముందుగానే గ్యాస్ కొరత వచ్చే అవకాశం ఉందని భావించి కట్టెలను నిల్వచేసినా, అవి ఎక్కువ రోజులు సరిపోవని అధికారులు అంటున్నారు. అలాగే నాదియా జిల్లాలోని బిరోజాగులీ గోపాల్ అకాడెమీ పాఠశాలలో కూడా గ్యాస్ సిలిండర్లు పూర్తిగా అయిపోయాయి. ఈ కారణంగా అధికారులతో స్థానిక గ్యాస్ సరఫరాదారులు సంప్రదింపులు జరుపుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యాహ్న భోజన పథకం ఆగకూడదని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. మరోవైపు రాణి రష్మోనీ హై స్కూల్‌లో గ్యాస్ కొరత కారణంగా పూర్తిస్థాయి వంట చేయలేక విద్యార్థులకు పరిమితమైన ఆహారం మాత్రమే అందిస్తున్నారు. దేశ వ్యాప్తంగా చాలా ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. దేశంలో ఎల్‌పిజి గ్యాస్ సరఫరాపై అనిశ్చితి పెరగడంతో ప్రజలు ప్రత్యామ్నాయ వంట పద్ధతుల వైపు మళ్లుతున్నారు. ఫలితంగా, ఇండక్షన్ కుక్‌టాప్‌లు, ఇతర విద్యుత్ వంట పరికరాల అమ్మకాలు అకస్మాత్తుగా పెరిగాయి. గ్యాస్ సిలిండర్లు సరిపడా లభించకపోవచ్చనే భయంతో ప్రజలు, రెస్టారెంట్ల యజమానులు ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవడం ప్రారంభించారు. కనాట్ ప్లేస్‌లో ఉన్న ఒక కిచెన్ ఉపకరణాల దుకాణ యజమాని తెలిపిన ప్రకారం, గత రెండు రోజులుగా కస్టమర్ల సంఖ్య గణనీయంగా పెరిగింది. సాధారణంగా ఇండక్షన్ స్టావ్‌లను ఎక్కువగా హోటళ్లు, రెస్టారెంట్లు మాత్రమే కొనుగోలు చేసేవి. కానీ ఇప్పుడుగ్యాస్ సరఫరా నిలిచిపోతుందేమో అనే ఆందోళనతో సాధారణ గృహాల ప్రజలు కూడా విద్యుత్ ఆధారిత వంట పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. దుకాణాలకు వచ్చిన వినియోగదారుల సంఖ్య మాత్రమే కాకుండా ఫోన్ కాల్స్, ఆన్‌లైన్ విచారణలు కూడా పెరిగాయి. ఇండక్షన్ స్టావ్‌లతో పాటు వాటికి అనుకూలమైన పాత్రలపై కూడా డిమాండ్ పెరిగింది. ముఖ్యంగా స్టెయిన్లెస్ స్టీల్ పాత్రలు, కాస్ట్ ఐరన్ పాన్‌లు వంటి ఇండక్షన్‌కు సరిపడే పాత్రల అమ్మకాలు కూడా పెరిగినట్లు వ్యాపారులు తెలిపారు. కొన్ని దుకాణాల్లో ఇండక్షన్ కుక్‌టాప్‌ల అమ్మకాలు సుమారు 70 నుండి 75 శాతం వరకు పెరిగినట్లు అంచనా వేస్తున్నారు. గ్యాస్ కొరత ప్రభావం రెస్టారెంట్లపై కూడా కనిపిస్తోంది. దేశంలోని అనేక రెస్టారెంట్లు వంట కోసం ప్రధానంగా ఎల్‌పిజి సిలిండర్లపై ఆధారపడతాయి. సరఫరా తగ్గడంతో కొంతమంది రెస్టారెంట్లు తాత్కాలికంగా విద్యుత్ ఆధారిత వంట విధానాలను ప్రయత్నిస్తున్నాయి. అయితే అన్ని వంటకాలను ఇండక్షన్ లేదా విద్యుత్ పరికరాలతో తయారు చేయడం సాధ్యం కాకపోవడంతో మెనూను పరిమితం చేయాల్సి వస్తోంది. కొన్ని చిన్న హోటళ్లు , తినుబండార కేంద్రాలు కట్టెలు లేదా బొగ్గు వంటి సంప్రదాయ ఇంధనాల వైపు కూడా మళ్లుతున్నాయి. ఈ అనిశ్చితి ఎంతకాలం కొనసాగుతుందనేది ప్రశ్న.

# రూ. 'కోటి' కేసు 'సుప్రీం' కొట్టివేత



**న్యూఢిల్లీ:** ఒక ఆసక్తికరమైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు గురువారం కొట్టివేసింది. లక్నోకు చెందిన న్యాయవాది అశోక్ పాండే దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో, మాజీ ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాను రక్షించేందుకు 2018లో తాను దాఖలు చేసిన ఆరు కేసుల కోసం రూ.1 కోటి ఫీజు, ఖర్చులు చెల్లించేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. ఈ కేసును సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌తో పాటు న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, విపుల్ ఎం. పాంచోలీతో కూడిన ధర్మాసనం పరిశీలించింది. అనంతరం ఇది పూర్తిగా తప్పుదారి పట్టిన అభ్యర్థనగా పేర్కొంటూ కొట్టివేసింది. న్యాయవాది అశోక్ పాండే వాదన ప్రకారం, 2018లో అప్పటి సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తులు నిర్వహించిన ఒక మీడియా సమావేశం నేపథ్యంలో తాను ఆరు కేసులు దాఖలు చేశానని చెప్పారు. అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా గౌరవాన్ని కాపాడేందుకు, న్యాయవ్యవస్థను రక్షించేందుకు తాను ఈ కేసులు వేసినట్లు తెలిపారు. ఈ కేసుల కోసం తాను సుమారు రూ.2 లక్షలు ఖర్చు చేశానని, ఆ డబ్బును తన కుమార్తె నుంచి తీసుకున్నానని కూడా ఆయన కోర్టుకు వివరించారు. అయితే కోర్టు ఈ వాదనలను అంగీకరించలేదు. ఆ కేసులను సంస్థ కోసం చేసిన సామాజిక సేవగా పేర్కొంది. ఇలాంటి సామాజిక సేవకు ధర నిర్ణయించడం సాధ్యం కాదని వ్యాఖ్యానించింది. దాన్ని ఒక కోటి లేదా రెండు కోట్ల రూపాయలుగా ఎలా అంచనా వేయగలం? అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. 'మీరు చేసిన పని సామాజిక సేవగా భావిస్తే మేము దానికి అభినందనలు తెలుపుతాం' అని కూడా ధర్మాసనం పేర్కొంది. ఇంతకు ముందు అలహాబాద్ హైకోర్టు లక్నో బెంచ్ కూడా ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. అలాగే న్యాయ మంత్రిత్వ శాఖ కూడా 2024లో ఆయన చేసిన రూ.1 కోటి చెల్లింపు డిమాండ్‌ను తిరస్కరించింది. చివరగా సుప్రీంకోర్టు కూడా హైకోర్టు తీర్పును సమర్థిస్తూ పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో అశోక్ పాండే చేసిన రూ.1 కోటి ఫీజు మరియు ఖర్చుల డిమాండ్‌కు పూర్తిగా తెరపడింది.

**అమరవీరులను గౌరవించండి..**

ఒక యుద్ధ స్మారక చిహ్నం నిర్మాణానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ దాన్ని విచారణకు స్వీకరించడానికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌తో పాటు న్యాయమూర్తులు జోయ్‌మాల్య బాగ్చీ, విపుల్ ఎం. పాంచోలీతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికులను గౌరవించాలని పిటిషనర్‌కు కోర్టు సూచించింది. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్ జిల్లాలో నిర్మాణంలో ఉన్న 'సైన్య ధామ్' అనే యుద్ధ స్మారక చిహ్నానికి సంబంధించిన కేసు ఇది. పిటిషనర్ వాదన ప్రకారం, ఈ స్మారక చిహ్నం నిర్మిస్తున్న భూమి అటవీ భూమి కావడంతో అక్కడ నిర్మాణం చేయకూడదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఉత్తరాఖండ్ హైకోర్టు ఈ ఏడాది జనవరిలో ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే హైకోర్టు ఇప్పటికే ఈ పిటిషన్‌ను కొట్టివేసింది. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి పిటిషనర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. 'దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన సైనికుల కోసం నిర్మిస్తున్న స్మారక చిహ్నంపై మీకు అభ్యంతరం ఉందా? కనీసం వారి త్యాగాన్ని గౌరవించాలి కదా?' అని వ్యాఖ్యానించారు. హైకోర్టు ఈ పిటిషన్‌ను కేవలం కొట్టివేయడమే కాకుండా భారీ జరిమానాతో తిరస్కరించాల్సిందని కూడా ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ పిటిషన్ వెనుక ఎవరి ప్రేరణ ఉందో తెలుసుకునేందుకు షోకాజ్ నోటీసు జారీ చేయాలని కోర్టు ఆలోచించింది. ఇది కావాలని దాఖలు చేసిన తప్పుడు పిటిషన్‌లా కనిపిస్తోందని కూడా పేర్కొంది. పిటిషనర్‌పై ఒక లక్ష రూపాయల జరిమానా విధిస్తూ కేసును కొట్టివేయాలని కోర్టు సూచించింది. అయితే, ఈ పరిస్థితిలో పిటిషనర్ తరఫు న్యాయవాది పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి కోరారు. కోర్టు ఆ అభ్యర్థనను అనుమతించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో ఇచ్చిన వివరాల ప్రకారం, ఈ భూమిపై రెవెన్యూ శాఖ మరియు అటవీ శాఖ కలిసి సంయుక్త సర్వే నిర్వహించాయి. ఆ నివేదికలో ఈ భూమి అటవీ భూమి కాదని స్పష్టంగా పేర్కొన్నట్లు ప్రభుత్వం తెలిపింది. అటవీ శాఖకు కూడా ఈ నిర్మాణంపై ఎలాంటి అభ్యంతరం లేదని వెల్లడించింది. ఈ యుద్ధ స్మారక చిహ్న నిర్మాణం 2021లో ప్రారంభమై ప్రస్తుతం దాదాపు పూర్తయ్యిందని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు వివరించింది. చివరగా సుప్రీం కోర్టు కూడా ఈ అంశంలో జోక్యం చేసుకోవడానికి అవసరం లేదని భావించి పిటిషన్‌ను విచారణకు స్వీకరించలేదు.

# పశ్చిమాసియా పరిస్థితిపై... ఉభయ సభలలో చర్చ జరగాలి

కేంద్రానికి ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్

**న్యూఢిల్లీ:** పశ్చిమాసియా పరిస్థితి, భారతదేశంపై దాని ప్రభావాల విషయమై ఉభయ సభలలో చర్చ జరగాలని గురువారం ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కేంద్రాన్ని డిమాండ్ చేసింది. అయితే నరేంద్ర మోదీ ప్రభుత్వం ఈ అంశంపై చర్చకు భయపడుతున్నదని, అలాంటి చర్చను మొండిగా నిరాకరిస్తోందని, దీంతో ప్రభుత్వం విధానం ఏమిటన్నది 'ఇప్పటికే దారుణంగా బహిర్గతమైంది' అని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. విద్యుత్ కొరతకు దారితీసిన పశ్చిమాసియాపై పార్లమెంట్‌లో పూర్తి స్థాయి చర్చ జరగాలని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీలతో కలిసి డిమాండ్ చేస్తున్నాయి. దేశ ప్రజలు నిజం తెలుసుకోవాలని కోరుతున్నాయి. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఇన్‌చార్జి కమ్యూనికేషన్స్ జైరాం రమేశ్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ విదేశీ విధానం ఇప్పటికే దారుణంగా బహిర్గతమైందని విమర్శించారు. బుధవారం కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ దేశంలో విద్యుత్ సంక్షోభం తీవ్రం అవుతోందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నిప్పులు చెరిగారు. 'మోదీ ప్రభుత్వం నకిలీ మూలాల ఆధారిత హామీలు దాని పూర్తి అసమర్థతను తెలియజేస్తున్నాయి. పశ్చిమాసియాలో రాబోయే యుద్ధం గురించి కేంద్ర ప్రభుత్వానికి ముందే తెలుసు. అయినప్పటికీ భారతదేశం ఇంధన సరఫరాను భద్రపర్చడానికి అది ఏమీ చేయలేదు అని ఆయన తన 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. సోమవారం పార్లమెంట్ ఉభయసభలలో విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ చేసిన ప్రకటనపై అసంతృప్తి వ్యక్తంచేసిన కాంగ్రెస్ రాజ్యసభ నుంచి వాకౌట్ చేసింది. లోక్‌సభలో నిరసన తెలిపింది. పశ్చిమాసియా పరిస్థితిపై పార్లమెంట్‌లో విదేశాంగ మంత్రి ఎస్.జయశంకర్ చేసిన ప్రకటనను ప్రతిపక్షపార్టీ సోమవారం 'వాస్తవం' అని కొట్టిపారేసింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశీ విధానం (తప్పుడు) సాహసోపేతత్వం' ప్రభుత్వం భారతదేశ విదేశాంగ సేవను అణగదొక్కడంతో కలిసి భారత దేశాన్ని 'బానిసత్వం'లోకి నెట్టివేస్తోందని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ వ్యాఖ్యానించింది. భారతదేశం ఆసియాలో ఉద్రిక్తతలను తగ్గించాలని సోమవారం కాంగ్రెస్ కేంద్రానికి సూచించింది. ఇంధన భద్రత, వాణిజ్యాన్ని భద్రపర్చడంతో పాటు ఈ ప్రాంతంలోని దాదాపు కోటిమంది భారతీయుల భద్రతను ప్రాధాన్యతగా తీసుకుని, సంభాషణ, దౌత్యం ద్వారా అన్నింటినీ పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఫిబ్రవరి 28న అమెరికాఇజ్రాయెల్ ఒక పెద్ద సైనిక దాడిని ప్రారంభించింది. ఇరాన్ సుప్రీంలీడర్ ఆయతుల్లా ఖమేనీని చంపేశాయి. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి ఎస్.జైశంకర్ పార్లమెంట్‌లో ఒక సుమోటో ప్రకటన చేస్తూ ఈ ప్రాంతంలోని అన్ని రాష్ట్రాల సార్వభౌమత్వాన్ని, భూభాగ సమగ్రతను కాపాడుకోవడానికి భారత దేశం కట్టుబడి ఉందని అన్నారు. మానవతావాదంపై తీసుకున్న సరైన నిర్ణయంగా భారత ఓడరేవులో ఇరాన్ డాక్‌ను అనుమతించడాన్ని మంత్రి జైశంకర్ సమర్థించారు. ఈ ప్రాంతంలో మారుతున్న పరిస్థితిని భారత ప్రభుత్వం అత్యున్నత స్థాయిలో పర్యవేక్షిస్తున్నదని ఆయన తెలియజేశారు. సంఘర్షణ ప్రాంతం నుంచి చిక్కుకున్న 67,000 మంది భారతీయులను తిరిగి స్వదేశానికి తీసుకువచ్చామని చెప్పారు.

## ఆన్‌లైన్ మోసాల కేసులో దేశ వ్యాప్తంగా సిబిఐ సోదాలు

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా పెద్ద స్థాయి ఆన్‌లైన్ ఆర్థిక మోసం కేసులో దర్యాప్తు చేపట్టిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) గురువారం 15 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. విదేశీ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫారమ్ పివైవైపిఎల్ ద్వారా జరిగిన ఆన్‌లైన్ మోసాలకు సంబంధించి ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న చార్టర్డ్ అకౌంటెంట్ అశోక్ కుమార్ శర్మను ఇప్పటికే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయనను కస్టడీకి తీసుకునేందుకు సిబిఐ ప్రయత్నిస్తోంది. ఈ కేసును సిబిఐకి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చెందిన సైబర్ నేర విభాగం 'ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్' (ఐసిసిసిసి) అప్పగించింది.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీనపరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించబడినది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS07UH 4105 | Ranjith Chinthakindi | FORCE TEMPO TRAVELLER -P | 2019 |
| 2 | TS07UC 0104 | Rajesh Renukuntla | TOYOTA INNOVA-P | 2015 |
| 3 | TS15UB 0533 | Ravindhar Reddy Manchinilla | AL 4923 | 2014 |

AUCTION DATE : 14-03-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : వేలం తేది ప్రకటన నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D.No:5-11-503 & 504, Kandakatla Gateway 3rd floor, KUC X Road, Hanamkonda - 506009. Cell : 9849955900 & 9573787776

# తెరపైకి మహిళా రిజర్వేషన్ అమలు

చట్ట రూపం పొందినప్పటికీ కోల్డ్‌స్టోరేజ్‌లో పడిన చట్ట సభల్లో మహిళా రిజర్వేషన్‌ల అమలుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా పావులు కదుపుతున్నట్లు సంకేతాలు వెలువడుతున్నాయి. ఇదే నిజమైతే జనాభాలో సగమైన మహిళలకు శాసన రూపకల్పనలో మరింత భాగస్వామ్యం లభిస్తుంది. దశాబ్దాల పోరాటాల ఫలితంగా 2023 సెప్టెంబర్‌లో నారీ శక్తి వందన అధినియమం పేరిట రాజ్యాంగానికి 160వ సవరణ ద్వారా మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు ఆమోదించింది. తద్వారా శాసనసభ, లోక్‌సభలో మూడవ వంతు మహిళలకు రిజర్వేషన్‌లు దఖలు అవుతాయి. సరిగ్గా నాటి పార్లమెంటు సార్వత్రిక ఎన్నికలకు ముందు బిజెపి ఈ చట్టం చేయడం ద్వారా తాము మహిళా చట్టాన్ని తీసుకువచ్చామని ప్రచారమైతే చేసుకుంది. కానీ, దాని అమలు మాత్రం మరో దశాబ్దం తర్వాత అనే విధంగా మెలిక పెట్టింది మోదీ ప్రభుత్వం. నిజానికి 2026 తరువాత జరిగే జనాభా లెక్కలు పూర్తయిన అనంతరం నియోజకవర్గాల పునర్విభజన తరువాత వీటిని అమలు చేయనున్నట్లు చట్టంలో చేర్చారు. అంటే 2023లో చట్టం వచ్చినప్పటికీ, మహిళా రిజర్వేషన్‌లు అమలయ్యేందుకు రెండు ఎన్నికల వరకు ఆగవలసిందే. చేతిలో బెల్లం పెట్టి మోచేతిని నాకించిన చందంగా ఉంది. అందుకే రిజర్వేషన్‌లు వచ్చినప్పటికీ అమలుకు దశాబ్దం ఆగాల్సి రావడం మహిళా లోకానికి ఉసూరుమనిపించింది.

ఇప్పుడు అకస్మాత్తుగా మనస్సు మార్చుకొని తక్షణమే మహిళా రిజర్వేషన్‌లు అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం తలపోస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఇందుకు పార్లమెంటులో విపక్ష పార్టీలతో అనధికార మంతనాలు మొదలెట్టింది. మహిళా రిజర్వేషన్‌ల చట్టాన్ని వెంటనే అమలులోకి తీసుకు వచ్చేందుకు చట్ట సవరణకు ప్రతిపాదనలు తీసుకొని వస్తుంది. ప్రభుత్వ ఉద్దేశాలేవైనా, ఇది ఆహ్వానించాల్సిందే, కానీ మూడేళ్ళ క్రితమే చట్టమైనా తక్షణ అమలుకు గోడలు కట్టిన ప్రభుత్వం, వాటిని కూల్చేందుకు సిద్ధమవటం వెనుక పెద్ద పథకం ఉందనే కథనాలు వెలువడుతున్నాయి.

దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో బిజెపి వరుసగా మూడవ సారి గెలిచే ఎత్తులో భాగమే ఈ తలంపునకు కారణమని తెలుస్తోంది. ఈ రాష్ట్ర శాసనసభకు 2027 మార్చిలో ఎన్నికలు రానున్నాయి. ఆ ఎన్నికల్లో బిజెపి విజయంపై నిరుటి పార్లమెంటు ఎన్నికల ఫలితాలు ప్రమాద ఘంటికలను మోగించాయి. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలో బిజెపి లోక్‌సభ సభ్యుల సంఖ్య 62 నుంచి 2024 ఎన్నికల్లో 33కు పడిపోయింది. ఆ లెక్కన శాసనసభ సెగ్మెంట్‌లను చూసుకుంటే సమాజ్‌వాదీ పార్టీకి 178 స్థానాలలో ఆధిక్యత లభించింది. మొత్తం 403 స్థానాలు కలిగిన ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభలో తన భాగస్వామి కాంగ్రెస్‌కు ఆధిక్యం లభించిన శాసనసభ నియోజకవర్గాలను కలుపుకుంటే, ఎస్‌పి సులువుగా మెజారిటీ మార్కును దాటుతుంది. ఇది బిజెపి కలవరపాటుకు కారణమైంది. ఎందుకంటే 2014లో బిజెపి జాతీయ స్థాయిలో అధికారంలోకి కొనసాగటానికి ఆ రాష్ట్రమే బలమైన పునాది. 2014, 2019 లోక్‌సభ,2017, 2022 శాసనసభ ఎన్నికల్లో బిజెపి గరిష్ట స్థానాలను దక్కించుకొని రాష్ట్ర, జాతీయ స్థాయిలో అధికారాన్ని దక్కించుకుంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తర్‌ప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు తగ్గడంతో, ఆ ప్రభావం జాతీయ స్థాయిలో పడి లోక్‌సభలో మెజారిటీ మార్కును బిజెపి సొంతంగా అందుకోలేకపోయింది. దీంతో టిడిపి, జెడి(యు)ల మద్దతుతో మోదీ మూడవసారి ప్రధాని కాగలిగారు.

కంచుకోటలాంటి రాష్ట్రానికి పడిన బీటలను రాజకీయ చాణక్యంతో మరమ్మత్తు చేసుకోవాలని కాషాయం పార్టీ తలపోస్తోంది. ఇందుకు వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి పుంజుకునేందుకు మహిళా రిజర్వేషన్‌ను అస్త్రంగా చేసుకుంటోంది. ఉత్తర్‌ప్రదేశ్ శాసనసభలో మొదటి నుంచి మహిళల ప్రాతినిధ్యం తక్కువే. ప్రస్తుతం అక్కడ 51 మంది మహిళా ఎంఎల్‌ఏలే ఉన్నారు. ఇది పది శాతానికి కొంత ఎక్కువ. అందులో 30 మంది బిజెపి నుంచే గెలిచారు. గతంలో త్రిపుల్ తలాఖ్‌ను ఎత్తివేయటం ద్వారా మైనారిటీ మహిళల ఓట్లు గెలుచుకున్నామని లెక్కలు వేసుకున్న బిజెపి, ఈ సారి మొత్తంగా మహిళలను ఆకట్టుకోవాలని భావిస్తోంది. అకస్మాత్తుగా మహిళా రిజర్వేషన్‌లు తీసుకొస్తే 120 స్థానాలకు పైగా వారికి దక్కుతాయి. ఆ స్థాయిలో మహిళా నాయకులు బిజెపి యేతర పక్షాలకు లభించటం కష్టమవుతోంది. దీనిని ఉపయోగించుకొని మహిళ ఓట్లను గంపగుత్తగా దక్కించుకొని ఉత్తర్‌ప్రదేశ్‌లో బలాన్ని పెంచుకొని, తద్వారా ఆపై వచ్చే లోక్‌సభ ఎన్నికల నాటికి మరింత బలోపేతం కావాలనేది బిజెపి వ్యూహంగా భావించబడుతోంది.

ఎన్నికల కోసం ఏదైనా చేసేందుకు బిజెపి సిద్ధమే. 2016 నవంబర్ 8న ఎవరూ ఊహించని విధంగా వెయ్యి, ఐదొందల నోట్లను రద్దు చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ఇది ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే చేశారని చెప్పుకుంటారు. ప్రత్యర్థుల వద్ద ఆర్థిక వనరులు నిర్వీర్యం చేసి, తాము అధికారం కైవసం చేసుకునేందుకు నోట్ బందీని తీసుకవచ్చింది. ఇది ఫలించి 2017 ఎన్నికల్లో యుపిలో బిజెపి 312 అసెంబ్లీ సీట్ల భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2022 ఎన్నికల నాటికి 255 స్థానాలకు దిగజారింది. ఇప్పుడు ఎట్లాగైనా అతి పెద్ద రాష్ట్రాన్ని తమ చేతిలో నుంచి జారవిడుచుకోకుండా ఉండడమే, బిజెపికి మహిళా రిజర్వేషన్‌ల అమలుపై తాజా అవ్యాజ్య ప్రేమకు కారణం.

నిజానికి మహిళా రిజర్వేషన్ కోసం పోరాడిన, ప్రధాన రాజకీయ ఎజెండాలోకి తీసుకువచ్చిన ఘనత కమ్యూనిస్టు పార్లమెంటేరియెన్ గీతా ముఖర్జీదే. మహిళా రిజర్వేషన్ చట్టం తీసుకువస్తే చాలు, ఇంకేమి వద్దని తనకు వచ్చిన కేంద్ర మంత్రి ప్రతిపాదనను నిర్ద్వద్వంగా తిరస్కరించిన యోధ. ఒకసారి పార్లమెంటులో ప్యానల్ స్పీకర్‌గా ఉండి అకస్మాత్తుగా మహిళా రిజర్వేషన్ బిల్లును చర్చకు తీసుకువచ్చేందుకు కూడా ప్రయత్నించారు. చివరకు సభలో సాధ్యం కాని రోజు కంటతడిపెట్టి, తన భర్త మరణించిన నాడు కూడా ఇంత బాధపడలేదని వెక్కి వెక్కి ఏడ్చిన నిబద్ధురాలు.

ఆ తరువాత యుపిఏ అధ్యక్షురాలు సోనియాగాంధీ పట్టుబట్టి పార్లమెంటు ఎగువసభలో బిల్లును ఆమోదింపచేసి సజీవంగా ఉంచారు. మూడు దశాబ్దాలు చట్టసభల్లో నలిగిన ఈ బిల్లు 2023లో చట్టమైనప్పటికీ, దశాబ్ద కాలం ఎండమావిగా మారింది. ఇప్పుడు స్వార్థ చింతనతో అయినప్పటికీ మహిళా రిజర్వేషన్‌ను ముందుగా అమలులోకి తెచ్చేందుకు రాజ్యాంగ సవరణ బిల్లు తేవాలని ఆలోచించటం, ప్రతిపక్షాల సహకారంకోసం ప్రయత్నించటం ఆహ్వానించదగినదే.



## మహిళలు నాయకత్వం వహించాలి

**ఈరోజు మహిళల పాత్రపై ప్రత్యేకంగా మాట్లాడే అవకాశం రావడం ఆనందంగా భావిస్తున్నాను. ముఖ్యంగా వ్యవసాయం, ఆహార ఉత్పత్తి వ్యవస్థల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, విధాన రూపకల్పన, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలు, నాయకత్వ స్థాయిల్లో వారికి ఇంకా ఎక్కువ స్థానం కల్పించాల్సిన అవసరం ఉందని నేను భావిస్తున్నాను. ఈ రంగంలో మహిళల భాగస్వామ్యం పెరిగితే వ్యవసాయ అభివృద్ధి మరింత సమానత్వంతో ముందుకు సాగుతుంది. మహిళల విజయ కథలను విస్తృతంగా ప్రచారం చేయడం కూడా చాలా ముఖ్యం. సాంకేతికత వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలను తెరవుతోంది. భవిష్యత్తులో మహిళలు వ్యవసాయ రంగంలో నాయకత్వం వహించేలా మనం కలిసి కృషి చేయాలి. ఐక్యరాజ్యసమితి 2026 సంవత్సరాన్ని మహిళా రైతుల అంతర్జాతీయ సంవత్సరంగా ప్రకటించడం కూడా ఈ దిశలో ఒక ముఖ్యమైన అడుగు.**

- ద్రౌపది ముర్ము, భారత రాష్ట్రపతి

# మావోయిస్టు పార్టీ రేపటి రూపమేమిటి?

దేశంలో దశాబ్దాలపాటు రహస్య జీవితం నుంచి పీడిత ప్రజల పక్షాన ప్రాణాలకు తెగించి పోరాడిన భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఇప్పుడు సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్నది. ఆ పార్టీకి భవిష్యత్తు లేదన్న భావన రోజు రోజుకు బలపడుతుంది. మావోయిస్టు పార్టీ వీరాభిమానులు సైతం కాదనలేని పరిస్థితి. తీరు మారక తప్పదనుకుంటున్న మావోయిస్టు పార్టీ రేపటి రూపేంటి అన్న ప్రశ్న చాలామంది మదిలో మెదులు తుంది. సాయుధ పోరాటం స్థానే ప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రజల పక్షాన పోరాటాలు సాగిస్తారా అన్నది కూడా చర్చనీయాంశంగా ఉంది. ఒక రూపంలో నుంచి మరో రూపంలోకి శక్తి మారినట్లుగానే దశాబ్దాల పాటు సాగిన మావోయిస్టు పార్టీ ప్రజా ఉద్యమం మార్చి 31 తర్వాత నిద్రావస్థకు చేరుకుంటే క్రియాశీలక కార్యకర్తలు, వీరికి నాయకత్వం వహించిన వారు అస్త్ర సన్యాసం చేసి చేష్టలుడిగి చేతులు కట్టుకుని జీవిస్తారా? ఈ సమాజం గురించి, పాలకుల తీరు గురించి, అణగారిన ప్రజల జీవితాల గురించి, జరుగుతున్న దోపిడీ గురించి ఆలోచించి నోరు విప్పరా? ఒకవేళ నోరు విప్పితే దానికి కానున్న వేదిక ఏమిటన్న ప్రశ్న ఉదయించక తప్పదు. కేంద్ర ప్రభు త్వం మావోయిస్టుల పట్ల అత్యంత కర్కశంగా వ్యవహరించి ఎదురుగానో, వెనకనుంచో, పట్టుకు వచ్చో కాల్చి చంపింది. ప్రభుత్వ హింసాత్మక చర్యల నేపథ్యంలో ప్రస్తుత పరిస్థితులలో సాయుధ పోరాటాన్ని కొనసాగించలేమన్న భావనతో దశాబ్దాల పోరాటానికి సెలవు అని అనేకమంది లొంగుబాట పట్టారు. లొంగిపోయిన వారిలో అతికొద్ది మందిని మినహాయిస్తే మిగిలిన వారంతా సిద్ధాంతం పట్ల అత్యంత విశ్వాసాన్ని ప్రకటించడమే కాదు సమాజ మార్పుకు, దోపిడీ అంతానికి ఆ సిద్ధాంతం తప్ప మరో మార్గం లేదన్నారు. ఆ విశ్వాసంతో ఉన్న వారు ఆ భావనను ఏదో ఒక రూపంలో మళ్లీ ప్రజల్లోకి తీసుకుపోరా? అప్పుడు వారు తీసుకునే నిర్ణయం రేపటి రాజకీయాలపై ప్రభావం చూపవచ్చు. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా కమ్యూనిస్టుల పట్ల కొంత సానుకూలత కనిపిస్తుంది. అది క్రమేపి పెరుగుతుంది. కమ్యూనిస్టు పార్టీలలో ఇప్పటికిప్పుడు వేలు, లక్షల సంఖ్యలో చేరకపోవచ్చు కానీ సమాజానికి కమ్యూనిస్టుల అవసరం ఉందని గుర్తిస్తున్నవారి సంఖ్య పెరుగుతుంది. ఇది కాదనలేని సత్యం. నేను కాకపోయినా ఎవరో ఒకరు కమ్యూనిస్టులుగా ఉంటేనే పాలకుల తీరును ప్రశ్నిస్తారని అది ఈ సమాజానికి అవసరం అన్న భావన చాలామందిలో వ్యక్తమవుతుంది. కమ్యూనిస్టుల ప్రత్యామ్నాయం రాజకీయంగా ఓట్లు, సీట్ల పరంగా కాకపోవచ్చు కానీ మిగిలిన అన్ని అంశాలలో బిజెపికి కాదనలేని ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులే.

1970 దశకంలో కాంగ్రెస్ తీరును ఇప్పుడు బిజెపి తలపిస్తుంది. కాంగ్రెస్‌కు మించి మరో అడుగు ముందుకేసి మతచాందస వాదాన్ని ప్రేరేపిస్తూ మతం మాటున బలపడటం ద్వారా అంతం లేని అధికారాన్ని అనుభవించేందుకు రంగం సిద్ధం చేసుకుంటుంది. ఇదే సమయంలో తమ వ్యతిరేకులను ఏదో ఒక రూపంలో రాజకీయంగానో, భౌతికంగానో ప్రజల నుంచి వేరుచేసే పనిలో ఉంది. ఇందులో అధికారంలో ఉన్నా, లేని బూర్జువా పార్టీలు, వారి నేతలు ఉండటం గమనార్హం. కమ్యూనిస్టులను ఆగర్భ శత్రువుగా భావించే బిజెపి ఇటు అడవులను జల్లెడ పట్టి వీలైనంత మందిని హతమార్చిన తర్వాత అర్బన్ నక్సలైట్ నినాదాన్ని ముందుకు తెచ్చింది. ఇది భవిష్యత్తులో తీవ్ర రూపం దాల్చి ప్రశ్నించే వారిని కట్టడి చేసే ఆయుధంగా మారవచ్చు. దేశంలో ప్రజల పక్షాన ఆలోచించే కమ్యూనిస్టులే బిజెపికి లక్ష్యం. ఇటువంటి పరిస్థితుల్లో మరింత బలాన్ని కూడగట్టుకుని బిజెపికి ఎదురు నిలవాల్సిన స్థితి కమ్యూనిస్టులది. దశాబ్దాల పాటు ఎర్రజెండా నీడలో ప్రజల పక్షాన పనిచేసిన మావోయిస్టు పార్టీ వివిధ స్థాయి నాయకులు ఈ వాస్తవిక సత్యాన్ని గ్రహించాలి. తమ భావజాలానికి అనుగుణంగా ఇప్పుడు రాజకీయాలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లొంగిపోయిన వారిలో చాలామంది బహిరంగ వేదికల మీద ఇదే భావాన్ని వ్యక్తీకరిస్తున్నారు. ఇటువంటి వారంతా వామపక్ష ప్రజాతంత్ర శక్తులతో కలిసి పనిచేయటమే సమాజానికి మేలు చేస్తుంది. ప్రజాస్వామిక పద్ధతుల్లో ప్రజా పోరాటాల ద్వారా బిజెపిని నిలువరించేందుకు క్రియాశీలకం కావాలి. దశాబ్దాల త్యాగమయ జీవితానికి అర్థం, పరమార్థం ఉండేరీతిలో మావోయిస్టు పార్టీలో పనిచేసిన నాయకులు, కార్యకర్తల ఆలోచన సాగాలి. భారత కమ్యూనిస్టుపార్టీ మావోయిస్టు రేపటి రూపం మతోనాద్మ దోపిడీ శక్తులకు ఎదురొడ్డి పోరాడుతున్న వారికి బలం కావాలి. రాజ్యహింసతో మావోయిస్టుల కమ్యూనిస్టు ఆలోచన, కార్యాచరణ నిస్సారం కావని, రేపటి రాజకీయ రూపం అణగారిన ప్రజలకు, దోపిడీకి గురికాబడుతున్న వారికి బలమై ముందుకు సాగాలని ఆశిద్దాం.

ఏనుగు వెంకటేశ్వరరావు,
ప్రజాపక్షం, ఖమ్మం, 94909 52439

# గల్ఫ్‌లో యుద్ధంతో భారత్‌కు ఆర్థిక విపత్తు

ఇరాన్‌లో భౌగోళిక రాజకీయ కంపనతో ఆకస్మిక భయాందోళనతో బ్రెంట్ క్రూడ్ కొనుగోలు జరుగుతోంది. సౌదీ అరేబియాలోని అతిపెద్ద రిఫైనరీ రస్ తనూర, కటార్‌లోని ఎల్‌ఎన్‌జీ మెగా కాంప్లెక్స్ రస్ లఫాన్ ఉత్పత్తి నిలిపివేశాయి. హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో ట్యాంకర్‌ల ప్రయాణం నిలిచిపోయింది. వాటికి యుద్ధగండం, బీమా ప్రీమియం పెరుగుతున్నాయి, ఆయిలు ట్యాంకర్లపై ఇరాన్ రివల్యూషనరీ గార్డుల దళం దాడుల ముప్పు హెచ్చుతోంది. విఎల్‌సిసి/ఎల్‌ఎన్‌జి రవాణా ఛార్జీలు మూడు రెట్లు పెరిగాయి. ఇది భారత్‌కు పెద్ద ఆర్థిక విపత్తును సూచిస్తోంది. భారత్ రోజూ దిగుమతి చేసుకునే 50లక్షల బ్యారల్స్ క్రూడ్ ఆయిల్‌లో 26 లక్షల బ్యారల్స్ గల్ఫ్ దేశాలు, ఇరాన్ నుంచి ఇరుకైన హోర్ముజ్ జలసంధి ద్వారా రవాణా జరుగుతుంది.

ఇరాన్ గగనతలంలో యుద్ధం, హోర్ముజ్ దిగ్బంధనం దీర్ఘ కాలం కొనసాగితే భారతదేశ కరెంట్ ఖాతా లోటుపై వినాశకర ప్రభావం చూపుతుంది. మోదీ ఛాతీ (56 అంగుళాలు) చరుచుకునే ప్రచారం ఎలా ఉన్నప్పటికీ, ఆసియా కరెన్సీలో అత్యంత బలహీనంగా మన రూపాయి మారకపు విలువ డాలర్‌కు వంద రూపాయలకు పడిపోవటానికి రంగం సిద్ధంగా ఉంటుంది. ద్రవ్య ఒత్తిళ్లతో కరెంటు ఖాతాలోటు విస్తృతం కావటంతో భారత్‌లో ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దాంతో దలాల్ స్ట్రీట్ నుండి డాలర్లు ఉపసంహరణ వేగవంతమవుతుంది.



భారతదేశం ఎగుమతుల్లో 15శాతానికి గమ్యం గల్ఫ్. యూరప్, ఆసియాలకు భారత్ ఎగుమతుల రవాణాకు ఓడలకు సరుకు బదిలీ కేంద్రం దుబాయి. గల్ఫ్ దేశాల్లో (జిసిసి)లో పనిచేస్తున్న కోటిమంది భారతీయ కార్మికులు గత సంవత్సరం – విదేశాల నుంచి భారతీయులు జమచేసిన 135 బిలియన్ డాలర్లలో 40 శాతం పంపారు. భారతీయ ఆర్థిక సంపన్నులకు యుఎఇ అభిమాన గమ్యస్థానం. దాని విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, ఐదు నక్షత్రాల హోటళ్ళు, మానవ తయారీ దీవుల్లోని విలాసవంతమైన విల్లా ఆవాసాలు ఇరాన్ డ్రోన్, మిస్సైల్ దాడులకు గురవుతుంటే అవి వారిలో సురక్షితం కాదన్న భయం పుట్టిస్తున్నాయి.

యుఎఇలో నివసిస్తున్న 38లక్షల మంది భారతీయులు భారత్ నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల ఎగుమతులకు మంచి మార్కెట్. అమెరికా తదుపరి ఇదే రెండవ పెద్ద మార్కెట్. దుబాయి ఆస్తి బుడగ ముగింపు, ఇరాన్‌పై అమెరికా–ఇజ్రాయెల్ బాంబుదాడులు అక్కడి భారతీయ సంతతికి ఆర్థికంగా, వాణిజ్యపరంగా, దౌత్యపరంగా మానవ విపత్తుగా పరిణమిస్తున్నది. భారతీయ కుబేరులు ఇప్పుడు సింగపూర్, హాంగ్‌కాంగ్, స్విట్జర్లాండ్, మాల్టాలను సురక్షితంగా చూస్తున్నారు.

**రూపాయ పతనం :**

అమెరికా డాలర్‌తో మారకంలో భారత రూపాయి గత రెండేళ్లలో 10శాతం విలువ కోల్పోయింది. 2014 మే నెలలో నరేంద్ర మోదీ తొలిసారి ప్రధానమంత్రిగా ఎన్నికైనప్పుడు డాలర్‌తో రూపాయి విలువ 58. ఇప్పుడది 92కు పడిపోయింది. ఆర్థిక అద్భుతాలు సాధించామని బిజెపి చెప్పుకుంటున్న ఈ దశాబ్దంలో రూపా యి విలువ దారుణంగా 48శాతం క్షీణించింది. గల్ఫ్‌లోని మహా సంపన్నులు భారత ప్రైవేటు ఈక్విటీలో పెట్టుబడులు పెట్టటానికి సందేహించటానికి ఇదొక కార ణం.

**సెప్టెంబర్ వరకూ యుద్ధం!**

అమెరికన్ ప్రతినిధుల సభ (కాంగ్రెస్) 7 ఓట్ల తేడాతో ఇరాన్ పై యుద్ధంలో ట్రంప్‌ను బలపరిచింది. అది పెద్ద వార్త కాదు. యుద్ధం కనీసం సెప్టెంబర్ వరకూ కొనసాగవచ్చని మిలటరీ భావిస్తున్నట్లు పెంటగన్ (రక్షణ శాఖ కార్యాలయం) జారీ చేసిన మెమో గుండెలు గుభేలుమనిపించింది. ఎందుకంటే అది కాంగ్రెస్ మధ్యంతర ఎన్నికల ప్రచారంలోకి వెళుతుంది. ఇరాన్‌తో యుద్ధాన్ని రిమోట్ కంట్రోలుతో నడుపుతున్న తమ థాంప హెడ్ క్వార్టర్‌కు 100మంది ఇంటెలిజెన్స్ అధికారులు అవసరమని ఆ మెమో పేర్కొన్నది.

1973 యుద్ధ అధికారాల చట్టం ప్రకారం అధ్యక్షుడు విదేశాలకు సైన్యాలను పంపిన తర్వాత 60 రోజులలోపు కాంగ్రెస్ ఆమోదం కోసం రావాలి. కాని సెప్టెంబర్ దాకా యుద్ధమంటే ఆ కాలపరిమితి ఎంతో మించుతుంది. మెజారిటీ అమెరికన్‌లు ఈ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వం రోజుకు 1బిలియన్ డాలర్లు పన్ను చెల్లింపుదారుల సొమ్మును వెచ్చిస్తున్నది. మిలటరీ మెమో ఊహిస్తున్నంతకాలం యుద్ధం సాగితే అమెరికా యుద్ధ వ్యయం 100–150 బిలియన్ డాలర్లు అవుతుందని హౌస్ అప్రోప్రియేషన్ కమిటీ సభ్యుడు జోయి మొరెల్లె అంచనా వేశారు. ఇప్పుడు అనుమతి పొందిన ఒక ట్రిలియన్ డాలర్లకు మించి ధనం అవసరమైతే పెంటగాన్ కాంగ్రెస్ ముందుకు రావలసి ఉంటుంది. అమెరికన్‌లలో 27శాతం మాత్రమే (యుద్ధం మొదలు కాక ముందు) ఇరాన్‌తో యుద్ధాన్ని బలపరుస్తున్నారు. అమెరికా కాల్బలాన్ని పంపటాన్ని అనుకూలిస్తారా అన్న ప్రశ్నకు 12శాతం మాత్రమే సుముఖత తెలిపారు.

మరో పూర్వోదంతం రిపబ్లికన్ పార్టీని భయపెడుతున్నది. ఇరాన్ అణ్వస్త్ర సామర్థ్యాలను ధ్వంసం చేయటం యుద్ధం లక్ష్యంగా ట్రంప్, నెతన్యాహు చెప్పారు. అందుకోసం గత సంవత్సరం జరిపిన 12రోజుల యుద్ధం సఫలమైనట్లు అప్పుడు చెప్పారు. మరోవైపు నిత్యావసరాల ధరలు పెరుగుతున్నాయి. ట్రంప్ 150లక్షల మందిని ఆరోగ్య సంరక్షణనుంచి తొలగించారు.

**మొజ్తాబా ఖమేని**

అమెరికా–ఇజ్రాయెల్ బాంబుదాడులు హతమార్చిన ఇరాన్ సుప్రీంలీడర్, తన తండ్రి అలీ ఖమేనీ స్థానంలో మొజ్తాబా ఖమేనీ మార్చి 9(సోమవారం) సర్వోన్నతాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అతివాదులు బలమైన పట్టుకలిగి ఉండటాన్ని ఇది సూచిస్తోంది. ఇరానియన్ సంస్థలు, రాజకీయవేత్తలు, అధికారులు, ప్రజాప్రతినిధులు కొత్త సుప్రీంలీడర్‌కు విధేయతా పూర్వక ప్రకటనలు చేశారు. ఇరాన్‌లో ఇస్లామిస్ట్ ప్రభుత్వాన్ని మార్చాలని దశాబ్దాలుగా పశ్చిమ దేశాలు ప్రయత్నిస్తున్నాయి. ఇస్లామిస్ట్ వ్యతిరేక, షియా వ్యతిరేక వైఖరిని ప్రోత్సహించేందుకు దేశంలో ప్రజాస్వామ్యం లేదని, మహిళలను అణచివేస్తున్నారని, సామాజికంగా, ఆర్థికంగా ప్రతిష్టంభన ఏర్పడిందని నోరెత్తి అరిచారు. దీనివెనుకనున్న అసలు వాస్తవం – ఇరాన్ ఆయిలు, ఖనిజ సంపదపై కంట్రోలు సాధించటం, పెట్టుబడిదారీ భావజాలానికి దేశం తలవంచేటట్లు చేయటం. కొత్త సర్వోన్నతాధికారి ఎంపికలో తమకు పాత్ర ఉండాలన్న అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ డిమాండ్‌ను ఇరాన్ నాయకులు లక్ష్యపెట్టకపోవటం గమనార్హం.

ముఖ్య నాయకుణ్ణి అంతం చేయటం ద్వారా తమ వ్యతిరేక ప్రభుత్వాలను మార్చాలనే అమెరికా, పశ్చిమ దేశాల దుష్ట వ్యూహం అమలు తాత్కాలిక అస్థిరత సృష్టించవచ్చుగాని సునాయాసంగా ప్రభుత్వం మార్పును, సుస్థిరతను ఇవ్వలేవని ఇరాక్, సిరియా, లిబియా నిరూపించాయి. నాల్గవ దేశం – ఇరాన్ గూర్చి ఎంత దుష్ప్రచారం చేసినా అది నిలదొక్కుకుని ప్రతిఘటిస్తున్నది. ఇక అఫ్ఘానిస్థాన్‌లో తాలిబన్ తన అధికారాన్ని పటిష్టం చేసుకున్నట్లు కనిపిస్తున్నది.

ఇరాన్ పరిపాలనా సఖ్యతను, భౌగోళిక ఐక్యతను పరిరక్షించుకోగలదా అన్నది ఇప్పుడు దానిముందున్న పెద్ద సమస్య. 'డీప్ స్టేట్' మనుగడ, ప్రభుత్వ వ్యవహారాలు నడిపే సివిల్ బ్యూరోక్రసీ, టెక్నొక్రాటిక్ తరగతి సఖ్యతపై ఇది ఆధారపడి ఉంటుంది. అంతేగాక, రెగ్యులర్ ఆర్మీ(అర్తేష్), ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్‌జిసి) మధ్య ఐక్యత కొనసాగటంపై భౌగోళిక సమగ్రత ఆధారపడుతుందని ప్రొఫెసర్ ఫర్జానెగర్ అభిప్రాయపడ్డారు.

**– మతీన్ ఖలిద్, మార్క్ గ్రుయెన్‌బర్గ్, అసద్ మీర్జా**
***(ఐపిఎ సర్వీస్)***

# 'సర్'తో సమస్య ఎక్కడ వస్తుంది!

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళనే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సీవ్ రివిజన్(ఎస్ఐఆర్–సర్) ప్రక్రియ ఇప్పుడు తెలంగాణకు వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 53 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తయినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉన్న 3.39 కోట్లమంది ఓటర్ల వివరాలను సరిచూసేందుకు ఎన్నికల సంఘం భారీ ఏర్పాటు చేసింది. క్షేత్రస్థాయిలో ఓటర్ల గణన, మ్యాపింగ్ కోసం 35,985 బూత్ లెవెల్ ఆఫీసర్లు (బిఎల్వోలు) రంగంలోకి దిగారు. ప్రతి మండలం, మున్సిపాలిటీలో తహసిల్దార్ స్థాయి అధికారి (అసిస్టెంట్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్) ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఓటర్ల జాబితాలో డూప్లికేషన్ తొలగించేందుకు 2002 ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. తల్లిదండ్రుల రికార్డుల ఆధారంగా ప్రోజెనీ మ్యాపింగ్( వంశవృక్ష నిర్ధారణ) ద్వారా ఓటర్లను ధృవీకరిస్తున్నట్లు తెలిసింది. మొదటి విడతలో బిహార్, యుపి రాష్ట్రాల్లో చేపట్టి పూర్తి చేసినట్లు, రెండో విడతలో భాగంగా ప్రస్తుతం దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ కొనసాగుతున్నది. మూడో విడతలో తెలంగాణ సహా మిగతా రాష్ట్రాలకు సంబంధించిన షెడ్యూల్ ఈ ఏడాది ఏప్రిల్–మే నెల మధ్యలో చేపడుతామని తెలిపారు.

**రాజకీయ పార్టీలతో సమావేశం:**

దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రక్షాళనలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి సర్ ప్రక్రియపై రాజకీయ పార్టీలకు అవగాహన కల్పించేందుకు వాటి సహకారాన్ని కోరేందుకు ఫిబ్రవరి 5న రాష్ట్రంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. సర్ ప్రక్రియ చేపట్టినట్టు, దీనిపై అనుమానాలను నివారిస్తూ సహకరించాలని కోరారు.

గతంలో బిహార్ లో జరిగిన ఎస్ఐఆర్ అనుభవాన్ని గుర్తు చేస్తూ, తెలంగాణ లోను స్థానిక నివాసం లేని, మరణించిన వారి ఓట్ల తొలగింపు, కొత్త ఓటర్స్ ను చేర్పింపు ప్రక్రియ పై అప్రమత్తగా ఉండాలని ఓటర్లకు ప్రతిపక్షాలు సూచిస్తున్నాయి.

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో జరుగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ఇప్పటికే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నది. దీనిపై పలు ప్రతిపక్ష పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఇప్పుడు ఈ సర్ ప్రక్రియ.. అందులో భాగస్వాములైన బూత్ స్థాయి అధికారులకు (బిఎల్ఓలు) శాపంగా మారింది. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో నమోదవుతున్న బిఎల్ఓ ల మరణాలు ఈ ప్రక్రియలో అద్దం పడుతున్నాయి. తీవ్ర పనిఒత్తిడి, నిర్దేశిత టార్గెట్‌ను చేరుకోవాలంటూ అధికారుల నుంచి బెదిరింపులు, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వేధింపులు బిఎల్ఓ లను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉత్తరప్రదేశ్ సర్ ప్రక్రియలో ఉన్న బిఎల్ఓ లపై ఎఫ్ఐఆర్‌లు నమోదు అవుతున్నాయి. మరోవైపు గుజరాత్‌లోని సర్ లో భాగంగా విధులు నిర్వర్తిస్తున్న బిఎల్ఓ ల పరిస్థితి కూడా అదే విధంగా ఉన్నది. అహమదాబాదులోని ఖోక్రా డేటా అప్‌లోడింగ్ సెంటర్ వద్ద దాదాపు 20,050 మంది బిఎల్వోలు తమ పనిని నిలిపివేసి మరీ ధర్నాకు దిగారు.

సర్ పనుల్లో భాగంగా తాము తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆరోపించారు. మరో పక్క తాము ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపకుండా అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ప్రాథమిక పాఠశాల అధ్యాపకులైన ఈ బిఎల్ఓలు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సరైన మార్గదర్శకత్వం ఇవ్వకుండానే కఠినమైన గడువులను పెడుతున్నారని తమ బాధను వెళ్లగక్కుతున్నారు. ముఖ్యంగా మహిళ బిఎల్ఓ ల ఫోన్ నెంబర్లు బహిర్గతం కావడంతో రాత్రి వేళల్లో కాల్స్ వస్తున్నాయని దీంతో తాము వేధింపులకు గురవుతున్నామని వారు చెప్పారు.

**సర్వర్ సమస్యలు..**

ఎక్కువ పని గంటల పట్ల కూడా బిఎల్ఓ లు ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 7 గంటలకు సెంటర్‌కు చేరి మధ్యాహ్నం వరకు ఫీల్డ్ వర్క్ చేసి, తిరిగి అప్లోడింగ్ పనులకు రావటంతో తాము తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నామని వివరించారు. సర్వర్ సమస్యలతో రాత్రి వేళలోనూ పని చేయాల్సి వస్తుందని చెప్పారు. అర్ధరాత్రి 12, 1 గంట సమయాల్లోనూ అధికారులు ఫోన్ చేసి సర్వర్ పని చేస్తే వెంటనే డేటా ఎంట్రీ చేయాలని చెప్తారు.

**అవగాహన కల్పించకపోవడం తప్పు :**

సమగ్ర ఓటరు జాబితా సవరణ(ఎస్ఐఆర్ఆర్) పత్రములో ప్రతి ఓటరు వ్యక్తిగత వివరాలను నింపాలి. పుట్టిన తేదీని, ఆధార్ కార్డు సంఖ్యను (తప్పనిసరి కాదు), తల్లిదండ్రులు, జీవిత భాగస్వామి పేర్లను, ఓటర్ కార్డు గుర్తింపు సంఖ్య ఉంటే దానిని ఇవ్వాలి. అంతవరకు బాగానే ఉంది. ఎస్ఐఆర్ పత్రంలో దిగువ(రెండో) భాగంతోనే పేచీ వస్తోంది. అందులో ప్రతి ఓటరు తమ కుటుంబం గత 23 ఏళ్లుగా భారతదేశంలోనే నివసిస్తున్నట్లు ధృవీకరించే వివరాలను ఇవ్వాల్సి ఉంటుంది. ఓటర్లు ఈ దేశ పౌరులేనని నిర్ధారించడానికి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణమిది. ఈ వివరాలను ఇవ్వని వారి పేర్లను ఓటరు జాబితాల నుంచి కొట్టేసే ప్రమాదం ఉంది. అయితే ఈ మాటను అధికారికంగా బయటకు చెప్పకపోవడం వేరే సంగతి.

**పాత వివరాలు వెతకడం ఎలా?**

తాజా ఎస్ఐఆర్ దరఖాస్తు పత్రంలో ప్రస్తుత ఓటరు ఫారం దిగువ భాగంలో 2003 నాటి వ్యక్తిగత వివరాలను కానీ, అతడు లేదా ఆమె తాత తండ్రుల పేర్లను కానీ ఇవ్వాలి. 2003 నాటి ఓటరు జాబితాలను ఎన్నికల సంఘం వెబ్ సైట్ లో ఉంచారు. ఏ ఓటర్ అయినా 2003 జాబితాలోని తన అసెంబ్లీ నియోజకవర్గం కానీ, పోలింగ్ బూత్ కానీ స్పష్టంగా తెలియకపోతే చిక్కుల్లో పడినట్లే. తల్లితండ్రులు, తాత నాయనమ్మల పేర్లను వెబ్‌సైట్లో వెతకడం కష్టం. అవి పిడిఎఫ్ రూపంలో, ప్రాంతీయ భాషలో ఉండటమే దీనికి కారణం. ఉదాహరణకు ఉత్తరప్రదేశ్‌లో ఇలాంటి వివరాలు హిందీ భాషలో పిడిఎఫ్ రూపంలో ఉన్నాయి. ఓటరు దీర్ఘకాలంగా ఒకే చోట నివసిస్తున్నా, నియోజకవర్గం, పోలింగ్ కేంద్రం మారిపోయి ఉండవచ్చు. సర్ ఫారం ఎగువన స్థానిక బూత్ స్థాయి అధికారుల(బీఎల్ వో ల) ఫోన్ నెంబర్లు ఇవ్వడం కొంత నయమని చెప్పాలి. అయితే, ఓటరు వారికి ఫోన్ చేసి బూత్ గురించి తెలుసుకోవాలనుకున్నా, ఆ సమయములో బిఎల్వోలు వేరే పనులు ఉంటే ఫోన్ ఎత్తకపోవచ్చు. అంతకన్నా పై అధికారుల పరిస్థితి కూడా అలాగే ఉండవచ్చు. కొంతమంది బిల్ వోలు, ముఖ్యంగా గ్రామాల్లోని వారు సర్ పత్రంలోని మొదటి (ఎగువ) భాగాన్ని నింపి ఇచ్చివేయాలని, వివరాలను వారే భర్తీ చేస్తున్నారు. రెండు (దిగువ) భాగంలోని వివరాలను వారే భర్తీ చేస్తున్నారు. ఒకవేళ బిఎల్ఓలు ఫారం దిగువ భాగాన్ని నింపలేకపోతే పత్రం సగం ఖాళీగా మిగిలిపోతుంది. ఖాళీ పత్రాలను సమర్పించిన తర్వాత ఓటరుకు 2003 నాటి వివరాలు తెలిస్తే, వాటిని స్వీకరించడానికి తమకు అధికారం లేదంటూ బిఎల్‌వో లు నిరాకరిస్తున్నారు. గడువులోగా పని పూర్తి చేయాలని పై వాళ్ళ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక కొందరు బిఎల్ఓ లు తమకు తోచిన వివరాలతో ఫారాలను నింపేస్తున్నట్లు తెలుస్తుంది. ఇలాంటి ఓటర్ల పేర్లు గడువు తేదీకల్లా ప్రచురితమయ్యే తొలి జాబితాలో లేకపోతే, కొత్త ఓటర్లుగా రిజిస్టర్ కావడానికి నెం.6 ఫారాన్ని సమర్పించాల్సి వస్తుంది. కొంతమంది ఓటర్ల పేర్లు వారి తాతతండ్రుల పేర్లు 2003 ఓటర్ల జాబితాలో ఉన్నప్పటికీ ప్రస్తుత జాబితాలో లేకపోవడంతో ఎస్ ఐ ఆర్ ఫారాన్ని పొందలేక పోతున్నారు. వీరి పేర్లను ఉద్దేశపూర్వకంగా కానీ, కాకతాళీయంగా కానీ జాబితా నుంచి తొలగించి ఉండవచ్చు. ఇలాంటివారు కూడా కొత్త ఓటర్లుగా 6 నెంబర్ ఫారాన్ని సమర్పించాల్సి వస్తోంది.

రత్నాకర్ ఉజ్జిని

# మ్యాన్‌హోళ్లలో బ్లాంకెట్లు.. బెడ్‌షీట్లు!

''మహానగరం మనందరిది. కానీ కొంతమంది నిర్ల క్ష్యంగా మ్యాన్‌హోళ్లలో చెత్త, ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలు, జంతువుల అవశేషాలు వంటి ఘన వ్యర్థాలను వేస్తున్నారు. జలమండలి సిబ్బంది రాత్రింబవళ్ళు శ్రమించి ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. కానీ ప్రజల సహకారం లేకుండా నగరాన్ని శుభ్రంగా ఉంచడం సాధ్యం కాదు. అందుకే మ్యాన్‌హోల్ అంటే.. చెత్త బుట్ట కాదు.. మన బాధ్యత.. మనమే గుర్తుంచుకుందాం.. మ్యాన్‌హోళ్లలో చెత్త లేదంటే ఘన పదార్థాలు వేయకుండా జాగ్రత్త పడదాం.. అంటూ జలమండలి అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు''



**ప్రజాపక్షం/సిటీబ్యూరో:** మ్యాన్‌హోళ్లను వినియోగదారులు చెత్తకుప్పలుగా మారుస్తున్నారు. వస్తువులు, ఘన పదార్థాలు, వ్యర్థాలను మ్యాన్‌హోళ్లలో వేస్తుండటంతో తరచుగా మ్యాన్‌హోళ్లు జాం అవుతూ పొంగిపొర్లుతున్నాయి. డీ సిల్టింగ్ చేస్తున్న సందర్భాలలో మ్యాన్‌హోళ్ల నుంచి బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు, ఘన వ్యర్థాలు బయటకు వస్తుండటంతో జలమండలి అధికారులు ఆందోళన చెందుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇటువంటి వాటిని మ్యాన్‌హోళ్లలో వేయరాదంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నా.. ఫలితం లేకుండాపోతోందని జలమండలి అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గడచిన రెండు నెలలుగా జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ నెం21 పరిధిలోకి వచ్చే మాధాపూర్ సర్కిల్, చందర్ నాయక్‌తండా.. పరిసర ప్రాంతాలలో సీవరేజ్ ఓవర్ ఫ్లోను అధికారులు అరికట్టారు. ఇక చందర్‌నాయక్ తండా.. పరిసర ప్రాంతాలలో ప్రధాన సీవరేజ్ పైపులో ఏర్పడిన తీవ్ర లీకేజి కారణంగా మురుగు నీరు వెనక్కి రావడం(బ్యాక్ ఫ్లో).. రోడ్లపైకి మురుగు ప్రవహించడం వంటి సమస్యలు ఎదురయ్యాయి. దీనిపై సోషల్ మీడియా, జలమండలి మెట్రో కస్టమర్ కేర్‌కు, స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి అనేక ఫిర్యాదులు అందాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు మాదాపూర్ సర్కిల్ బృందం గత మూడు రోజులుగా నిరంతరం శ్రమించి, హై ప్రెషర్ జెట్టింగ్ మెషిన్, టెలిస్కోపిక్ హైడ్రాలిక్ గ్రాబర్ యంత్రాలతో సహాయంతో ప్రధాన సీవరేజ్ పైపులో ఏర్పడిన సిల్ట్‌ను బయటికి తీసి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా చేశారు. ఇలా నగరంలో చాల ప్రాంతాల్లో తరుచూ సీవరేజ్ ఓవర్ ఫ్లో ఫిర్యాదులు నమోదు కావడంతో అధికారులు డీ సిల్టింగ్ పనులు చేపడుతున్నారు. అయితే మ్యాన్‌హోళ్లలో నుంచి బ్లాంకెట్లు.. బెడ్ షీట్లు, బట్టలు, ప్లాస్టిక్ వస్తువులు ఇతర ఘన పదార్థాలను వెలికితీస్తున్నారు. ఆ కారణంగా ఆ ప్రాంతంలో సీవరేజ్ ఓవర్ ఫ్లో అవుతున్నట్టు గుర్తించి.. వాస్తవానికి స్పెషల్ డ్రైవ్ లో భాగంగా ఇక్కడ డీసిల్టింగ్ పనులు నిర్వహించి సిల్ట్ అంతా తొలగించినా, కానీ మళ్లీ అందులో వ్యర్థాలు వేయడం వల్ల అది పేరుకుపోయి మళ్లీ ఓవర్ ఫ్లో కావడం సర్వసాధారణం అయింది.

**అవగాహన లేమితో...**

వ్యాపారులు, ప్రజల అవగాహన లేమితో ఇలా చేయడం వల్ల సమస్య తిరిగి ఉత్పన్నమవుతోంది. హోటళ్లు, కార్యాలయాలు, బేకరీలు, ఫుడ్ కోర్టులు, వాణిజ్య భవనాల యజమానులు, బహుళ అంతస్తు భవన సముదాయాల నిర్వాహకులు, హాస్టళ్ల నిర్వాహకులు.. తమ సీవరేజ్ పైపులైన్‌ను నేరుగా జలమండలి సీవరేజ్ నెట్‌వర్క్‌కు అనుసంధానం చేయడంతో వాటి నుంచి వచ్చే ఆహార, వ్యర్థ పదార్థాలు మ్యాన్‌హోళ్లలో చేరుతున్నాయి. సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకపోవడం వల్ల కూడా ఈ సమస్య వస్తుంది. ఫలితంగా సీవరేజ్ పైపులైన్లపై ఒత్తిడి పెరిగి అవి ఓవర్ ఫ్లో అవుతున్నాయి.జనాల్లో అవగాహన, వారి నుంచి సరైన సహకారం లేకుంటే ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లు ఎన్ని చేపట్టినా సమస్యలు వస్తూనే ఉంటాయి. ఇక నుంచి ఎవరైనా మ్యాన్‌హోళ్లలో చెత్త, వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు.

## ప్రైవేట్ బిల్లుతో బిసిలను మోసగిస్తే ఊరుకోం

తమిళనాడు తరహాలో తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలి

రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బాల్‌రాజ్‌గౌడ్ డిమాండ్



**ప్రజాపక్షం / సోమాజిగూడ:** బిసిలకు 42శాతం రిజర్వేషన్ల ప్రైవేట్ బిల్లుతో ఒరిగేదేమీలేదని, దీని ద్వారా బిసిలను మోసం చేయాలని చూస్తే సహించబోమని బిసి ఇంటెలెక్చువల్ ఫోరం చైర్మన్, రిటైర్డ్ ఐఎఎస్ చిరంజీవులు, బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ హెచ్చరించారు. బిసి బిల్లును తమిళనాడు తరహాలో తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బైరు శేఖర్ గంగపుత్ర అధ్యక్షతన ఫోరం, ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన బిసి బిల్లుల చర్చ సమావేశంలో వారు మాట్లాడారు. బిసి రిజర్వేషన్ల బిల్లుపై కాంగ్రెస్ ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధానితో సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. సామాజిక న్యాయం అంటున్న కొంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ ఏ రోజు కూడా పార్లమెంట్ సమావేశాల్లో బిసి రిజర్వేషన్లపై మాట్లాడకపోవడం విచారకరమన్నారు. కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు అగ్రవర్ణాలకే రాజకీయ ప్రాధాన్యం ఇస్తూ బిసిలను విస్మరిస్తున్నాయని ఆగ్రహించారు. బిసిల రక్షణ చట్టం తేవాలని కోరారు. కేంద్రంకులగణనలో బిసి కాలమ్ చేర్చాలని విజ్ఞప్తి చేశారు. బిసిల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.50వేల కోట్లు కేటాయించిన ఎపి ప్రభుత్వ తరహాలో రాష్ట్ర బడ్జెట్‌లో కూడా బిసిలకు బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేశారు. ఫ్రంట్ కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ బిసి ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. బిసి విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలని కోరారు. సమావేశంలో ఫ్రంట్ వైస్‌చైర్మన్ ఎస్.దుర్గయ్యగౌడ్, కన్వీనర్లు యెలికట్లె విజయ్‌కుమార్‌గౌడ్, అంబాల నారాయణగౌడ్, బత్తిని కీర్తి లత, దామోదర్, నాగభూషణం, యర్రమాద వెంకన్న, శ్రీకాంత్, లింగేశ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఉద్యమకారులకు చట్టబద్ధ కమిటీ వేయాలి'



**ప్రజాపక్షం / సోమాజిగూడ:** తెలంగాణ ఉద్యమకారుల కొరకు చట్టబద్ధమైన కమిటీ వేయాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఆ కమిటీ కాల పరిమితి ఆరు నెలల వరకు ఉండాలని కోరాయి. గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో టియుఎఫ్ నేత జానకి రెడ్డి, ఉద్యమ సంఘాల నేతలు ఓరుగంటి ఆనంద్, సుల్తాన్ యాదగిరి, సికింద్రబేగం, అనిల్ కుమార్, సుజి, కొమురయ్యతో కలిసి టియుజెఎసి రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడారు. ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల మేరకు 250 గజాల స్థలం ఇవ్వాలని, హెల్త్, గుర్తింపు కార్డులివ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల డిమాండ్ల సాధనకు అన్ని సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామ ని రాంరెడ్డి స్పష్టంచేశారు. సమావేశంలో ఉద్యమకారులు మోహన్ బైరాగి, యా దగిరి, హరి, సుచరిత పాల్గొన్నారు.

## 'బ్లాక్‌డే'గా పేర్కొనడాన్ని ఖండిస్తున్నాం

తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జెఎసి చైర్మన్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి



**ప్రజాపక్షం/కవాడిగూడ:** తెలంగాణ రాష్ట్రం బిల్లు ఆమోదం పొందిన ఫిబ్రవరి 18, 2014ని పార్లమెంట్లో టిడిపి ఎంపీలు లావు కృష్ణదేవరాయలు, తెన్నేటి కృష్ణప్రసాద్ బ్లాక్‌డేగా పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ చైర్మన్, పంచాయతీరాజ్ ట్రిబ్యునల్ మాజీ సభ్యుడు పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం కవాడిగూడలోని జేఏసీ కార్యాలయంలో మాట్లాడుతూ, ఏపీ అభివృద్ధికి ఏంకావాలో అడిగే తెలివి లేదని, ఆంధ్ర ప్రజలు తెలంగాణ అభివృద్ధిని చూసి ఎంపీలను ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. ఆనాటి ఏపీ నేతల కుట్రలతోనే ఉద్యమంలో వందలాది మంది యువకులు ఆత్మబలి దానాలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన ప్రత్యేక హోదా సాధించుకోలేని వారు దానిని కప్పిపుచ్చుకోవడానికి సాకుగా చూపి తెలంగాణపై టిడిపి ఎంపీలు విషం కక్కుతున్నారని విమర్శించారు. ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను కలుపుకున్న ఏపీకి ఆదివాసుల ఉసురు తగులుతుందన్నారు. నిజానికి ఆత్మాభిమానం ఉంటే తెలంగాణలో ఆవాసం చేయరాదని అన్నారు. మీరు చిమ్ముతున్న విషపు మాటలు తెలుగు ప్రజలు, హైదరాబాదులో సమైక్యంగా ఉంటున్న మీ వారే మిమ్మల్ని ఛీదరించుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. రెచ్చగొడితే ప్రజలు స్పందిస్తున్నారు అనుకుంటే మూర్ఖత్వమే అవుతుంది అన్నారు.

## ఒబిసి జాబితాలో 130 కులాలను చేర్చాలి : బోరెద ప్రవీణ్

**ప్రజాపక్షం/సోమాజిగూడ:** కేంద్రం రాష్ట్రంలోని 130 బిసి కులాలను ఒబిసి జాబితాలో చేర్చిన తర్వాతే జనగణన చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ఒబిసి సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు బోరెద ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. జనగణనలో భాగంగా మే 11 నుంచి జూన్ 9 వరకు గృహాల నమోదు, వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 నుంచి ఫిబ్రవరి 28 వరకు జనగణన నిర్వహించే అవకాశం ఉన్నదన్నారు. రాష్ట్రంలోని 130 కులాలను వెనుకబడిన తరగతుల కులాలుగా ఇప్పటికే గుర్తించడమైందని, కానీ, కేంద్రం ఒబిసి జాబితాలో 90 కులాలను చేర్చడంతో మిగతా 40 కులాలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ 40 కులాలపై రాష్ట్ర ప్రభుత్వం, బిసి కమిషన్ కేంద్రం దృష్టికి తీసుకెళ్లినా, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. కేంద్రప్రభుత్వం బిసిల పట్ల నిర్లక్ష్యం వీడాలని కోరారు.

## మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్‌పై సమీక్ష చేయాలి

తెలంగాణ మహిళా సంఘాల డిమాండ్



ప్రజాపక్షం/చిక్కడపల్లి: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 13న మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ (ఫేజ్I) డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను ఆవిష్కరించేందుకు సిద్ధమవుతున్న నేపథ్యంలో... మహిళ, ట్రాన్స్‌జెండర్ సంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఒక సంఘీభావ చర్చా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశం ద్వారా మూసీ నదీ తీర ప్రాంతాల ప్రభావిత ప్రజలు, మూసీ జనాందోళన్ పోరాటానికి జేఏసీ మద్దతు ప్రకటించింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం నేపథ్యంలో, మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్ట్ వల్ల ప్రభావితమయిన, భవిత్యత్‌లో ప్రభావితమయ్యే మహిళలతో ఐక్యంగా ఈ సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న మహిళలు, ట్రాన్స్‌జెండర్ సంస్థల సంయుక్త కార్యాచరణ కమిటీ, ఉద్యమాల జాతీయ వేదిక ప్రతినిధి మీరా సంఘమిత్ర, పర్యావరణవేత్త డా.లుబ్నా సర్వత్, భూమి హక్కుల పరిశోధకురాలు, మహిళా రైతుల హక్కుల వేదిక నాయకురాలు డా.ఉషా సీతాలక్ష్మి, దళిత స్త్రీ శక్తి ప్రతినిధి ఝాన్సీ గడ్డం, పీఓడబ్ల్యూ వీ.సంధ్య, దబ్ ప్రతినిధి పులి కల్పన, పీఓడబ్ల్యూ ఝాన్సీ గాదె, మూసి జన ఆందోళన ప్రతినిధి సజయ, నివాస హక్కుల సమితిఛత్రి ప్రతినిధి వర్గీస్, రైతు స్వరాజ్య వేదిక హర్ష, అడ్వకేట్ అఖిల్ సూర్య, శంకర్, బస్తీ జాయింట్ యాక్షన్ కమిటీ నాయకురాలు ఇందిర, డబ్ల్యూటీ జేఏసీ ప్రతినిధి దీప్తి సిర్ల, సన్నిహిత ఉషారాణి, పీఓడబ్ల్యూ అనసూయ, మానవ హక్కుల వేదిక ప్రతినిధి సంజీవ్ తదితరులు ప్రాజెక్ట్ రూపకల్పన, అమలులో తొందరపాటు ప్రక్రియ, ఉల్లంఘనలు, ప్రజాస్వామ్య చర్చల లేమి, చట్టపరమైన లోపాలు వంటి అంశాలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 1990ల చివరి దశ నుంచి వివిధ రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు 'సుందరీకరణ' పేరిట మూసీ ప్రాజెక్టును ముందుకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించాయి. అయితే ప్రజలు ఆ ప్రయత్నాలను విజయవంతంగా ప్రతిఘటించారు. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న ప్రాజెక్టు ఒక భారీ వాణిజ్య, పర్యాటక ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటోంది. ఇది విస్తారమైన స్థాయిలో ప్రజలను నిర్బంధిత పునరావాసం, నది పరిసరాలు, పర్యావరణానికి విఘాతం, దానితో పాటు రాష్ట్రంలోని సాధారణ ప్రజలపై భారీ ఆర్థిక భారాన్ని మోపే ప్రమాదం ఉంది. గత కొన్ని నెలలుగా ఈ ప్రాజెక్ట్ కోసం భూమి స్వాధీనం చేసుకునేందుకు పలు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. ఈ తొందరపాటు భూస్వాధీనం ప్రక్రియను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ముఖ్యంగా జీఓ ఎంఎస్ నెం. 921 ప్రకారం సుమారు 10,000 నిర్మాణాలు, 3,279 ఎకరాల వరకు భూమి ఈ ప్రాజెక్ట్ కోసం స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని పేర్కొంది. ఇది 2013 భూ స్వాధీనం, పునరావాస చట్టంకు 2017లో చేసిన సవరణలను ఉపయోగించి అమలు చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ సవరణల వల్ల మొత్తం ప్రాజెక్ట్ను సోషియల్ ఇంపాక్ట్ అసెస్మెంట్ నుంచి మినహాయించడం.. ఇంత భారీ ప్రాజెక్ట్‌కు అవసరం లేదని ప్రభుత్వం భావించడం, వేలాది మహిళలు, పేద ప్రజలపై పడే తీవ్రమైన ప్రభావంపై ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్యాన్ని చూపిస్తుంది. మూసీ నది తీర ప్రాంతాల్లో నివసిస్తున్న మహిళలు శ్రామిక సమాజాలు, మధ్యతరగతి కాలనీలకు చెందినవారు ఈ మూసీ ఉద్యమాన్ని బలంగా నిలబెడుతున్నారు. దేశవ్యాప్తంగా పెద్ద ప్రాజెక్టుల వల్ల జరిగే నిర్వాసిత అనుభవాలు ఎప్పుడూ మహిళలే అత్యంత బాధను ఎదుర్కొంటారని చూపిస్తున్నాయి. ఇళ్లను కోల్పోవడం, జీవనాధారాలు దెబ్బతినడం, సాంస్కృతిక బంధాలు తెగిపోవడం, భవిష్యత్తు అనిశ్చితంగా మారడం వంటి సమస్యలు మహిళలపై తీవ్రంగా పడతాయి. మూసీ ప్రాంతంలో కూడా చాదర్‌ఘాట్ ప్రాంతంలోని కొన్ని వర్గాల, అస్థిత్వాల మహిళలు ఇప్పటికే బలవంతపు తరలింపులకు గురై, పునరావాసంలో తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం, కేంద్ర కాంగ్రెస్ పార్టీ మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును సమీక్షించాలని, భారీ స్థాయిలో ప్రజలను తరలించడం లేదంటే రియల్ ఎస్టేట్ అభివృద్ధి ద్వారా నదికి, పర్యావరణానికి నష్టం కలిగించడం కాకుండా పరిశ్రమల కాలుష్యాన్ని నియంత్రించడం ద్వారా మూసీ నదిని రక్షించాలి అని వారు విజ్ఞప్తి చేశారు.రాష్ట్ర అసెంబ్లీ 2017 ఎల్ఏఆర్ఆర్ సవరణలను వెంటనే రద్దు చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. అలా చేస్తే మూసీ, ఫార్మా సిటీ లేదా రాష్ట్రంలోని ఇతర ప్రాజెక్టుల విషయంలో కూడా సామాజిక ప్రభావ అంచనాను తప్పించుకోకుండా, మహిళలు , సామాజిక ఇబ్బందుల్లో ఉన్న వర్గాల అభిప్రాయాలను పూర్తిగా వినిపించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి అని సమావేశంలో పాల్గొన్న వారు గట్టిగా డిమాండ్ చేశారు.

# విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం

మంటల్లో బూడిదైన వస్తువులు, సామాగ్రి



**ప్రజాపక్షం/మలక్‌పేట్:** విద్యుదాఘాతంతో ఓ ఇంట్లో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మంటలు అంటుకోవడంతో ఇంటిలోని నిత్యావసర సరుకులు, దుస్తులు, సామాగ్రి, గృహోపకరణాలు కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అర్పివేయడం జరిగింది. వివరాలలోకి వెళితే... గడ్డిఅన్నారం పరిధిలోని ఎస్‌బీహెచ్ కాలనీ వెంచర్ 01లో గురువారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఇంటి నెంబర్ జిఎ11 భవనంలోని మొదటి అంతస్తులోని పోర్షన్‌లో మంటలు అంటుకున్నాయి. దీంతో నివాసితులు భయంతో పరుగులు తీశారు. ఈ క్రమంలోనే మంటల కారణంగా నిత్యావసర సరుకులు, సామాగ్రి, గృహోపకరణాలకు విద్యుదాఘాతంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందడంతో ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది, మలక్‌పేట్ ఫైర్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ మహమ్మద్ షౌకత్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని ఫైరింజన్ల సహాయంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. అయితే ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు తెలియాల్సి ఉంది. ఇదిలాఉండగా సంబంధిత రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘటనా స్థలాన్ని సందర్శించి అగ్ని ప్రమాదానికి సంబంధించిన వివరాలను సేకరించారు. ప్రమాదానికి సంబంధించిన సమగ్ర నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందచేయనున్నట్లు తెలిపారు.



సిఇసి జ్ఞానేశ్‌కుమార్ తొలగింపు తీర్మానం నోటీసుపై...

## 200మందికి పైగా ఎంపీలు సంతకం


**న్యూఢిల్లీ** : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని కోరుతూ తీర్మానం నోటీసుపై దాదాపు 200 మందికి పైగా ఎంపీలు సంతకం చేశారు. ఈ మొత్తం ఎంపీలలలో 130మంది లోక్‌సభ సభ్యులు, 63మంది రాజ్యసభ సభ్యులు సంతకం చేసినవారిలో ఉన్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. శుక్రవారం దాదాపు ఒక సభలోనైనా నోటీసు ఇచ్చే అవకాశం ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి. మరొకవైపు ప్రతిపక్ష నాయకుడు ఒకరు మాట్లాడుతూ నోటీసుపై సంతకం చేసేందుకు ఎంపీలు చాలా ఉత్సాహాన్ని కనబర్చారని, అవసరమైన సంఖ్యలు ఇప్పటికే సాధించినప్పటికీ గురువారం కూడా అనేకమంది ప్రజాప్రతినిధులు సంతకం చేయడానికి ముందుకు వచ్చారని చెప్పారు. అయితే కావలసిన సంఖ్యాబలం ఇప్పటికే పూర్తి అయిందన్నారు. నిబంధనల ప్రకారం లోక్‌సభలో ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని కోరుతూ కనీసం 100మంది ఎంపీలు నోటీసుపై సంతకం చేయాల్సి ఉంటుంది. అయితే రాజ్యసభలో అవసరమైన సంఖ్యా బలం 50మంది ఉండాలి. ఈ నోటీసుపై ఇండియా కూటమి సభ్యులు సంతకం చేశారని ఆ వర్గాలు తెలిపాయి. అయితే ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సభ్యులు కూడా సంతకాలు చేశారని మరో వర్గాలు తెలియజేశాయి. సిఇసిని తొలగించాలని కోరుతూ నోటీసు ఇవ్వడం ఇదే మొదటిసారి.

## రంజాన్ తోఫాలు పంపిణీ



**ప్రజాపక్షం/కవాడిగూడ:** రంజాన్ పర్వదినం పురస్కరించుకుని ముషీరాబాద్ నియోజకవర్గంలోని గాంధీనగర్ డివిజన్లో ముస్లిం మహిళలకు గురువారం రంజాన్ తోఫాలు అందజేశారు. కార్యక్రమానికి డివిజన్ మాజీ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తదితరులు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అందజేశారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈసారి కూడా మహిళలకు రంజాన్ తోఫాలు అందజేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, కాంగ్రెస్ నాయకులు అరవింద్ కుమార్ యాదవ్, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, నాయకులు నవీన్ కుమార్, ఆనందరావు, కుమార్, కాంగ్రెస్ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో నేతలు



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** శుభముహూర్తాల నేపథ్యంలో వివాహ వేడుకలు, శుభకార్యాలు పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధికి చెందిన వివిధ పార్టీల నేతలు గురువారం శుభకార్యాయాల్లో పాల్గొని బిజీగా గడిపారు. ఇందులో భాగంగానే ఫిల్మ్‌నగర్ వినాయనగర్ వాసులు గునగంటి నాగమణిచక్రవర్తిల కుమారుడు నరేష్ వివాహం శ్వేతతో జరిగింది. కాగా జూబ్లీహిల్స్ మాజీ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

## ఆస్తిపన్ను పాత బకాయిలకు వడ్డీ రాయితీ

**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిలు ఈ నెల 31వ తేదీలోగా చెల్లించాలని ఖైరతాబాద్ జోనల్ అధికారులు సూచించారు. ఓటీఎస్ పథకం కింద వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలని పిలుపునిచ్చారు. ఆస్తిపన్ను బకాయిలు ఆన్‌లైన్ పోర్టల్, మై క్యూర్ యాప్, మీ సేవ కేంద్రాలు, సిటిజన్ సర్వీస్ సెంటర్ లలో చెల్లించి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సకాలంలో ఆస్తి పన్ను చెల్లించండి... నగరాభివృద్ధికి సహకరించండి.... అంటూ అధికారులు కోరారు.

## ముగిసిన కావూరి అంత్యక్రియలు

ప్రముఖుల నివాళి



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** మాజీ కేంద్ర మంత్రి కావూరి సాంబశివరావు అంత్యక్రియలు గురువారం జూబ్లీ హిల్స్‌లోని మహాప్రస్థానంలో ముగిశాయి. కావూరి భౌతికకాయం వద్ద నివాళ్లు అర్పించి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం ప్రకటించారు. కాగా బుధవారం కావూరి చనిపోయిన విషయం విధితమే. బంజారాహిల్స్‌లోని కావూరి నివాసం నుంచి సాగిన అంతిమయాత్ర మహా ప్రస్థానం వద్ద ముగిసింది. అంతకు ముందు ప్రముఖ రాజకీయ నాయకులు, సినీ తారలు, వ్యాపారవేత్తలు, కావూరి నివాసం చేరుకొని నివాళులు అర్పించారు. కావూరి సాంబశివరావు మనవడు, ఎంపి భరత్ అంత్యక్రియ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## ఇంటర్ పరీక్షకు 87,955 మంది హాజరు

**ప్రజాపక్షం/సిటీ బ్యూరో:** హైదరాబాద్ జిల్లాలో గురువారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సరం రసాయన శాస్త్రం పరీక్షకు 87955 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 217 'పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఒడిదొడుకులు లేకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 92432 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా జనరల్ రసాయన శాస్త్రం పరీక్షకు 85908 మంది, వొకేషనల్ పరీక్షకు 2047 మంది హాజరయ్యారు. జనరల్‌లో 3688 మంది, వొకేషనల్‌లో 789 మంది విద్యార్థులు గైర్హాజరు.

## నిమ్స్ బాధితులకు ప్రభుత్వ అండ

మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి స్పష్టం


**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** నిమ్స్ ఆసుపత్రి అభివృద్ధి పేరుతో గత ప్రభుత్వ హయాంలో ఇండ్లు కోల్పోయిన తొమ్మిది మంది బాధితులకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలను కేటాయించడం పట్ల మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె బాధితులతో కలిసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎర్రమంజిల్ ప్రాంతంలో నివసిస్తున్న పేదల ఇండ్లను అత్యంత నిరంకుశంగా కూల్చివేశారని ఆరోపించారు. కనీసం ఇంట్లో రోగులు ఉన్నారని కూడా చూడకుండా, ఇష్టారాజ్యంగా వ్యవహరించారని మండిపడ్డారు. నాటి నుంచి బాధితుల పక్షాన తాము న్యాయస్థానంలో పోరాటం చేస్తూనే ఉన్నామని ఆమె గుర్తు చేశారు. పేదల పార్టీగా పేరున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లామని ఆమె తెలిపారు. వారి సానుకూల స్పందనతో, ఇండ్లు కోల్పోయిన తొమ్మిది మంది మహిళలకు అదే ఎర్రమంజిల్ ప్రాంతంలో ఇండ్ల స్థలాలను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేయడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ నిర్ణయం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ అండగా నిలబడుతుందని మరోసారి నిరూపితమైందని ఆమె అన్నారు. సమావేశంలో లబ్ధిదారులు తస్లీమ్ బేగం, విజయలక్ష్మి తో పాటు పలువురు మహిళలు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వస్త్ర దుకాణాలలో నిషేధిత హుక్కాదందా

గుట్టురట్టు చేసిన పోలీసులు

రూ.15వేల విలువైన హుక్కా ఫ్లేవర్ ప్యాకెట్లు, వైపర్ల స్వాధీనం



**ప్రజాపక్షం/సూర్యాపేట** : గుట్టు చప్పుడు కాకుండా వస్త్ర దుకాణాలలో కొంతమంది అక్రమార్కులు నిషేధిత హుక్కా దందాను కొనసాగిస్తుండగా సూర్యాపేట పోలీసులు గురువారం చాకచక్యంగా గుట్టును రట్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మెయిన్ రోడ్డులో ఉన్న ఆర్.వి. ఫ్యాషన్స్, ఎక్స్ట్రీమ్ దుకాణాలలో గుట్టు చప్పుడుగా గత కొంతకాలంగా హుక్కా అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పట్టణ పోలీసులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో రూ.15వేల విలువైన నిషేధిత హుక్కా ఫ్లేవర్ ప్యాకెట్లు, హుక్కా వైపర్లు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పి కె నరసింహ అధికారికంగా ప్రకటించారు. నిషేధిత హుక్కా సేవించడం వల్ల క్యాన్సర్ వ్యాధి సోకుతుందని, ప్రజల ఆరోగ్యాలను హరించే వ్యాపారాలను ఎవరైనా కొనసాగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి అమ్మకాలకు సంబంధించి తమకు సమాచారం అందిస్తే అక్రమార్కుల ఆట కట్టిస్తామని చెప్పారు. యువత ఇలాంటి చెడు అలవాట్లకు లోనై తమ జీవితాన్ని ఆగం చేసుకోవద్దని హితవు పలికారు.

## వైభవంగా శోభన్‌బాబు కుమార్తె వివాహం

వధూవరులను ఆశీర్వదించిన

ఎమ్మెల్యే అనిల్ కుమార్ రెడ్డి, పల్లా వెంకట్ రెడ్డి




**ప్రజాపక్షం/భువనగిరి** : యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ కన్వెన్షన్ హాల్లో సిపిఐ ఎఐటియుసి నాయకులు సామల శోభన్ బాబు కుమార్తె ఆకాంక్ష శ్రీకాంత్‌ల వివాహ వేడుక గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ శుభకార్యానికి భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ వివాహ వేడుకలో సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ చిస్తి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, పోత్నాక్ ప్రమోద్ కుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ జాలిగం విగ్నేష్, సరగడ అమర్ పాల్గొన్నారు. అదేవిధంగా ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి బందారపు వెంకటేష్, ఎండీ ఇమ్రాన్ హాజరయ్యారు.

## ఉపాధి హామీ నీటి నిల్వ పనులపై కేంద్ర బృందం పరిశీలన


**ప్రజాపక్షం/నకిరేకల్ (కట్టంగూర్)**: మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన నీటి నిల్వ పనులను జలసంచైజల భగీరథ ఇంపాక్ట్ స్టడీ కేంద్ర బృందం గురువారం పరిశీలించి వాటి ప్రభావాన్ని అంచనావేసింది.మండలంలోని కల్మేర,పరడ,ఈదులూర్ గ్రామాల్లో చేపట్టిన సోక్‌పిట్‌లు,ఓవర్‌హెడ్ ట్యాంక్, పెద్ద చెరువు, చెక్‌డాం,ఫారం పాండ్,చేపల చెరువు పనులను బృంద సభ్యులు పరిశీలించారు.ఈ పనుల వల్ల నీటి నిల్వలు పెరిగి ఆయకట్టు రైతుల బోర్లలో నీటి మట్టంమెరుగుపడిందని గమనించారు.దీంతో ప్రాంతంలో పచ్చదనం పెరిగిందని తెలిపారు. ఈదులూర్ గ్రామంలో ఫారం పాండ్‌ను పరిశీలించిన అనంతరం రైతు రాములు మాట్లాడుతూ అందులో నిల్వైన నీరు పత్తి తదితర పంటలకుఉపయోగపడుతోందని తెలిపారు.నీటి ఎద్దడిని తగ్గించడంలో ఫారం పాండ్‌లుఉపయుక్తమవుతున్నాయని వివరించారు. కేంద్ర బృంద సభ్యులు నవనీత్, రాచీ గార్గ్, ప్రతీప్ కోర్ డే నల్లగొండ ,నకిరేకల్ క్లస్టర్ ఏపీడీబీ నరసింహారావు నేతృత్వంలో పరిశీలన జరిగింది.ఈ కార్యక్రమంలో కట్టంగూర్ ఏపీవో కడెం రామ్మోహన్,ఈసీ శ్రీధర్,క్లస్టర్ టీఏ రమణ,ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గుండ్లపల్లి స్టేజి వద్ద ఆర్‌టిసి బస్సులు ఆపాలి : సిపిఐ డిమాండ్




**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట:** హైదరాబాద్ యాదగిరిగుట్ట మార్గంలో ప్రయాణించే అన్ని ఆర్టీసీ బస్సులను గుండ్లపల్లి స్టేజి వద్ద నిలపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళ్లెం కృష్ణ, పేరబోయిన మహేందర్ డిమాండ్ చేశారు. యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా నిర్వహించి డిపో సిఐకి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గుండ్లపల్లి నుండి ప్రతి రోజూ వందలాది మంది విద్యార్థులు భువనగిరిలోని కళాశాలలకు వెళ్తుంటారని తెలిపారు. ఉదయం సమయంలో బస్సులు ఆగకపోవడంతో విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు గమ్యస్థానాలకు చేరుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంటల తరబడి రోడ్డుపై నిలబడినా డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని ఆరోపించారు. గతంలో గోదా యాదగిరి నాయకత్వంలో పోరాటం చేసి, గుండ్లపల్లి రెవెన్యూ పరిధిలోకి బస్టాండ్, డిపో వచ్చేలా సాధించుకున్నామని నాయకులు గుర్తుచేశారు. అధికారులు స్పందించి గుండ్లపల్లి స్టేజి వద్ద అన్ని బస్సులు ఆగేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు పేరబోయిన పెంటయ్య, ఎఐటియుసి మండల కార్యదర్శి గోపగాని రాజు, వార్డు కార్యదర్శి ముక్కెర్ల పెంటయ్య, భగత్ సింగ్ యూత్ అధ్యక్షుడు కంబాల వెంకటేష్, నాయకులు కంబాల యాదగిరి, తోటకూరి శ్రీశైలం, శెట్టి నరసింహ, సత్యం, బండ రామచందర్ పాల్గొన్నారు.

## ఖదీర్ ఇంట్లో ఎసిబి సోదాలు



**ప్రజాపక్షం/యాదాద్రి** : జిల్లాలోని మోత్కూర్ ఎస్టీఓ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఖదీర్ నివాసంలో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. భువనగిరి పట్టణంలో ఉన్న ఆయన ఇంటిపై గురువారం ఆకస్మికంగా దాడులు చేసి పత్రాలు, ఆస్తుల వివరాలను పరిశీలించారు. ఎసిబి అధికారులు ఏకకాలంలో మోత్కూరులోని ఎస్టీఓ కార్యాలయంలో, భువనగిరి పట్టణంలోని ఆయన నివాసంలో సోదాలు నిర్వహించారు.

# గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి

ప్రజాప్రతినిధులు-అధికారులు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై గ్రామీణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల శిక్షణ



**ప్రజాపక్షం/నల్లగొండ:** ప్రజాప్రతినిధులు,అధికారులు సమన్వయంతో పనిచేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గురువారం జిల్లా పరిషత్ సమావేశ మందిరం,ఏచూరి గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా నూతనంగా ఎన్నికైన మున్సిపల్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లకు,గ్రామీణ స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సూచించారు. వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని,పట్టణాల్లో పారిశుద్ధ్యం, రోడ్డు భద్రత, యువత మత్తుపదార్థాల నివారణపై దృష్టి పెట్టాలని అన్నారు. రానున్న 5 సంవత్సరాల కాలంలో సమగ్రంగా అభివృద్ధి చేయాలన్నారుపారిశుద్ధ్యం,డ్రైనేజీ, తాగునీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని,జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు వస్తే మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలలో అభివృద్ధిపై దృష్టి సారించాలని, సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు వెళితే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంమిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి, జెడ్‌పిసి ఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి, డిపిఓ శంకర్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూపూడి రమేష్ హాజరయ్యారు.

### పథకాల అమలులో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో ప్రజాపాలప్రగతి ప్రణాళిక సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష జరుగుతున్న తరుణంలో పేద ప్రజలకు ఇచ్చిన హామీలను సక్రమంగా అమలు చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని కోరారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అధికారులు నిష్పక్షపాతంగా అమలు చేయాలని ఆయన సూచించారు.రైతుల రుణమాఫీ ఇంకా పూర్తిగా అమలు కాలేదని, మిగిలిన అర్హులైన రైతులందరికీ రుణమాఫీ తక్షణమే అమలు చేయాలని కోరారు. ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరు చేసిన తరువాత నిర్మాణ సమయంలో కొత్త ఆంక్షలు విధించి బిల్లులు నిలిపివేయడం సరైంది కాదన్నారు. ఎండాకాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో అనేక గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందడం లేదని,అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అన్ని గ్రామాలకు తాగునీరు సరఫరా చేయాలని కోరారు.అలాగే భూగర్భ జలాలు తగ్గిపోవడంతో సాగునీరు లేక పంట పొలాలు ఎండిపోతున్న రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## కోహేన్స్ ఫార్మసీ కంపెనీలో ప్రమాదం

**షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ లీకై ఇద్దరికి అస్వస్థత**
**చికిత్స కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలింపు**

**ప్రజాపక్షం/సూర్యాపేట** : సూర్యాపేట మున్సిపాలిటి పరిధిలోని వస్త్రాంతండ, 65వ జాతీయ రహదారి సమీపంలోని కోహేన్స్ ఫార్మసీ కంపెనీలో బుధవారం అర్ధరాత్రి ప్రమాదం చోటుచేసుకుంది. షార్ట్ సర్క్యూట్‌తో గ్యాస్ లీకై ఇద్దరు ఉద్యోగులకు గాయాలై తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఫార్మసీ కంపెనీ ఉన్నత అధికారులు వారిని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స కోసం తరలించారు. దీంతో స్థానికులు, సిపిఐ(ఎంఎల్) నాయకులు కంపెనీ ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ జనావాసాల మధ్య ఉన్న ఈ పరిశ్రమ తక్షణమే ఇతర ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. తక్షణమే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి గాయపడ్డ బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



# ప్రజల మన్ననలు పొందేలా ప్రజాప్రతినిధులు పనిచేయాలి

మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ప్రజల మన్ననలు పొందేలా ప్రజాప్రతినిధులు పనిచేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖల మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి, రాష్ట్ర కెబినెట్ ఆలోచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామన్నారు. ప్రజల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి అవగాహన కల్పించడంతోపాటు అర్హులైన లబ్ధిదారులకు అవి చేరేలా చూడాలన్నారు. ప్రజలకు మంచి చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కొంత సమయం కేటాయిస్తే క్షేత్రస్థాయిలో మంచి మార్పు కనిపిస్తుందని సూచించారు. పాలక వర్గాలు లేక గ్రామాలకు నిధులు రాలేదని, గత నెలన్నర కాలంలో పెద్ద ఎత్తున నిధులు విడుదల అయ్యాయని, మార్చి 31 లోపు మరిన్ని నిధులు విడుదల అవుతాయని చెప్పారు. ప్రతి గ్రామానికి జనాభా ఆధారంగా రూ.5లక్షల నుండి రూ.60 లక్షల వరకు నిధులు విడుదల అయ్యాయని, ఈ నిధులు ప్రణాళిక బద్ధంగా వినియోగించాలన్నారు. తెలంగాణలో ఈ ఖరీఫ్ సీజన్‌లో దేశంలో ఎక్కడ లేని విధంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం పండినదని, రైతుల నుండి 72లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి ఒక ఖరీఫ్ పంటకే రైతులకు రూ.20వేల కోట్లు చెల్లించినామన్నారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి, కోదాడ శాసనసభ్యులు మందుల సామేల్, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి కె నరసింహ, తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సిఈఓ శిరీష, డిపిఓ యాదగిరి, సిపిఓ కిషన్, డివైఎస్‌ఓ వెంకటరెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణతోపాటు మున్సిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## యాదగిరి లక్ష్మీనరసింహుడిని దర్శించుకున్న గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు

**ప్రజాపక్షం/యాదాద్రి:** రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గురువారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయనకు ఆలయ అధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు.ఆలయ ప్రాంగణానికి చేరుకున్న గవర్నర్‌కు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు కలెక్టర్ వెంకారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి పూలమొక్కలు అందజేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా గవర్నర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న గవర్నర్ దంపతులకు కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్ ఆధ్వర్యంలో అర్చకులు, వేద పండితులు 'పూర్ణకుంభం'తో స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ ధ్వజ స్తంభానికి మొక్కి, అంతరాలయంలో స్వామివారికి ప్రత్యేక అర్చన, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆయనకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం అనుబంధ దేవాలయమైన శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలోని స్ఫటిక లింగానికి గవర్నర్ దంపతులు అభిషేకం చేశారు. దర్శనం అనంతరం ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి గవర్నర్‌కు స్వామివారి ప్రసాదాన్ని అందజేయగా, కార్యనిర్వహణాధికారి భవానీ శంకర్ స్వామివారి జ్ఞాపికను (మెమెంటో) బహుకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

భువనగిరిలో ప్రజాప్రతినిధులకు 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/యాదాద్రి** : ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన పెంచుకుని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో ముందుంచాల్సిన బాధ్యత సర్పంచులు, వార్డు కౌన్సిలర్లు, చైర్ పర్సన్లపై ఉందని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం భువనగిరి పట్టణంలోని వికన్వెన్షన్ (న్యూ వివేరా) హాల్లో 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక @99 రోజుల కార్యచరణ'లో భాగంగా నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు నిర్వహించిన ఒకరోజు అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర గేయం ఆలపనతో ప్రారంభమైన ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు కొనసాగే ఈ 99 రోజుల కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ... నూతన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి తోడ్పడుతూ ప్రజలు మెచ్చేలా పాలన సాగించాలని పిలుపునిచ్చారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల వంటి సమస్యలపై తక్షణమే స్పందించాలన్నారు. పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ.. 10 ప్రధానాంశాల ఆధారంగా గ్రామాలను అందంగా తీర్చిదిద్దాలని, పెండింగ్ ఫైళ్లను క్లియర్ చేసి పారదర్శక పాలన అందించాలని సూచించారు. సెర్ప్ సీఈఓ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ.. 15వ ఆర్థిక సంఘం నిధులను వృథా చేయకుండా అంగన్వాడీ భవనాలు, శానిటేషన్ వంటి వినూత్న కార్యక్రమాలకు మళ్లించాలని కోరారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజాప్రతినిధులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనకు, రోడ్డు ప్రమాదాల నివారణకు గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రణాళికను వివరించగా, అదనపు కలెక్టర్ భాస్కరరావు, జడ్పీ సీఈవో శోభారాణి, మున్సిపల్ చైర్ పర్సన్ తంగేళ్లపల్లి శ్రీవాణి రవికుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తి, పాల్గొన్నారు.

## భార్యపై వేధింపులు.. భర్తకు రెండేళ్ల జైలుశిక్ష

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** భార్యను వేధించిన కేసులో నిందితుడికి నల్లగొండ ప్రత్యేక జెఎఫ్‌సీఎం కోర్టు రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించినట్లు జిల్లా ఎస్పిశరత్ చంద్ర పవార్ తెలిపారు.వివరాల ప్రకారం నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్‌లో 2015లో నమోదైన క్రైం కేసులో గిరగాని వేణు వరంగల్ జిల్లా కొండకండ్ల మండలం రామవరం గ్రామానికి చెందిన వ్యక్తి. ఆయన ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. భార్యపై వేధింపులకు పాల్పడినందుకు అతనిపై ఐపీసీ సెక్షన్ 498(ఏ) కింద కేసు నమోదు చేసి, పోలీసులు కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు గురువారం నిందితుడు గిరగాని వేణును దోషిగా తేల్చింది.ఐపీసీ సెక్షన్ 498(ఏ) కింద ఒక సంవత్సరం జైలు శిక్ష విధించగా,డౌరి ప్రొహిబిషన్ చట్టం సెక్షన్4 కింద మరో ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.5వేలు జరిమానా విధించింది. జరిమానా చెల్లించకపోతే మరో ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని కోర్టు ఆదేశించింది. ఈ రెండు శిక్షలు ఏకకాలంలో అమలులో ఉంటాయని ఎస్పి తెలిపారు.

## ముస్లింల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

కోదాడలో షాదీఖానాకు రూ. 3 కోట్లు, ఈద్గాకు రూ.2కోట్లు మంజూరు

రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

**ప్రజాపక్షం/కోదాడ**: ముస్లింల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు జబ్బార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన స్థానిక ఎమ్మెల్యే పద్మావతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రభుత్వం లౌకిక ప్రభుత్వమని, ముస్లింల సంక్షేమానికి తాను తన సతీమణి ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. ముస్లింల షాదిఖానాకు రూ.3కోట్లు, ఈద్గాకు రూ.2 కోట్లు మంజూరు చేశామని త్వరలో పనులు ప్రారంభం అవుతాయని అన్నారు. ముస్లింలు చదువుకుని అభివృద్ధి చెందాలన్నారు. ముస్లిం యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జబ్బార్ తనకు మంచి మిత్రుడని, జబ్బార్ పేదలకు చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను అభినందించారు. ముస్లిం సోదరులకు ముందస్తుగా రంజాన్ ఈద్ ముబారక్ తెలిపారు. కాగా రాష్ట్రంలో ఏర్పడ్డ గ్యాస్ కొరతపై విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ డీలర్లు కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రేపు హైద్రాబాద్‌లో ఈ సమస్యపై ఛీఫ్ సెక్రటరీతో, గ్యాస్ కంపెనీ యాజమానులతో సమావేశం ఏర్పాటు చేసి గ్యాస్ కొరత లేకుండా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లేశ్వరి, మాజీ సర్పంచులు ఎర్నేనిబాబు, పారా సీతయ్య, అల్తాఫ్ హుస్సేన్, చింతలపాటి శ్రీనివాసరావు, ఈదుల కృష్ణయ్య, బాగ్దాద్, షాబుద్దీన్, మహిమూద్, జాని, షమ్మి, అలీబాయ్, ఆర్డీవో సూర్యనారాయణ, తహసిల్దార్ వాజీద్‌అలీ, డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి, సిఐ శివశంకర్, కమిషనర్ రమాదేవి పాల్గొన్నారు.



## ఆర్‌టిసి బస్సు ఢీకొని మహిళ మృతి

సుభాష్ విగ్రహం చౌరస్తాలో విషాదం

యూ-టర్న్ వ్యవస్థ మార్చాలి

మరో ప్రాణం బలి కాకముందే అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి



**ప్రజాపక్షం/నల్లగొండ:** నగరంలోని సుభాష్ విగ్రహం చౌరస్తా వద్ద ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో ఓ మహిళ మృతి చెందిన విషాద సంఘటన గురువారం నల్లగొండ పట్టణంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, కాలినడకన రోడ్డు దాటుతున్న మహిళను యూటర్న్ తీసుకుంటున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో మహిళకు రెండు కాళ్లు విరిగి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. ఈ ఘటనతో నగరంలో విషాద వాతావరణం నెలకొంది.స్థానికుల మాటల ప్రకారం, నల్లగొండ నగర సుందరీకరణలో భాగంగా సుభాష్ విగ్రహం చౌరస్తాను నిర్మించినప్పటికీ రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడం వల్ల బస్టాండ్ నుంచి గడియారం వైపు వెళ్లే బస్సులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా మూల మలుపు వద్ద రోడ్డు ఇరుకుగా ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సులను నడిపే కొంతమంది డ్రైవర్లకు సరైన అనుభవం లేకపోవడం కూడా ప్రమాదాలకు కారణమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. రోడ్డు ఇరుకుదనం,ట్రాఫిక్ నియంత్రణ లోపం,డ్రైవర్ల నిర్లక్ష్యం కలిసి ఈ ప్రాంతాన్ని ప్రమాదాల కేంద్రంగా మార్చేశాయని వాహనదారులు చెబుతున్నారు.చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఉన్నప్పటికీ కొన్ని ఆర్టీసీ బస్సులు వాటిని పట్టించుకోకుండా రాంగ్ రూట్లలో యూటర్న్‌లు తీస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోజురోజుకు పెరుగుతున్న బస్సుల రద్దీ, రోడ్లపై గుంతలు, స్పష్టంగా కనిపించని బ్లైండ్ స్పాట్లు ఈ ప్రాంతాన్ని మరింత ప్రమాదకరంగా మారుస్తున్నాయని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ సమస్యకు పరిష్కారం దొరకలేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సుభాష్ విగ్రహం చుట్టూ రోడ్లను పునర్వ్యవస్థీకరించి గైడెడ్ యూటర్న్ లేన్లు, ఆటోమేటిక్ బ్యారియర్లు, భద్రతా సెన్సర్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.మరో ప్రాణం బలి కాకముందే అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ధోనీకి లైన్ క్లియర్



## కేసు కొట్టేసిన బిసిసిఐ

ఐపిఎల్ 19వ సీజన్ ప్రారంభానికి ముందే మహేంద్ర సింగ్ ధోనీకి భారీ ఊరట లభించింది. పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతున్నారని అతడిపై వచ్చిన ఫిర్యాదును బిసిసిఐ ఎథిక్స్ ఆఫీసర్ తోసిపుచ్చారు. దాంతో.. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున మరోసారి తన మ్యాజిక్ చూపించేందుకు తాలా సిద్ధమవుతున్నాడు. ఇప్పటికే నెట్స్‌లో సాధన చేస్తున్న మహీ భాయ్.. కేసు కొట్టివేతతో మరింత జోరు పెంచనున్నాడు. భారత క్రికెట్‌లో వివాదరహితుడుగా పేరొందిన ధోనీపై పరస్పర విరుద్ధ ప్రయోజనాల కేసు అభిమానులకు ఒకింత ఆశ్చర్యం కలిగింది. సిఎస్‌కె ఆటగాడిగా కొనసాగుతున్న ధోనీ.. ఒక క్రికెట్ అకాడమీ నడుపుతున్నాడు. ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ అనే అకాడమీలో ధోనీ భాగస్వామిగా ఉన్నాడు. అందుకని.. బిసిసిఐ నియమ నిబంధనల ప్రకారం అతడు పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందుతాన్నారని ఫిబ్రవరి 28న ఫిర్యాదు నమోదైంది. 2017లో రిజిష్టర్... ఐపిఎల్ ప్లేయర్‌గా ఉంటూనే అకాడమీని నిర్వహించడం ద్వారా ధోనీ బిసిసిఐ నియమావళిని ఉల్లంఘించారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. అంతేకాదు 2018లో బిసిసిఐ సవరించిన పరస్పర విరుద్ధ ప్రయోజనాల నియమాల ప్రకారం సిఎస్‌కె స్టార్.. తాను పొందుతున్న లాభాలను బహిర్గతం చేయలేదు. కాబట్టి ధోనీపై చర్యలు తీసుకోవాలని బిసిసిఐని కోరారు. అయితే.. బిసిసిఐ ఎథిక్స్ ఆఫీసర్ జస్టిస్ అరుణ్ మిశ్రా స్పందిస్తూ ధోనీపై చర్యలుండవని తేల్చేశారు. ధోనీ క్రికెట్ అకాడమీ 2017లో రిజిష్టర్ అయిందని.. పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు సంబంధించిన నియమాలను 2018 సెప్టెంబర్లో అమలులోకి వచ్చాయని అరుణ్ మిశ్రా వెల్లడించారు. క్రికెట్ అకాడమీ నిర్ణయాల్లో ధోనీ పాత్ర పరిమితమేనని స్పష్టం చేసిన ఆయన.. ఫిర్యాదుదారు పేర్కొన్న అంశాల ప్రకారం ధోనీపై చర్యలు తీసుకోవడం కుదరని చెప్పేశారు. 'ధోనీపై వచ్చిన ఫిర్యాదు సహేతుకమైనది కాదు. ఈ కేసు వెనకాల థర్డ్ పార్టీ పాత్ర ఉంది. తనకు నష్టం కలిగించారనే కోపంతోనే ఫిర్యాదుదారు ధోనీపై కక్షపూరితంగా కేసు వేశారు. ఆర్కా స్పోర్ట్స్ మేనేజ్మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రారంభించిన క్రికెట్ అకాడమీకి ధోనీని యజమానిగా పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఆ ఒప్పందం 2017లో జరిగింది. ఆ సమయంలోనే ధోనీ భారత జట్టు కెప్టెన్‌గా కొనసాగారు. కానీ, అతడిపై అప్పుడు పరస్పర విరుద్ధ ప్రయోజనాల కేసు నమోదు కాలేదు. సో.. ఫిర్యాదుదారు ఆరోపణలను తోసిపుచ్చుతున్నాం' అని అరుణ్ మిశ్రా వెల్లడించారు.

# తండ్రి మెడలో టి-20 మెడల్

## 'నా జీవితంలో నిజమైన హీరో' అంటూ భారత క్రికెటర్ శివం దూబే పోస్ట్..!



పొట్టి ప్రపంచకప్‌లో భారత జట్టు విజయాల్లో కీలకమైన శివం దూబేపై ప్రశంసలు కురుస్తున్నాయి. టీమిండియా వరుసగా రెండోసారి విజేతగా నిలవడంలో దూబే కనిపించని హీరో అని మాజీ ఆటగాళ్లు అతడిని ఆకాశానికెత్తేస్తున్నారు. అయితే.. భారత స్టార్ మాత్రం తాను రియల్ హీరోగా భావించే వ్యక్తిని అభిమానులకు పరిచయం చేశాడు. ఆయన ఎవరో కాదు అతడికి జన్మనిచ్చిన తండ్రి. పొట్టి ప్రపంచకప్ విజేతలుగా ఇళ్లకు చేరుకున్న భారత ఆటగాళ్లు తమ సంతోషాన్ని కుటుంబంతో పంచుకుంటున్నారు. ఆల్రౌండర్ శివం దూబే మాత్రం తన తండ్రి రాజేశ్ దూబే మెడలో ప్రపంచకప్ మెడల్ వేసి సంబురపడ్డాడు. టీమిండియా జెర్సీ ధరించిన తండ్రి మెడలో తనకు బహుమతిగా లభించిన మెడల్ వేసి మురిసిపోయాడు. ఆ ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెట్టాడు దూబే. 'నా జీవితంలో నిజమైన హీరో' అనే క్యాప్షన్‌తో అతడు పెట్టిన ఫొటోలు నెట్టింట వైరలవుతున్నాయి.ఐపిఎల్ సంచలనంగా భారత టి20 జట్టులోకి దూసుకొచ్చిన శివం దూబే.. నమ్మదగిన ఆటగాడిగా ఎదిగాడు. రెండేళ్ల క్రితం పొట్టి ప్రపంచకప్‌లో పర్లేదనిపించిన దూబే.. ఈసారి మాత్రం మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగాడు. చేసింది కొన్నిపరుగులే అయినా.. భారత జట్టు విజయానికి అవి ఎంతో కీలకమయ్యాయి. దూకుడే మంత్రంగా 169.06 స్ట్రయిక్ రేటుతో రెండు అర్ధ శతకాలతో కలిపి 235 రన్స్ సాధించాడీ హిట్టర్. వరల్డ్‌కప్ సవిజేతగా సొంతూరికి రైల్లో వెళ్లి అందరిని ఆశ్చర్యపరిచిన దూబే.. ఇంటికి వెళ్లాక తండ్రితో తన సంతోషాన్ని పంచుకున్నాడు.

# సెమీస్‌కు భారత్

## వేల్స్‌పై ఘనవిజయం...నవనీత్ కౌర్ హ్యాట్రిక్

ఎఫ్ఐహెచ్ ఉమెన్స్ హాకీ వరల్డ్‌కప్ క్వాలిఫయర్స్‌లో భారత మహిళల జట్టు సెమీఫైనల్‌కు దూసు కెళ్లింది. గచ్చిబౌలిలో బుధవారం రాత్రి భారత జట్టు.. 4-1తో వేల్స్‌పై ఘనవిజయం సాధించి పూల్-బి నుంచి సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. నవనీత్ కౌర్ హ్యాట్రిక్ (29, 34, 55 నిమిషాల్లో) గోల్స్ చేసి భారత్‌ను తిరుగులేని స్థితిలో నిలుపగా సాక్షి రాణా (7వ నిమిషంలో) ఒక గోల్ కొట్టింది. వేల్స్ నుంచి థామస్ బెట్సన్ ఒక గోల్ చేసింది. ఈ మ్యాచ్‌ను డ్రా చేసుకున్నా సెమీస్ బెర్తును దక్కించుకునే అవకాశమున్న భారత్.. నాలుగు క్వార్టర్స్‌లోనూ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించి ఏకపక్ష విజయం సాధించింది. తొలి క్వార్టర్స్ ఏడో నిమిషంలోనే సాక్షి.. కెప్టెన్ సలీమ అందించిన బంతిని బలమైన రివర్స్ హిట్‌తో ప్రత్యర్థి గోల్‌పోస్ట్‌కు పంపి తొలి గోల్ అందించింది. రెండో క్వార్టర్ నుంచి నవనీత్ మాయ మొదలైంది. పెనాల్టీ కార్నర్‌ను తొలి గోల్‌గా మలిచిన ఆమె.. మూడో క్వార్టర్‌లోనూ మరో గోల్తో మ్యాచ్‌ను ఏకపక్షంగా మార్చేసింది. ఆఖరి క్వార్టర్‌లో వేల్స్ గోల్ కొట్టి ఆతిథ్య జట్టు ఆధిపత్యాన్ని తగ్గించినా 55వ నిమిషంలో నవనీత్ హ్యాట్రిక్‌తో భారత్ భారీ విజయం సాధించింది. సెమీస్‌లో భారత జట్టు శుక్రవారం.. ఇటలీతో తలపడనుంది.



# పోటీ కోసం జికె

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

## రాజ్యాంగంపై అంతిమ వ్యాఖ్యాత ఎవరు?



- ఆభరణాల తయారీలో బంగారంతో కలిపే లోహం ఏది?
  రాగి
- గాలిలోని తేమను కొలిచే సాధనం ఏది?
  హైగ్రోమీటర్
- ఎల్పీజీ (వంట గ్యాసు లో ఉండేది?
  బ్యూటేన్
- స్వైన్ ఫ్లూ కారక హెచ్‌ఐఎస్ఐ వైరస్కు ఉన్న వైద్యనామం?
  ఇన్‌ఫ్లూయెంజా
- రిజర్వ్ బ్యాంకు గుణాత్మక పరపతి నియంత్రణలో ఏది చేరదు?
  మోతాదు అవసరంలో మార్పు
- ట్రాన్స్ అంటార్కిటిక్ పర్వతాల పొడవు?
  3050 కి. మీ.
- కంప్యూటర్ సీపీయూల్లో అనుబంధం కాని భాగం?
  అడ్రస్ రిజిస్టర్స్
- విద్యుత్ ఫ్యూజు తీగ తయారీలో వాడే పదార్థానికి ఉండాల్సిన గుణం?
  అల్ప ద్రవీభవన స్థానం
- రాజ్యాంగం ఏ అధికరణ ద్వారా పత్రిక (ప్రెస్) స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుంది?
  19
- భారత అంతరిక్ష పితామహుడని ఎవరిని అంటారు?
  విక్రమ్ సారాభాయి
- వజ్రం దేని రూపాంతరం?
  కార్బన్
- 'ట్రకోమా' వ్యాధి శరీరంలోని ఏ భాగానికి వస్తుంది?
  కళ్లు
- భూకంపాలు, అగ్ని పర్వతాలు ఎక్కువ గల పర్వత ప్రాంతం?
  ఆండీస్
- సెంట్రల్ ప్లాంటేషన్ క్రాప్ రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఎక్కడ ఉంది?
  కాసర్ గోడ్
- బక్సార్ యుద్ధ వీరుడు ఎవరు?
  హెక్టర్ మన్రో
- దక్షిణ అమెరికా ప్రధాన భాష?
  లాటిన్
- 'చంద్రయాన్ 2'ను భారతదేశం కింది ఏ దేశంతో ఉమ్మడిగా రూపొందించింది?
  రష్యా
- ప్రపంచంలో మిక్కిలి పొడవైన పర్వత శ్రేణులు?
  ఆండీస్
- భారతదేశంలో మొదటిసారిగా బంగారు నాణేలను ఎవరు ప్రవేశపెట్టారు?
  ఇండో గ్రీకులు
- ఆసియాలో అతి పొడవైన నది
  యాంగ్జై
- మాసాబాంకును తవ్వించిందెవరు?
  కానమ్ గా
- వాల్మీకి జయంతిని ప్రభుత్వం ఏ రోజున అధికారికంగా నిర్వహించింది?
  అక్టోబరు 27
- రెడ్ క్రాస్ అండ్ రెడ్ క్రిసెంట్ సొసైటీ ఎక్కడ ఉంది?
  జెనీవా
- రాచకొండను పాలించిన చివరి పద్మనాయక పాలకుడు ఎవరు?
  మూడో సింగమ నాయకుడు
- ఎన్ని సంవత్సరాలకు వెదురు పుష్పిస్తుంది.
  3
- నీటిని శుద్ధి చేయడంలో ఉపయోగించే కిరణాలేవి?
  యూవీ కిరణాలు
- బ్యాంకాక్ ఏ నది ఒడ్డున ఉంది?
  చావో ప్రయ
- ఇందిరాసాగర్ డ్యామ్ ఏ నదిపై ఉంది?
  తపతి
- పీష్వా అంటే ఎవరు?
  ప్రధానమంత్రి
- మూసీ నది వెంబడి ఉద్యానవనం అభివృద్ధి చేసేందుకు ప్రారంభించిన ప్రాజెక్టు ఏది?
  నందనవనం
- భారతదేశంలోని ఏ రాష్ట్రాన్ని 'షుగర్ బౌల్' అంటారు?
  ఉత్తర్ ప్రదేశ్
- కండరాల నొప్పులు, పక్షవాతం చికిత్స కోసం వాడేవి.
  పరారుణకిరణాలు
- భారతదేశ మొదటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎవరు?
  హెచ్ కానియా
- మానవుల జీర్ణవ్యవస్థలో ఉత్పత్తి అయ్యే ఆమ్లం ఏది?
  హైడ్రోక్లోరిక్ ఆమ్లం
- ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు ఏ ప్రకరణ (ఆర్టికల్) ప్రకారం రిట్లను జారీ చేస్తుంది?
  32
- కంప్యూటర్లలోని సమాకలన వలయాల్లో ఉపయోగించే మూలకం?
  సిలికాన్
- భారత రాజ్యాంగంపై అంతిమ వ్యాఖ్యాత ఎవరు?
  సుప్రీంకోర్టు
- 2015 జూన్లో స్వీడన్ పర్యటనలో భాగంగా స్వీడన్ పార్లమెంటు, రాజధాని స్టాక్ హోమ్ ని నోబెల్ బహుమతులు ప్రదానం చేసే మందిరాన్ని సందర్శించిన భారతీయ ప్రముఖుడిని గుర్తించండి.
  ప్రణబ్ ముఖర్జీ
- ఏ దేశ జాతీయపక్షిగా రాబిన్ అనే పక్షి ఆన్లైన్ పోల్లో ఇటీవల ఎంపికైంది?
  బ్రిటన్
- భారత జాతీయ కాంగ్రెస్ మొదటి మహిళా అధ్యక్షురాలు ఎవరు?
  అనిబిసెంట్



# ఎండిన పంటకు పరిహారం ఇవ్వాలి

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్

బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా మునుగోడు ప్రాంతానికి సాగునీరు ఇవ్వకపోతే రైతు ఉద్యమం



**ప్రజాపక్షం/మునుగోడు :** మండలంలోని కలవలపల్లి గ్రామంతో పాటు పలు గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యం కారణంగా వరి పంటలు పూర్తిగా ఎండిపోయాయని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఆరోపించారు. గురువారం నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కలవలపల్లి గ్రామానికి చేరుకున్న ఆయన రైతులతో కలిసి ఎండిపోయిన వరి పంటలను పరిశీలించారు. సాగునీటి కోసం ట్యాంకర్లతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న కష్టాలను చూసి ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీరు అందుతుందన్న ఆశతో రైతులు వరి పంటలు సాగు చేసినప్పటికీ, 7-ఆర్ కాల్వ నిర్మాణం పూర్తికాకపోవడంతో పంటలు ఎండిపోయి తీవ్ర నష్టాల్లో కూరుకుపోయామని రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. ఈప్రాంతం పచ్చని పంటలతో కళకళలాడాలంటే బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు ద్వారా నీరు అందించాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ మునుగోడుకు సమీపంలో ఉన్న బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి కిష్టాపురం చెరువులోకి నీరు తరలించి మునుగోడు, నల్లగొండ మండలాల చెరువులను నింపాలని కోరారు. ఈ ప్రాంతానికి సరైన కోలమానాలు లేకుండా నకిరేకల్, నల్లగొండ ప్రాంతాలకు నీరు మళ్లించడం అన్యాయమని విమర్శించారు. మునుగోడు ప్రాంతంలోని సుమారు 17 గ్రామాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.40వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఎండిపోతే రైతుకు కలిగే బాధ ఎంతో తాను వ్యవసాయం చేసిన వ్యక్తిగా తెలుసునని పేర్కొన్నారు. 7ఆర్ కాల్వ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి 18 గ్రామాలకు సాగునీరు అందించాలని బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు డిఇ పిచ్చయ్యతో ఫోన్‌లో మాట్లాడారు. సకాలంలో సాగునీరు అందించకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని నెల్లికంటి సత్యం హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, కలవలపల్లి మాజీ సర్పంచ్ గట్టుపల్లి నర్సిరెడ్డి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురిజా రామచంద్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బొల్లూరి నరసింహ, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు సురిగి చలపతి, మండల కార్యదర్శి చాపల శ్రీను, మండల సహాయ కార్యదర్శి మందుల పాండు, సిపిఎం మండల కార్యదర్శి మల్లేశం, ఉపసర్పంచ్ వీరమల్లు, ఎంపల్ల సాయిలు, పంతంగి లక్ష్మయ్య, గుండెబోయిన ధనమ్మ, పర్ని లచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆస్పత్రి కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు తగ్గించడం సరికాదు

## తగ్గించిన నెలల ఏరియర్స్ జీతాలు కార్మికులకు అందించాలి

మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్



**ప్రజాపక్షం/అమరచింత :** మెడికల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు తగ్గించడం సరికాదని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ పేర్కొన్నారు. గురువారం ఆత్మకూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ కార్మికుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఆత్మకూరు ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం గతంలో 30 పడకల సామర్థ్యానికి అనుగుణంగా పారిశుద్ధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్‌వైజర్ కార్మికులను విధుల్లోకి తీసుకున్నారని తెలిపారు. గత సంవత్సరం ఏప్రిల్ నెల నుండి 30 పడకల నుండి 23 పడకలకు తగ్గించిన నేపథ్యంలో ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు పారిశుద్ధ్య, భద్రత, రోగి సంరక్షణ కార్మికులకు భారీగా వేతనాలు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సంక్షేమం కోసం మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేక చొరవ, వైద్య విధాన పరిషత్ పరిధిలోని జిల్లా వైద్య సమన్వయ అధికారి డాక్టర్ చైతన్యగౌడ్, ఆసుపత్రి సూపరింటెంట్ డాక్టర్ హరినాథ్ కృషితో 30 పడకల ఆసుపత్రిగా కొనసాగించేందుకు అనుమతి వచ్చిందన్నారు. తగ్గించిన నెలల ఏరియర్స్ బడ్జెట్ వెంటనే విడుదల చేసి కార్మికులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఆస్పత్రి బ్రాంచ్ యూనియన అధ్యక్షులు ఎండి.సత్తార్, నాయకులు శ్రీకాంత్, ఎ.బాలకిష్టమ్మ, మైనోద్దీన్, బాలరాజ్, ఇ,బాలకిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ జోక్యంతో సింగరేణిని దివాలా తీయించారు

## సమస్యల పరిష్కారానికి ఆందోళనలకు సిద్ధంకండి

కార్మికవర్గానికి రాజ్‌కుమార్ పిలుపు

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** సింగరేణిని ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆదుకుంటే తెలంగాణ ఏర్పాటు తర్వాత ఏర్పడిన ప్రభుత్వాలు విపరీత రాజకీయ జోక్యంతో రూ.51 వేల కోట్ల బకాయిలను పదమూడు సంవత్సరాలు దాటిన చెల్లించకుండా సంస్థను దివాలా తీయించారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందినందున గుర్తింపు సంఘం ఎఐటియుసి ఆందోళన కార్యక్రమాలకు పిలుపు నిచ్చిందన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలు గడిచినా యాజమాన్యం కొన్ని సమస్యలను స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించి ఇంతవరకు వాటిపై అమలు కోసం యాజమాన్యం సర్క్యులర్లు జారీ చేయలేదన్నారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని కనుక ఎఐటియుసి ఈనెల 17 నుండి 30 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలకు పిలుపు నివ్వడం జరిగిందని రాజ్‌కుమార్ తెలిపారు. సమావేశంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, వై.వి.రావు, కేంద్ర కార్యదర్శులు కవ్వంపల్లి స్వామి, కందుకూరి రాజారత్నం, జూపాక రాంచందర్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, ఎఐటియుసి నగర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.ఎ.గౌస్, ఆకునూరి శంకరయ్య, దాసరి శ్రీనివాస్, మిట్టపల్లి మొగిళి, మల్లయ్య, ఎవిఎస్. ప్రకాశ్, వినయ్‌కుమార్, దేవేందర్‌రెడ్డి, ఏ.రవికుమార్, కనకరాజు, చంద్రయ్య, మహేందర్‌రావు, రాజయ్య, జగన్, రమేశ్ కుమార్ పాల్గొన్నారు.




# కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలి



## బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు

**ప్రజాపక్షం/వరంగల్ :** కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ హామీలను అమలు చేయనందుకు నిరసనగా, బడ్జెట్‌లో బిసిలకు రూ.55వేల కోట్లు కేటాయింపులు చేయాలని కోరుతూ వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం బిసిలకు బడ్జెట్ లో రూ.20వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి, ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత గడిచిన రెండు సంవత్సరాలలో రూ.20 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని, అందులో కేవలం రూ.6వేల కోట్లు మాత్రమే బిసిలకు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. అది కూడా ఇందిరమ్మ చీరలకు రూ. 2500 కోట్లు ఖర్చు పెట్టడం జరిగిందన్నారు. గడచిన రెండు బడ్జెట్‌లో తక్కువ కేటాయింపులు చేసినందుకుగాను ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్ కలుపుకొని మొత్తం రూ.55 వేల కోట్ల రూపాయలు బిసిల కోసం కేటాయింపులు చేయాలన్నారు. కామారెడ్డి బిసి డిక్లరేషన్ లో పేర్కొన్న విధంగా వివిధ సామాజిక తరగతులకు ఆర్థిక తోడ్పాటు కోసం ఈ నిధులను ఖర్చు చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. కాని ఇప్పటి వరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిసిలకు 42 శాతం స్థానిక సంస్థల ఎన్నికల్లో విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పి ఈ రిజర్వేషన్లను సాధించడానికి కేంద్ర ప్రభుత్వం మీద ఎలాంటి ఒత్తిడి తేలేదన్నారు. ఇది ఒక రకంగా కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం బిసిలను వంచించడమేనన్నారు. ఇప్పటికైనా బిసిలు ఎడల చిత్తశుద్ధి ఉంటే కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా ప్రతి అంశాన్ని రాబోయే రెండున్నర సంవత్సరాలలో పకడ్బందీగా అమలు చేయాలని వెంకట్రాములు కోరారు. కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, సహాయ కార్యదర్శి చీకటి ప్రకాష్, నాయకులు ఓదెల భద్రయ్య ఓదెల రవి అడ్డగట్ల యువరాజ్, రామగిరి రామస్వామి, గాజుల సుమలత, శారద, కవిత, సలేహా, సుల్తానా, రజిత, రేష్మ, అమరున్నిసాబేగం తదితరులు పాల్గొన్నారు

# పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి : ఎఐఎస్ఎఫ్

**ప్రజాపక్షం/వరంగల్:** పదవ తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, పరీక్ష సమయంలో విద్యార్థులకు హాల్ టికెట్స్ ఇవ్వని స్కూళ్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ వరంగల్ జిల్లా కార్యదర్శి శరత్ డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ పట్టణంలోని శివనగర్ తమ్మెర భవన్‌లోని ఎఐఎస్ఎఫ్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 14 నుంచి ఏప్రిల్ 16 తేదీ వరకు జరుగుతున్న పదవ తరగతి పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదవ తరగతి పరీక్షలు వేల మంది విద్యార్థులు హాజరవుతున్నారని, పరీక్ష కేంద్రంలో మాస్ కాపింగ్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రాల దగ్గర సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్షసమయంలో విద్యార్థులకు హాల్ టికెట్లు ఇవ్వని ప్రైవేట్ స్కూల్ పై యజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఉన్న పరీక్ష కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, అలాగే వేసవికాలం కావడంతో విద్యార్థులకు తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లు ఉంచాలని, విద్యార్థులు 10 నిమిషాల లేటుగా వచ్చిన అనుమతించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి భరత్, శ్రేయస్, రవితేజ, చందు తదితరులు పాల్గొన్నారు.





## తప్పులులేని ఓటర్ లిస్ట్ తయారీకి సహకరించాలి

**ప్రజాపక్షం/నవాబ్‌పేట్:** ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడటం, అర్హులైన వారి పేర్లు ఆ జాబితాలో ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ఉద్దేశమని నవాబ్ పేట్ తహసీల్దార్ బుచ్చయ్య అన్నారు.గురువారం నవాబ్ పేట్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియకు సంబంధించిన అంశాలపై చర్చించారు.అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చేయడం, మరణించిన వారి, డూప్లికేట్ పేర్లు తొలగించడం, చిరునామా మారిన ఓటర్ల వివరాలు సరి చేయడం,కొత్తగా అర్హత పొందిన యువ ఓటర్లను ఓటర్ల జాబితాలో చేర్చడం ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని తహసీల్దార్ చెప్పారు. ఇప్పటి వరకు నవాబ్ పేట్ మండలంలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియ 60 నుండి 70శాతం పూర్తి అయిందని గడువులోగా మిగిలిన మ్యాపింగ్ పూర్తి చేస్తామని ఈ ప్రక్రియ ఏప్రిల్‌లో ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఆయా పార్టీల నాయకులు బీఎల్ఏలను నియమించి ఓటర్ లిస్టులో తప్పుగా ఉన్నదానిలో ఫామ్ 8 రాసి బీఎల్ఓలకు లేదా తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాలని అన్నారు. ఈ ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పులు లేని ఓటర్ లిస్ట్ తయారు చేయడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవీన్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షులు చంద్రకాంత్, మాజీ జిల్లా కార్యదర్శి సార జగన్, గొల్లగూడ ఉప సర్పంచ్ మహేందర్, వార్డు సభ్యులు మల్లేశం,తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి : మౌనిక శివవీర ప్రసాద్

**ప్రజాపక్షం/శామీర్‌పేట:** విద్యార్థులు పది పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఉత్తమ ప్రతిభ కనబరచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని 12వ వార్డు కౌన్సిలర్ మాడబోయిన మౌనిక శివవీర ప్రసాద్ అన్నారు. గురువారం మూడుచింతలపల్లి మున్సిపాలిటి పొన్నాల్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల కిట్టులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పది తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి రాష్ట్రస్థాయిలో ర్యాంకులను సాధించాలని సూచించారు. అనంతరం పరీక్ష ప్యాడ్‌లు, జామెట్రి బాక్సులు, పెన్నులు, స్కేల్స్, వాటర్ బాటిల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ కొలాసు రాజు, పాఠశాల చైర్మన్ అజయ్‌లక్ష్మి, మున్సిపాలిటి నాయకులు సతీష్ రెడ్డి, బిఆర్ఎస్ అధ్యక్షుడు పిట్టల రమేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## జోనల్ కమిషనర్‌ను కలిసిన కూన శ్రీశైలం గౌడ్

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** నూతనంగా నియమితులైన కుత్బుల్లాపూర్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్ ను జోనల్ కమిషనర్ ఆఫీసులో కుత్బుల్లాపూర్ జోన్ లోని 24 డివిజన్లలో నెలకొన్నటువంటి సమస్యలు మరియు నూతనంగా చేపట్టవలసిన పనుల గురించి కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు, కాంగ్రెస్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ కమిషనర్ కలిసి పలు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ స్పందిస్తూ సానుకూలంగా స్పందించి సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ జోన్‌లో చాలా సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నటువంటి పనులు, నూతనంగా చేపట్టవలసిన పనుల గురించి కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరితగతిన అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేస్తామని తెలిపినట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు, మాజీ కార్పొరేటర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, ఐఎన్టియుసి నాయకులు, ఎన్ఎస్‌యుఐ నాయకులు, వివిధ కాలనీల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, మున్సిపల్ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు రేషన్ కిట్ల పంపిణీ

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్ తూంకుంట పరిధి లోని మున్సిపల్ సిబ్బందికి, పేద ప్రజలకు ఆక్సా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహబూబ్ జానీ ఆధ్వర్యంలో రంజాన్ పండగ సందర్భంగా 150 మందికి రేషన్ కిట్లు, బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మోటివేషనల్ స్పీకర్ అబ్దుల్ రెహమాన్ విచ్చేశారు. గౌరవ అధ్యక్షులుగా తూంకుంట మాజీ సర్పంచ్ ఎద్దు నాగేష్, మాజీ ఎంపిపి చంద్రశేఖర్ యాదవ్, గుంతల కృష్ణారెడ్డి, ఈశ్వర్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు, తదితరులు విచ్చేసి మున్సిపల్ కార్మికులకు, పేద ప్రజలకు రేషన్ కిట్లను, నూతన దుస్తులను, అందజేశారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాలను చేపట్టాలని పలువురు నాయకులు సూచించారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక దోహదం

స్పీకర్ ప్రసాద్‌కుమార్





**ప్రజాపక్షం/వికారాబాద్ :** ప్రజల సమస్యల పరిష్కారానికి 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక' ఎంతగానో దోహదపడుతుందని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. వికారాబాద్ పట్టణ కేంద్రంలో నర్సింగ్ ఫంక్షన్ హాల్ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికపై సర్పంచులు , మున్సిపల్ కౌన్సిలర్లకు చైర్మన్‌కు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన స్పీకర్ మాట్లాడుతూ రాష్ట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డైనమిక్ నాయకత్వంలో రాష్టంలో ప్రజాపాలన జరుగుతుందన్నారు. కింది స్థాయి నుండి వచ్చిన ప్రజాప్రతినిధి సామాజిక అంశాలు, పేదలకు అందించాల్సిన సేవలపై ఎక్కువ అవగాహన ఉంటుందని అన్నారు. కేంద్ర రాష్ట ప్రభుత్వాలు అమలు చేసే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే బాధ్యత స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల పై ఉంటుందని ఇక్కడ ఎన్నికైన సర్పంచ్‌లు, చైర్మన్లు , కౌన్సిలర్లలో ఎక్కువమంది కొత్తవారే కాబట్టి ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మీ నిధులు, చేయవల్సిన పనులపై మీకు సంపూర్ణ అవగాహన కలుగుతుందన్నారు. ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలను అందించగలుగుతరని అన్నారు. జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ ,ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం. సహకారం అవసరమన్నరు. ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేవిధంగా కృషి చేస్తామన్నారు. గ్రామ సభల్లో ప్రజా సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువస్తే సమస్యలు పరిష్కరించబడుతాయని కలెక్టర్ తెలిపారు.

తాండూర్ ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజాప్రతినిధులుగా ప్రజలకు సేవచేయడం అదృష్టంగా భావించాలన్నారు. 99రోజులుగా నిర్వమించే ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో సమస్యలను పరిష్కరించే దిశగా అధికారులు జవాబుదారీతనంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పి స్నేహమేహ్రా , అదనపు కలెక్టర్ ఉమావాంకర ప్రసాద్, ట్రైనింగ్ కలెక్టర్ హర్ష్ చైదరి , జెడ్పి సిఇఓ సుదీర్, డిఆర్‌ఒ మంగిలాల్, ఆర్‌డిఓ వాసుచంద్ర, గ్రంథాలయ చైర్మన్ రాజేష్‌రెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్య, నీరజ,రజిత , జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం**

వికారాబాద్ మున్సిపల్‌లోని కొత్రెపల్లి లో రూ.3.36 కోట్లతో నిర్మించే వికారాబాద్ జిల్లా ఎలక్ట్రికల్ స్టార్స్‌కు శుంకుస్థాపన చేశారు. వికారాబాద్ మండలపరిధిలోని రూ.2.98కోట్లతో నిర్మించే 33/11కేవి సబ్‌స్టేసన్‌కు స్థానిక సర్పంచ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ధారుర్ మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లకు సిసిరోడ్డు సౌండ్ డ్రైయిన్ నిర్మాణానికి రూ.40లక్షలతో శంకుస్థాపన చేశారు.

అనంత రం ధారుర్ మండలనికి సంబంధించిన 37కల్యాణలక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నుండి సంక్షేమం కోసం కృషి చేస్తున్నాం అన్నారు. పథకాలు



అందరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వికారాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం తన వంతు కృషి చేయడం జరుగుతుందన్నారు.

## అర్హులైన వారికి ప్రజా సంక్షేమ పథకాలు

నూతన ప్రజా ప్రతినిధుల అవగాహనా సదస్సులో జిల్లా కలెక్టర్ మనుచౌదరి






**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రజా సంక్షేమ పథకాలన్ని అర్హులైన వారందరికి దక్కేలా అధికారుల సమన్వయంతో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులు, సర్పంచులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు ఒక రోజు అవగాహనా సదస్సును కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు.

ఈ సదస్సును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులందరూ అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళితేనే జిల్లా ప్రగతి, రాష్ట్ర ప్రగతి సుసాధ్యమవుతుందన్నారు. 99 రోజుల పాటు పది అంశాలతో నిర్వహిస్తున్న కార్యక్రమాలన్ని ప్రణాళిక మేరకు నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ 2న గ్రామ సభలు, వార్డు సభలు నిర్వహించి ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. విద్యా, వైద్య, వ్యవసాయం, మహిళ, యువత సంక్షేమం, పర్యావరణం, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై జిల్లాలోని వివిధ ప్రభుత్వ విభాగాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పోలీస్, రవాణ, ట్రాఫిక్, ఆర్టీసీ , డ్రగ్స్ నియంత్రణ, రహదారి భద్రత లాంటి అన్ని అంశాలు ఈ కార్యక్రమాల్లో ఉన్నాయన్నారు.ఈ సదస్సులో తెలంగాణా సాంస్కృతిక సారధి కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రత్యేకంగా రూపొందించిన పాటలతో అవగాహన కల్పించిన తీరు పలువురిని ఆకట్టుకొన్నాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, ఫైజల్ అహ్మద్, ఇన్‌చార్జి డిఆర్‌ఓ చంద్రావతి, ట్రాఫిక్ ఎసిపి వెంకటరెడ్డి, జిల్లా మార్కెటింగ్ చైర్మన్ నర్సింహా యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, ఆర్టీఏ కమిషన్ సభ్యులు జైపాల్‌రెడ్డిలతో పాటు పలువురు జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల సత్వర పరిష్కార లక్ష్యంతో కృషి

జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ విజయ రహత్కర్





**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** జాతీయ మహిళా కమిషన్, ఆయా ప్రాంతాల ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేసిన నాడే మహిళా సమస్యలకు సత్వర న్యా యం దక్కుతుందని జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ విజయ రహత్కర్ అన్నారు. గురువారం మల్కాజిగిరి కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మహిళా జన్ సున్వాయ్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తమ వద్దకు ప్రతి రోజు దేశంలోని నలు మూలల నుండి మహిళా సంబంధమైన ఫిర్యాదులు వస్తుంటాయని, తమ వద్దకు బాధితులు చేరుకోవటం వ్యయ ప్రయాసలతో కూడుకొన్నదన్నారు. దీని కోసమే జాతీయ మహిళా కమిషన్ నేరుగా ప్రజల చెంతకు చేరి సమస్యలను సత్వరంగా పరిష్కరించాలన్న లక్ష్యంతోనే మహిళ జన్ సున్వాయ్ కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమం ప్రారంభించి దేశంలో ఇప్పటి వరకు నాటి జన సున్వాయ్ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఒకేసారి దేశ వ్యాప్తంగా 500 జిల్లాల్లో ఈ కార్యక్రమం చేపట్టి 15 నుండి 20 వేల మహిళా సమస్యలను పరిష్కరించాలని లక్ష్యంగా పెట్టుకొన్నామన్నారు. గురువారం 30 మహిళా కేసులకు సంబంధించి విచారణ జరిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర డిజిపి శివధరరెడ్డి, అడిషనల్ డిజిపి చారుసిన్హా, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మనుచౌదరి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఫ్యూచర్ సిటి పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, జిల్లా అదనపు కలెక్టర్ ఫైజల్ అహ్మద్, ఆర్డీవో శ్యాంప్రకాష్, మల్కాజిగిరి ఆర్డీవో సీతారం, డబ్ల్యుఓ శారద, తిదితర అధికారులు పాల్గొన్నారు.

## పేదింటి కల నెరవేరింది

కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్



**ప్రజాపక్షం/నవాబుపేట్:**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్లను ఇచ్చిన మాట ప్రకారం పేదలకు సొంత ఇంటికల నెరవేరిందని చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పామేనా భీమ్ భరత్ అన్నారు. గురువారం నవాబ్ పేట్ మండల పరిధిలో తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభు త్వం ఆనాడైనా ఏనాడైనా పేదల పక్షాన ఉంటుందని పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని మేనిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను మంజూరు చేస్తూ పేదల పక్షాన దేవునిలా నిలబడి పేదలకోసం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నవాబ్ పేట్ మండలం అధ్యక్షులు మేడిపల్లి వెంకటయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు ఘనపురం ప్రసాద్, యాదయ్య, మొయినాబాద్ మండలం అధ్యక్షులు మానయ్య, కరణం రఘు, తిమ్మారెడ్డి, పల్లి సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ మల్లేష్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సమాన హక్కులు కల్పిస్తే దేశం వేగంగా అభివృద్ధి

**ప్రజాపక్షం /వికారాబాద్ రూరల్ :** వికారాబాద్ మండల పరిధిలోని మదన్‌పల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నాత పాఠశాల లో అంతర్జాతీయమహిళ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మహిళ కుటంబానికి మాత్రామే కాదు ,సమాజానికి కూడా ఎంతో ముఖ్యమైన వారని ,మహిళలకు సమానహక్కులు,విద్యా,ఆవాకశాలు కల్పిస్తే దేశం అభివృద్ధి చెందుతుందని ,ప్రధానోపాధ్యాయులు యాదయ్య అన్నారు. మహిళలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాద్యత మహిళలపై వివక్ష లేకుండావారికి సమాన అవకాశాలు ఇవ్వాలని ఇప్పుడు మహిళలు ,విద్యా,వైద్యం శాస్త్రం ,క్రీడలు రాజకీయాలు వంటి అనేక రంగాలలో సాధికారత సాదించేలా కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు ,అంగన్వాడీటీచర్లను .ఆశవర్కర్స్‌ను ,భోదనేతర మహిళ సిబ్బందిని సన్మానించారు.

## సమగ్ర భూ సర్వే ద్వారా రైతులకు పరిష్కారం

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** భూ భారతి చట్టం కింద చేపడుతున్న సమగ్ర భూ సర్వే ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. గురవారం పెద్దేముల్ మండల పరిధి గిర్మాపూర్ గ్రామంలో నిర్వహించిన భూ భారతి సమగ్ర భూ సర్వే కార్యక్రమంలో ఎంఎల్‌ఏ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మనోహర్‌రెడ్డి సర్వే చపడుతున్న రైతు రాంరెడ్డి పొలాన్ని సందర్శించిన రైతులతో పాటు సర్వేయర్లతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో జరుగుతున్న పక్రియను స్వయంగా పరిశీలించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌ఏ మనోహర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామి ప్రకారం ధరణి స్థానంలో భూ భారతి చట్టాన్ని తీసుకరావడం జరిగిందన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో రెవెన్యూవ్యవస్థ గందరగోళానికి గురైందన్నారు. అధికారులు గ్రామాలకే వచ్చి సమగ్ర సర్వే నిర్వహిస్తున్నారని తెలిపారు. పట్టా సర్వేనంబర్ స్థానంలో భూ దార్ నంబర్ ప్రవేశపట్టబడుతుందన్నారు. భూ సర్వేలో భాగంగా పట్టా భూమి, గ్రామ కంఠం, ప్రభుత్వ భూములను స్పష్టంగా వేరు చేసి గుర్తించడం జరుగుతుందన్నారు. సర్వే సమయంలో ఎదురవుతున్న సమస్యలను రెవెన్యూ మంత్రి దృష్టికి తీసుకవెళ్ళి పరిష్కాస్తారమని హామి ఇచ్చారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు పారదర్శకమైన సుస్థీరమైన భూ రికార్డు వ్యవస్థ అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివరానాయక్, మార్కెట్ కమిటి చైర్మన్ అంజయ్య, వైస్ చైర్మన్ నారాయణరెడ్డి, నాయకులు, రెవెన్యూ అధికారులు పాల్గోన్నారు.





బస్సు సర్వీసు పునరుద్ధరణపై

## మంత్రి పొన్నంకు సర్పంచ్‌ల వినతి

**ప్రజాపక్షం/నవాబుపేట్:** ఆర్టీసీ బస్ సౌకర్యంలేక విద్యార్థులు పై చదువులకు దూరమౌతున్నారని పూలపల్లి, నారేగూడ, గంగ్యాడ గ్రామాల నాయకులు చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పామేనా భీమ్ భరత్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, వికారాబాద్ జిల్లా కేంద్రం నుండి సిద్దులూరు మీదుగా నారేగూడ, గంగ్యాడ వరకు ఆర్టీసీ బస్ సర్వీసు సేవలందించిందన్నారు. ఈ సర్వీస్ ద్వారా ఈ ప్రాంతానికి చెందిన ప్రయాణికులతో పాటుగా విద్యార్థులకు, వ్యాపారస్తులకు ఎంతో మేలు జరిగిందని గుర్తు చేశారు. కరోనా తర్వాత గంగ్యాడ బస్సు సర్వీసు రద్దు కావడంతో గ్రామాలకు వికారాబాద్ జిల్లా కేంద్రానికి చేరేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సానుకూలంగా స్పందిస్తూ ప్రజల, విద్యార్థుల కోరిక మేరకు తప్పకుండా ఇంతకుముందు లాగే సర్వీసులు కొనసాగేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జి పామేనా భీమ్ భరత్, టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరీ సతీష్, మోహినబాద్ మండల అధ్యక్షులు మానేయ్య, చేవెళ్ల అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ నాయకులు భానూరి ఉపేందర్ రెడ్డి, పులపల్లి గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మి మహేందర్ రెడ్డి, నారెగూడ సర్పంచ్ ఎలవర్తి దీపికా దశరథ్, ఉప సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

**ప్రజాపక్షం/కాప్రా :** మహిళలు సైతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కే దక్కుతుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా హెచ్‌బి కాలనీ ఫేజ్2 కమ్యూనిటి హాల్‌లో బిఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు పంజరి ప్రవీణ్ కరిపే ఆధ్వర్యంలో మహిళలకు చీరల పంపిణీ చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గత ప్రభుత్వ హయాంలో మహిళల అభివృద్ధి కోసం కళ్యాణలక్ష్మి , ఆరోగ్య మహిళ, ఒంటరి మహిళ, మాతా శిశు పథకాల వంటి అనేక పథకాలను అమలు చేసారన్నారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు ప్రభుదాస్, శ్రీనివాసరెడ్డి, అంజయ్య, మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా పది విద్యార్థులకు వీడ్కోలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** శామీర్‌పేట డివిజన్ పరిదిలోని జడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఉపాధ్యాయులు విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. గురువారం చేపట్టిన ఈ కార్యక్రమానికి హెచ్‌ఎం వేణు అధ్యక్షత వహించారు. పది పరీక్షలు సమీపిస్తున్నందున ఉపాధ్యాయులు విద్యార్థులకు పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు పాఠశాలను విడిచి వెళ్తున్నందుకు భావోద్వేగానికి గురయ్యారు. ఒకరికొకరు కలుసుకుని తాము పాఠశాలలో చేసిన అల్లరి చిల్లరి పనులను గుర్తుచేసుకున్నారు. వీరందరికి పాఠశాల హెచ్‌ఎం, ఇతర ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు. పది పరీక్షల్లో రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. వేణు, ఉపాధ్యాయులు లలిత, తిరుపతమ్మ, ప్రసన్న, ధనలక్ష్మి , సుశీల, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేత

**ప్రజాపక్షం/దోమ:** పరిగి నియోజకవర్గంలోని దోమ మండల పరిధిలోని దాదాపూర్ ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు దాదాపూర్ గ్రామానికి చెందిన బస్సగౌడ్ పరీక్షా ప్యాడ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో మొదటి స్థానం వచ్చిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.5000, రెండవ స్థానం వచ్చిన వారికి రూ.2500 ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి గ్రామానికి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అమర్నాథ్ , తదితరులు పాల్గొన్నారు.

## జెపి దర్గా అభివృద్ధికి నిధులు

### మంత్రి అజారుద్దీన్‌కు ఎమ్మెల్యే వినతి



**ప్రజాపక్షం/కొత్తూరు:** జహంగీర్ ఫీర్ దర్గా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్‌కు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. గురువారం హైద్రాబాద్‌లోని వారి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ జహంగీర్ ఫీర్ దర్గాలో హెచ్‌ఎండిఏ నిధుల నుండి మంజూరైన రూ12కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అదనంగా మరో రూ.8కోట్ల నిధులు కావాలని కోరినట్లు తెలిపారు. దర్గాకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందుకు మంత్రి అజారుద్దీన్ స్పందిస్తూ జెపి దర్గా అభివృద్ధికి పూర్తి స్థాయిలో నిధులు ఇచ్చేందుకు కృషి చేస్తామని వివరించారు.

## ప్రజాసేవతోనే పేరు ప్రతిష్టలు

### మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ శ్రీదేవి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ప్రజా సేవతోనే పేరు ప్రతిష్టలు లభిస్తాయని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ టికె శ్రీదేవి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి వచ్చిన టికె శ్రీదేవిని షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కమిషనర్ సునీతారెడ్డితోపాటు కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రాజునాయక్, నడికూడ శ్రావణి, కళ్యాణ్‌కార్ దిలీప్, బచ్చలి నరేష్, జమాల్‌పూర్ సంతోషిబాయ్ చందులాల్, నందారం అశోక్ పాల్గొన్నారు.

## నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/శంకర్‌పల్లి;** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 9 రోజుల ప్రజా పాల ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం శంకర్ పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెగాహెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి డాక్టర్ రేవతిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, గైనాలజిస్ట్, డెంటల్ తదితర ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారని ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేడు 22వ విడత పిఎం కిసాన్

**ప్రజాపక్షం/యాచారం :** పిఎం కిసాన్ 22 విడత ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రధానమంత్రి చేతుల మీదుగా శుక్రవారం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి అర్ రవినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యక్షప్రసార కార్యక్రమంలో ప్రజాప్రతినిధులందరు సకాలంలో పాల్గొనాలని కోరారు. ఈ విడత డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. యాచారం , మేడిపల్లి, చౌదర్ పల్లి గ్రామాల్లోని రైతు వేదికలో ప్రత్యక్షప్రసారం జరుగుతుందని తెలిపారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి


**ప్రజాపక్షం/యాచారం :** ప్రతిఒక్కరు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని యాచారం సిఐ నందీశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం యాచారం పోలిస్‌స్టేషన్‌లో స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసంధర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న పేదలు తమ ఇంటి చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొవాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే ఈగలు, దోమలు ముసిరే అవకాశం ఉండదని తెలిపారు. అంటు వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మధు, సత్యనారాయణ, ప్రియాంక పాల్గొన్నారు.

## ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బోసుపల్లి వీరేష్‌కుమార్

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఉద్యమ కారుల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా బోసుపల్లి వీరేష్ కుమార్ నియమితులయ్యారు. నియామక పత్రాన్ని ఉద్యమకారుల రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంతం యాదిరెడ్డి గురువారం వీరేష్‌కుమార్‌కు అందచేశారు. ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరి గూడ గ్రామనికి చెందిన బోసుపల్లి వీరేష్ కుమార్ విలేకరులతో మాట్లాడుతూ ఉద్యమ కారులు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా సమస్యలపై ఉద్యమిస్తానని హామి ఇచ్చారు. సహకరించిన రాష్ట్ర కమిటీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## అభివృద్ధి పేరిట రైతులకు అన్యాయం

### మాజీ ఎంపి బూర నర్సయ్య గౌడ్



**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** పేద ప్రజల భూములను ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకొని అభివృద్ధి పేరిట అన్యాయం చేస్తుందని మాజీ ఎంపి నర్సయ్య గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రూట్ మార్కెట్, ఇంటిగ్రేడ్ సబ్ రిజిస్టర్ ఆఫీస్ నిర్మాణం కోసం ఆదిభట్ల సర్కిల్ తొర్రూరు డివిజన్ పరిధిలోని కోహెడ రెవెన్యూ సర్వే నెంబర్ 167/1 లో భూములు కోల్పోయిన రైతులకు మద్దతుగా బిజెపి అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో గురువారం బిజెపి నాయకులు, రైతులతో కలిసి భూములను పరిశీలించారు. ఎన్నో ఏండ్లుగా ఎస్సీ, బీసీ రైతులు పంట సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తుంటే ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకోవడం సిగ్గుచేటన్నారు. భూములపై ఆధారపడి జీవిస్తున్న రైతుల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రైతులకు తక్షణమే తగిన నష్టపరిహారం చెల్లించి బాధిత రైతులకు 500 గజాల ఇంటి స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బచ్చు గళ్ళ రమేష్, కొత్త రామ్ రెడ్డి, కొండ్రు పురుషోత్తం, కందాల బల్దేవ్ రెడ్డి, కరాడి శ్రీలత అనిల్, బిక్షపతి, యూసుఫ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## మొల్ల మాంబ జయంతి ఉత్సవాలు

**ప్రజాపక్షం/యాచారం :** నియోజకవర్గంలోని అన్నిమండలాల్లో ఈ నెల 13న మొల్లమాంబ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని నియోజకవర్గం కుమ్మరి సంఘం అధ్యక్షులు కొండాపురం శ్రావణ్‌కుమార్ కొరారు. గురువారం మండల కేంద్రంలో ఎర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మహిళా కవయిత్రి ఆతుకూరి మల్లమాంబ జయంతిని ఘనంగా నిర్వహించడం కోసం సీనియర్ నాయకులు సన్నద్ధం కావాలని తెలిపారు. కార్యక్రమంలో యువత పాల్గొనాలని తెలిపారు..

# త్వరితగతిన అభివృద్ధి పనులు పూర్తి

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల యాక్షన్ ప్లాన్ – ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కమిషనర్ టి. వినయ్ క్రిష్ణ రెడ్డి ఉప్పల్– హబ్సిగూడ– రామంతాపూర్ ప్రాంతాల్లో విస్తృత క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధి, పచ్చదనం పెంపు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల మెరుగుదలపై జరుగుతున్న పనులను సమీక్షించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. హబ్సిగూడ సర్కిల్‌లో కమిషనర్ ఫీల్డ్ సందర్శన నిర్వహించి సెంట్రల్ మీడియన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు పచ్చదనం అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఉప్పల్‌లోని పిస్తా హౌస్ సమీపంలో ఫుట్‌పాత్, రోడ్డు మార్జిన్‌లను పరిశీలించిన కమిషనర్ ఖాళీ ప్రదేశాలను చెత్త పారబోయడానికి, బహిరంగ మూత్ర విసర్జనకు ఉపయోగిస్తున్నట్లు గమనించారు. దీనిని నివారించేందుకు పూల మొక్కల నాటకం చేపట్టి ఆ ప్రాంతాన్ని అందంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. రామంతాపూర్ చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ పరిశీలించారు. చెరువు పరిసరాల్లో మొక్కల నాటకం ప్రారంభమైందని, చెరువు అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. చెరువు అందాన్ని పెంచేందుకు ఫౌంటెన్లు ఏర్పాటు చేయడం, సందర్శకుల కోసం ప్రత్యేక పార్కింగ్ సదుపాయం కల్పించడం వంటి అంశాలపై చర్చించారు. చెరువు గట్టు వద్ద సుమారు 350 మీటర్ల రన్నింగ్ ట్రాక్ అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు వెల్లడించారు. మిగిలిన గెజిబో నిర్మాణం, సైనేజీలు, ప్రవేశ గేట్ల ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. రామంతాపూర్‌లోని శ్రీనివాసపురం ప్రాంతంలో వర్షాకాలంలో నీరు నిల్వ సమస్యను పరిశీలించిన కమిషనర్ బాక్స్ డ్రైన్‌ల నిర్మాణం చేపట్టి వర్షపు నీరు సులభంగా బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## త్రిబుల్ ఐటి జంక్షన్ వద్ద.. హెచ్ సిటీ ఫ్లైఓవర్ పనులు పరిశీలించిన కమిషనర్ సృజన



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ త్రిబుల్ ఐటి జంక్షన్ వద్ద జరుగుతున్న హెచ్ సిటీ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం పనుల పురోగతి, నిర్మాణ ప్రణాళికపై సమీక్ష నిర్వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. డిఎల్‌ఎఫ్ నుంచి బిహెచ్‌ఈఎల్ వరకు ఫ్లైఓవర్ పనులను మార్చి 2027 నాటికి పూర్తి చేయాలని, అలాగే ఐఎస్‌బి నుంచి డిఎల్‌ఎఫ్, ఐఎస్‌బి నుంచి గచ్చిబౌలి వరకు ఫ్లైఓవర్ పనులను మే 2027 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. అదనంగా గచ్చిబౌలి– లింగంపల్లి అండర్‌పాస్ పనులను నవంబర్ 2027 లోపు పూర్తి చేయాలని సూచించారు. పనులను సమాంతరంగా నిర్వహించి సమయాన్ని ఆదా చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులు పూర్తయ్యిన వెంటనే కూల్చివేత వ్యర్థాలు, తవ్విన మట్టిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. ఫ్లైఓవర్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేకమైన థీమ్‌లతో పెయింటింగ్స్ చేయాలని సూచించారు.

## ఆస్తి పన్ను బకాయిలు చెల్లించండి

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న గృహ యజమానులు ఆస్తి పన్ను బకాయిలను తక్షణమే చెల్లించి వడ్డీపై 90 శాతం రాయితీ పొందాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అన్నారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఓటిఎస్ (వన్ టైమ్ సెటిల్‌మెంట్) పథకం కింద ఈ నెల 31వ తేదీలోగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించే వారికి వడ్డీపై 90 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆస్తి పన్ను బకాయిలు కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయని కమిషనర్ స్పష్టం చేశారు. ఇందు కోసం www.ghmc.gov.in పోర్టల్, మై జిహెచ్‌ఎంసి యాప్, మీ సేవ కేంద్రాలు మరియు సిటిజన్ సర్వీస్ సెంటర్ల ద్వారా చెల్లింపులు చేయవచ్చని తెలిపారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సకాలంలో పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కర్ణన్ కోరారు.

# బైరామల్‌గూడ ఫ్లైఓవర్ కింద స్పోర్ట్స్ అరేనా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నగరంలో క్రీడా మైదానాల కొరతను దృష్టిలో ఉంచుకుని యువతలో క్రీడా అభిరుచిని పెంపొందించేందుకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసి) కీలక చర్యలు చేపట్టింది. ఎల్.బి.నగర్ జోన్, సర్కిల్–13 పరిధిలో సాగర్ రింగ్ రోడ్ వద్ద బైరామల్‌గూడ ఫ్లైఓవర్ కింద స్పోర్ట్స్ అరేనా అభివృద్ధి పనులు చివరి దశకు చేరుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా అభివృద్ధి దృక్పథానికి అనుగుణంగా నగరంలో క్రీడా మౌలిక వసతులను విస్తరించడం, యువతకు శిక్షణ అవకాశాలు కల్పించడం లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్ అమలు చేస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా నాలుగు పనులు మంజూరు చేయగా, అందులో మూడు ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రస్తుతం టాయిలెట్స్, ఛేంజింగ్ రూమ్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.
**ఫేజ్–1లో అభివృద్ధి చేసిన క్రీడా వేదికలు..** బాక్స్ క్రికెట్ కోర్టు, బాస్కెట్‌బాల్ కోర్టు, బ్యాడ్మింటన్, పికెల్ బాల్ కోర్టు, వాలీబాల్ కోర్టు, స్కేటింగ్ రింగ్.
**ఫేజ్–2లో ప్రణాళికలో ఉన్నవి..** ఫుట్‌బాల్ కోర్టు, 10 మీటర్ల రేంజ్ రైఫిల్ షూటింగ్ (6 లేన్స్)




ఈ స్పోర్ట్స్ అరేనా ద్వారా నగరంలోని పిల్లలు, యువతకు ఆధునిక క్రీడా వసతులు అందుబాటులోకి వచ్చి ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే అవకాశం కలుగుతుందని అధికారులు తెలిపారు.

# ప్రగతి ప్రణాళికలో ప్రజాప్రతినిధులే కీలకం

### కలెక్టర్ నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని 99 రోజులపాటు దిగ్విజయం చేసేందుకు ప్రజాప్రతినిధులు కీలక పాత్ర పోషించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అన్నారు. గురువారం శంషాబాద్ మండలం కాచారం గ్రామంలోని వర్ధమాన ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై సర్పంచ్‌లకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ నారాయణ రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు గ్రామాభివృద్ధికి సమయాన్ని వెచ్చించి అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ప్రజా సంక్షేమ పథకాలను అర్హులైన వారందరికీ అమలు చేసేలా ఎక్కడ ఎలాంటి వైరుధ్యాలు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేస్తేనే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించి వారిని పథకాల అమలులో భాగస్వాములను చేసేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు ఐడి కార్డులను, 99 రోజుల ప్రణాళిక బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కృష్ణారెడ్డి, డిపిఒ వి.సురేష్ మోహన్, జిల్లా, మండలాల అధికారులు, సర్పంచులు, తదితరులు పాల్గొన్నారు.


## నీరా కేఫ్ లీజు దరఖాస్తు

### రంగారెడ్డి జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కేశురాం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ఉన్న నీరా కేఫ్ రెండు సంవత్సరాలు నిర్వహించటానికి మొత్తం లీజుకు తీసుకోవడానికి రాష్ట్రంలోని గౌడ వృత్తికి చెందిన 01.01.2026 నాటికీ నమోదు చేసుకున్న ప్రస్తుత గీత కార్మిక సహకార సంస్థల నుంచి మేనేజింగ్ డైరెక్టర్, కల్లు గీత కార్మిక ఆర్థిక సంస్థ లిమిటెడ్ బిడ్లను కోరుతుందని రంగారెడ్డి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కె.కేశురాం తెలిపారు. ఈ భవనం ప్రాసెసింగ్ యూనిట్, మెషినరీ, బాంకెట్ హాల్ అండ్ వాణిజ్య దుకాణాలతో సహా నీరా కేఫ్‌కు చెందినది. నిబంధనల కోసం www.tgttcfc.com ను సం దర్శించవలిసిందిగా తెలిపారు. టెండర్ ఫారములు ఈనెల 09 నుండి 18 తేదీవరకు కార్యాలయం వేళల్లో పొందాలన్నారు. బిడ్లను సమర్పించుటకు 20 వ తేదీలోపు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి కార్యాలయం, ఇంటిగ్రేటెడ్ జిల్లా కార్యాలయ సముదాయం, కొంగర కలాన్, రంగారెడ్డి జిల్లా నందు పూర్తి వివరములకు సంప్రదించగలరని బి సి డబ్ల్యూ ఒ కేశురాం తెలిపారు.

## ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్తూ ఇద్దరు విద్యార్థులు దుర్మరణం



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఇంటర్ పరీక్ష రాయడానికి వెళ్తూ ఇద్దరు విద్యార్థులు మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో చోటు చేసుకుంది. కొత్తూరు మండల కేంద్రానికి చెందిన ఇద్దరు ఇంటర్ విద్యార్థులు శంషాబాద్ లోని ఓ ప్రైవేట్ కాలేజీలో పరీక్ష రాసేందుకు బైక్ పై వెళ్తున్నారు. ఈ క్రమంలో పెద్ద షాపూర్ దగ్గర ఎదురుగా వచ్చిన లారీ బైకన్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టమ్ కోసం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులను బిక్కి సింగ్(22),సురజ్(17)లుగా గుర్తించారు. అదే మార్గంలో వెళ్తున్న మంత్రి వాకిటి శ్రీహరి ప్రమాదం గురించి తెలియడంతో ఘటన స్థలం దగ్గర ఆగారు. ఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం మృతుల్లో సూరజ్ ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. బిక్కి సింగ్, సురజ్ లు ఇరువురు విద్యను అభ్యసిస్తూ ప్రైవేటుగా పరీక్షలు రాయడంతో పాటు కొత్తూరు లోని బిక్కి పి అండ్ జి కంపెనీలోని చిన్ను ఇంజనీరింగ్‌లో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. చేతికి అందొచ్చిన కుమారులు కళ్లముందే విగతజీవులుగా పడి ఉండటంతో వారి కుటుంబాల్లో పెను విషాదం నెలకొంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని,ప్రమాదానికి కారణమైన వాహానాన్ని గుర్తించేందుకు సిసిటివి ఫుటేజీని పరిశీలిస్తున్నారు. గుర్తు తెలియని వాహనం అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా భావిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఉప సర్పంచ్‌లకు చెక్ పవర్ రద్దు చేయాలి

### కలెక్టర్‌కు సర్పంచ్‌ల సంఘం వినతి




**ప్రజాపక్షం/కొత్తూరు:** అభివృద్ధికి అడ్డుగా మారుతున్న ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ కోరారు. గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి సర్పంచ్‌ల జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ, కొత్తూరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్‌లు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొత్తూరు మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎర్రోళ్ల జగన్ మాట్లాడుతూ రాజకీయాలను అడ్డు పెట్టుకొని గ్రామ పంచాయతీల అభివృద్ధిని అడ్డుకునేందుకు యత్నిస్తున్నారని, దాంతో తమకు అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. గ్రామ పంచాయతీల్లో బ్లాక్ మెయిల్ సంస్కృతిని నశించజేసేందుకు కృషి చేయాలని, పంచాయతీల్లో నిధులు ఉన్నా అభివృద్ధి చేయలేక పోతున్నాయని పేర్కొన్నారు. రాజకీయ విబేధాల కారణంగా అభివృద్ధి ఎక్కడికక్కడే పూర్తిగా కుంటుబడిపోతుందని వివరించారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం సర్పంచ్, ఉప సర్పంచ్‌లకు ఉమ్మడి సంతకంతోనే నిధులు విడుదల చేయాల్సి ఉంటుందని, కానీ క్షేత్ర స్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. ప్రధానంగా రాజకీయ విభేదాలు, ఉప సర్పంచ్‌లు వేర్వేరు పార్టీలకు చెందిన వారు కావడం, రాజకీయ కక్షలతో ఉప సర్పంచులు సంతకాలు చేయకపోవడంతోనే ప్రధాన సమస్యలు ఎదురవుతున్నాయని తెలిపారు. ఉప సర్పంచ్‌ల నిర్లక్ష్య వైఖరీ కారణంగానే పంచాయతీల్లో మురుగుకాలువలను శుభ్రం చేయకపోవడం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా వంటి అత్యవసర పనులకు చెల్లింపులు పూర్తిగా అగిపోతున్నాయని పేర్కొన్నారు. దాంతో ప్రజల నుండి తీవ్ర విమర్శలను సర్పంచులు ఎదుర్కొవాల్సి వస్తుందని అన్నారు. సొంత రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు ఉప సర్పంచ్‌లు సర్పంచులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. ఉప సర్పంచ్ అనే వ్యక్తి సహకరించకపోవడంతోనే పంచాయతీ వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో పెట్టుకొని ఉప సర్పంచ్‌లకు ఉన్న చెక్ పవర్‌ను రద్దు చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శికి లేదా మండల స్థాయి అధికారికి బాధ్యతలు ఇచ్చేందుకు కృషి చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు.

# సమష్టిగా కృషి చేస్తే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం

### రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి



**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా కృషి చేస్తే పేదల అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి అన్నారు. ప్రజాపాల ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా గురువారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు ఉద్దేశించి ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులపై అనేక బాధ్యతలు ఉన్నాయని, ప్రజలతో మమేకమై పనులు చేసినప్పుడే ప్రజల మన్ననలను పొందుతారన్నారు.మున్సిపల్ పట్టణాలలో ప్రజలు అనేక సమస్యలతో ఉంటారని,వారి సమస్యలను తెలుసుకొని వాటిని తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని,ముఖ్యంగా విద్యతోనే మార్పు వస్తుందని ప్రతి ఒక్కరు చదువుకునేలా చూడాలని,మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు పారిశుధ్యం పై దృష్టి సారించాలని, మున్సిపాలిటీలను సవ్యంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని,వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య లేకుండా ప్రణాళిక రూపొందించాలని, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా నిర్వహించే కార్యక్రమాలపై దృష్టి సారించాలని అన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాప్రతినిధులు, అధికారులందరూ కలిసి పని చేసి అభివృద్ధి, సంక్షేమాన్ని సాధించాలని కలిసికట్టుగా పనిచేస్తే ఇది సాధ్యమవుతుందని చెప్పారు.అభివృద్ధితో పాటు, రోడ్డు భద్రత,యువత మత్తుపదార్థాల బారిన పడకుండా ఉండడం,తదితర సామాజిక అంశాలపై సైతం దృష్టి సాధించాలని సూచించారు. అనంతరం రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ టి కె శ్రీదేవి మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించడం సంతోషమని,నూతన ప్రజాప్రతినిధులు ప్రజల్లో ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన తీసుకుని వెళ్లాలని,ప్రజల కోసం పనిచేయాలని,ప్రజాక్షేత్రంలో ఉండాలని పిలుపునిచ్చారు. ఆతరువాత జిల్లా అదనపు కలెక్టర్ కె శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళిక అమలులో భాగంగా క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలను ఆచరణలో పెట్టాల్సిన అవసరం ఉందని, ప్రజలకు మంచి సేవలు అందించేందుకు నూతనంగా ఎన్నికైన చైర్మన్లు,కౌన్సిలర్లు దృష్టి సారించాలన్నారు. జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకు వెళ్ళేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని, క్షేత్రస్థాయికి వెళ్ళినప్పుడు ప్రజల సమస్యలు తెలుస్తాయని,మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మమేకమై ప్రజలకు సౌకర్యాలు, సేవలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.ఉగాదికి సామూహిక ఇందిరమ్మ గృహ ప్రవేశాల కార్యక్రమానికి చర్యలు తీసుకోవాలని,99 రోజుల కార్యాచరణ ప్రణాళికను షెడ్యూల్ ప్రకారం ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయా శాఖల అధికారులు వారి శాఖల ద్వారా అమలు చేసే పలు ప్రభుత్వ పథకాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా,వీడియోల ద్వారా మున్సిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్ కెవివై కూరగాయల కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కాస్మోస్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రెజెన్స్ , కార్తీక్ క్రియేషన్స్ బ్యానర్ పై మలయాళంలో అనుపమ పరమేశ్వరన్, సురేష్ గోపి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన కోర్ట్‌రూమ్ డ్రామా చిత్రం జానకి వర్సెస్ కేరళ (జెఎస్.కె ) తెలుగులో ఈ సినిమా మార్చి 13న విడుదల కాబోతుంది. ఎంజి మూవీస్ ద్వారా అచ్చిబాబు సినిమాను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేస్తున్నారు. ప్రవీణ్ నారాయణన్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ట్రైలర్ ఇటీవల విడుదలైంది.

రీల్

# నీ రుణం తీరేది ఎట్ల? పోస్టర్ ఆవిష్కరణ



సినీ నటుడు రచ్చ రవి మహిళా దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకొని 'నీ రుణం తీరేది ఎట్ల?' అనే పోస్టర్‌ను సినీ కవి రచయిత నటులు తనికెళ్ళ భరణి చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తనికెళ్ళ భరణి మాట్లాడుతూ నీ రుణం తీరేది ఎట్లా అనే ఈ పోస్టర్ తో రచ్చ రవిలో మరో కోణం బయటికి వస్తోందని అన్నారు. ఆ కోణం ఏంటో త్వరలోనే తెలుస్తుందని భరణి చెప్పారు. రచ్చ రవిప్రకటన లో పోస్టర్ విడుదలకు కు సంబంధించిన విషయాలను తెలియజేస్తూ ప్రజల ప్రోత్సాహం తల్లి దండ్రుల ఆశీర్వాదంతో ఇప్పటివరకు బుల్లి, వెండితెరలపై అనేక వైవిధ్య పాత్రలను పోషించే అవకాశం దక్కిందని, ఇప్పటివరకు సుమారు 150 సినిమాలలో విభిన్న పాత్రలలో నటించే అవకాశం దక్కిందని తాను నటించిన అన్ని పాత్రలు సంతృప్తిని కలిగించాయని, మహిళ లేనిదే సమాజం లేదని అమ్మ గా అక్క గా చెల్లిగా భార్యగా విభిన్న పాత్రలు పోషించేది కేవలం మహిళలేనని , మహిళా దినోత్సవం సందర్భంగా 'నీ రుణం తీరేది ఎట్ల?' అనే పోస్టర్ ను ఆవిష్కరించుకోవడం జరిగిందని,ఇదే క్రమం లో మహిళా మణులను గౌరవించుకోవడం మన బాధ్యత అని ఇందుకోసం మే 10 మాతృ దినోత్సవం సందర్భం గా మరో ఆవిష్కరణకు సిద్ధం అవుతున్నట్లు రచ్చ రవి తెలిపారు.

# 'గద్దర్'అవార్డు రావడం మరచిపోలేని అనుభూతి

## దర్శకుడు విజయ్ కుమార్, నిర్మాత శ్రీకాంత్



స్వతంత్ర సమరయోధుడు, తెలంగాణ జాతిపితగా పిలుచుకునే కొండాలక్ష్మ ణ్ బాపూజీపై యువ దర్శకుడు బడుగు విజయ్ కుమార్ రూపొందించిన డాక్యుమెంట్రీ ఫిల్మ్ యూనిటీ. ది మ్యాన్ ఆఫ్ సోషల్ పేరుతో చిరందాస్ శ్రీకాంత్ నిర్మించిన ఈ డాక్యుమెంటరీ ఫిల్మ్‌కు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రకటించిన తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లో తొలి స్థానందక్కింది. 2025 సంవత్సరానికి గాను వెల్లడించిన గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లోని డాక్యుమెంటరీ విభాగంలో తొలి ఉత్తమ డాక్యుమెంటరీగా గద్దర్ అవార్డును సొంతం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కొండా లక్ష్మ ణ్ బాపూజీ.... తెలంగాణ సమాజానికి మరో గాంధీ ఎలా అయ్యాడనే విషయాన్ని చాలా ఆసక్తికరంగా పెద్దల నుంచి పాఠశాల విద్యార్థులకు సైతం సులభంగా అర్థమయ్యేలా యూనిటీ డాక్యుమెంటరీని విజయ్ కుమార్ చిత్రీక రించారు. మైమ్ మధు, బాలనటుడు భాను ప్రధాన పాత్రలు పోషిస్తూ బాపూజీ కథను వివరించారు. నాణ్యమైన విజువల్స్, స్పష్టమైన వాయిస్ ఓవర్, చక్కని ఎడిటింగ్ తో ప్రేక్షకులకు ఎక్కడా ఇబ్బంది లేకుండా సుమారు అరగంటపాటు యూనిటీ డాక్యుమెంటరీని తీర్చిదిద్దారు.ఇప్పటికే యూనిటీ డాక్యు మెంటరీ పలు జాతీయ, అంతర్జాతీయ వేదికలపై కూడా శభాష్ అనిపించుకొని అవార్డులు అందుకుంది. 2025లో ఢిల్లీలో జరిగిన 15వ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డుల్లో ఉ త్తమ దర్శకుడిగా దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారం అందుకోగా.... ముంబయిలో జరిగిన భారత్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్2023లో యూనిటీ డాక్యుమెంటరీకి రెండు అవార్డులు దక్కాయి. బెస్ట్ హిస్టారికల్ డాక్యుమెంట్ ఫిల్మ్, ఐకానిక్ ఫ్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును యూనిటీ సొంతం చేసుకుంది. ఇలా... ఎన్నో ప్రత్యేకతలను సంతరించుకున్న డాక్యుమెంటరీ ఫిల్మ్ ను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి గద్దర్ అవార్డుకు ఎంపిక చేయడం పట్ల దర్శకుడు విజయ్ కుమార్, నిర్మాత శ్రీకాంత్ ఆనందం వ్యక్తం చేశారు. అవార్డుకు ఎంపిక చేసిన జ్యూరీచైర్మన్ విజయ్ కనకమేడల, జ్యూరీ సభ్యులకు దర్శకుడు విజయ్, నిర్మాత శ్రీకాంత్‌తోపాటు అందులో నటిం చిన మైమ్ మధు, బాలనటుడు మాస్టర్ భాను ప్రత్యేక కృ తజ్ఞతలు తెలిపారు.

# 'ఆయా షేర్' ఫుల్ కిక్ ఇచ్చింది

## గేయ రచయిత కాసర్ల శ్యామ్



నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్.' ఈ సినిమాలో ఆయా షేర్ అనేపాట సంచలనం సృష్టించింది. ప్రస్తుతం ఆయా షేర్ ప్రపంచవ్యాప్తంగా టాప్ లో ట్రెండ్ అవుతూ భారీ రెస్పాన్స్ అందుకుంటుంది.ఈ సందర్భంగా ఆయా షేర్ పాట గేయ రచయిత కాసర్ల శ్యామ్ మీడియాతో చిట్ చాట్ చేశారు.ఆయా షేర్ పాట ప్రోమో విడుదలైనప్పటి నుంచి మంచి బజ్ క్రియేట్ చేసింది. పాట రిలీజ్ అయిన తర్వాత అన్ని రికార్డ్స్ బద్దలు కొట్టుకుంటూ అందరికీ నచ్చింది. అనిరుధ్ నేను ఇచ్చిన పదాలు తీసుకొని జనాలకి రీచ్ అయ్యేవిధంగా ట్యూన్ చేశారు. మట్టి వాసన తెలిసిన జానపద గాయకులు జంగిరెడ్డి, దేవయ్య అద్భుతంగా పాడారు. ఇంత ఫిరోషియస్ సాంగ్ లో లిరిక్స్ గురించి ప్రత్యేకంగా మాట్లాడడం చాలా ఆనందాన్నిచ్చింది.నా కెరీర్లో ఈ పాట ఇచ్చినంత కిక్కు మరి ఏ పాట ఇవ్వలేదు. నేను ఉపయోగించిన భాష, యాసకి సోషల్ మీడియాలో చాలా అద్భుతమైన ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ స్పందన నాకు ఎంతో ఆనందాన్ని కలిగించింది.ఈ సినిమాలో నాని క్యారెక్టర్‌లో ఒక అద్భుతమైన ఎమోషన్ ఉంటుంది. ఆ రెండు జడల వెనుక మంచి కథ ఉంటుంది. ఇప్పుడు అందరూ ఆ రెండు జడల గురించి మాట్లాడుకుంటున్నారు. సినిమా చూసిన తర్వాత వాటికి అద్భుతమైన జస్టిఫికేషన్ ఉందని అనుకుంటారు. ఇప్పుడు అందరు కూడా జడలు వేసుకుని రీల్స్ చేస్తున్నారు.అనిరుద్ పాట చేస్తున్నప్పుడే పెద్ద హిట్ కొడుతున్నాం అని చెప్పారు. ఈ పాట సక్సెస్ కి ముఖ్య కారణం డైరెక్టర్ శ్రీకాంత్. జనం నుంచి పుట్టిన ఒక వీరుడు ఆ జనాలకు స్ఫూర్తిని ఇచ్చే క్రమంలో వచ్చిన పాట ఇది. ఈ పాట రాయడానికి వారం రోజులు పట్టింది. కొన్ని వెర్షన్స్ డెవలప్ చేసుకుంటూ చివరికి దీనిని ఫిక్స్ చేశాం. కాకపోతే సాంగ్ సెంట్రల్ ఐడియా మాత్రం ఇమ్మీడియట్ గా లాక్ చేశాం.ఈ సినిమాలో హీరో క్యారెక్టర్ చెప్పడానికి ఒక ప్రత్యేకమైన పల్లవి ఉంటే బాగుంటుంది అనుకున్నాను. సీనియర్ కవులని స్ఫూర్తిగా తీసుకునే ముందుకు సాగుతున్నాను. కొసరాజు , జాలాది ఈ యాసతో ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. నేను రాసిన ఎక్కువ పాటలు తెలంగాణ యాసలో వచ్చాయి. దాదాపు అన్ని రకాల పాటలు రాశాను.డైరెక్టర్ ఈ పాట గురించి పూర్తిగా వివరించారు. ఒక జాతి కష్టం నుంచి పుట్టే ఒక యోధుడు ఆ జాతికి స్ఫూర్తి నింపే నేపథ్యంలో వచ్చే పాటిది. 80 దశకాల్లో జరిగే నేపథ్యం కాబట్టి అప్పుడు ఉర్దూ ప్రభావం ఉంటుంది. అందుకే ఇందులో చాలా వరకు ఉర్దూ పదాలు ఉపయోగించడం జరిగింది. నేను గురువుగా భావించే మా చంద్రబోస్ నేషనల్ అవార్డు రాగానే నాకు ఫోన్ చేసి 'మీరు చాలా తక్కువ సమయంలో అచీవ్ చేశారు తమ్ముడు'అన్నారు. అది నాకు చాలా ఆనందాన్నిచ్చింది.నా మొదటి సినిమా చంటిగాడు. కృష్ణవంశీ దర్శకత్వంలో శ్రీకాంత్ హీరోగా నటించిన మహాత్మ సినిమాలో 'నీలపూరి గాజుల ఓ నీలవేణి నిల్చుంటే కృష్ణవేణి' అనే పాటతో నాకు ఫస్ట్ బ్రేక్ వచ్చింది. ఆ తర్వాత చాలా సినిమాలు రాశాను. తర్వాత ఇస్మార్ట్ శంకర్, రాములో రాములా, డిజె టిల్లు. వరుసగా విజయవంతమైన పాటలు వచ్చాయి. ఇటీవల శంకర వరప్రసాద గారు సినిమాలో చిరంజీవి, వెంకటేష్ కలిసి చేసిన డ్యాన్స్‌కు నేను పాట రాయడం చాలా ఆనందాన్ని ఇచ్చింది. విశ్వంభరలో కూడా నా పాట ఉంది. పవన్ కళ్యాణ్ కి ఉస్తాద్ లో రాశాను.'నాకు లైఫ్ లాంగ్ సరిపోయే కిక్ ఇచ్చారు. ధూమ్ ధామ్ దోస్తానా, చమ్కీలా అంగి, ఇప్పుడు ఆయా షేర్.. ఇలా నాకు మర్చిపోలేని హిట్లు ఇచ్చారు' అని చాలా అభినందించారు. ఇలాంటి అద్భుతమైన సెలబ్రేషన్‌కి నేను రాయడం చాలా ఆనందంగా ఉందని ఆయన ప్రత్యేకంగా ట్వీట్ కూడా చేశారు. డైరెక్టర్ సాంగ్ సిచువేషన్ ని చాలా క్లియర్ గా చెప్పారు. నేను నాని జడల్ క్యారెక్టర్ ని దృష్టిలో పెట్టుకున్నాను. హీరో ఎప్పుడూ కూడా పుస్తకాల్లో నుంచి పుట్టడు. కష్టం వస్తే జనం మధ్యలో నుంచి పుట్టుకొస్తాడు. అలా జనం మధ్యలో నుంచి పుట్టుకొచ్చిన ఒక వీరుని కథ ఇది. అలాంటి క్యారెక్టర్ కి ఒక ఎమోషన్ ఉంది. అందుకే పచ్చబొట్టు గాయం. గుంజుకున్న న్యాయం..ఇలాంటి పద ప్రయోగాలు చేశాను. ఈ సాంగ్ వచ్చిన తర్వాత సినిమాపై ఇంపాక్ట్ డబుల్ అయింది. కమర్షియల్ గా మార్కెట్ పరంగా స్కేల్ మారిపోయింది ఇదంతా డైరెక్టర్ శ్రీకాంత్ విజన్. ఇందులో ఎమోషన్స్ యాక్షన్ అన్ని కూడా నెక్స్ట్ లెవెల్ లో ఉంటాయి.నిర్మాత సుధాకర్ నిర్మాత ఎక్కడ కూడా ఖర్చుకి వెనకాడలేదు.

# 'దీవాన' మూవీ టీజర్ రిలీజ్




శుభం సినిమాతో విజయాన్ని అందుకున్న యాక్టర్ హర్షిత్ రెడ్డి హీరోగా నటిస్తున్న కొత్త సినిమా 'దీవాన'. స్నేహ మణిమేగలై హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయమవుతుంది. ఈ చిత్రాన్ని అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్ పై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి నిర్మిస్తున్నారు. బ్యూటిఫుల్ లవ్ స్టోరీతో దర్శకుడు శ్రీకాంత్ సంగిశెట్టి రూపొందిస్తున్నారు. 'దీవాన' సినిమా ఈ వేసవికి గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. 'దీవాన' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. టీజర్ చూస్తుంటే మణిరత్నం సినిమా ఫీల్ కలుగుతోంది. ఈ టీజర్ ఎలా ఉందంటే ఓ పెళ్లి వేడుకల్లో హీరోయిన్ ను చూసి లవ్ ఎట్ ఫస్ట్ సైట్ అన్నట్లు ప్రేమలో పడతాడు హీరో. అప్పటి నుంచి ఆ అమ్మాయే లోకంగా బతుకుతుంటాడు. ఆ అమ్మాయి తరుపు వాళ్లతో ప్రమాదమని స్నేహితులు చెప్పినా వినిపించుకోడు. ఇంతే ప్రేమ అమ్మాయి నుంచి కూడా ఈ అబ్బాయికి దక్కిందా లేదా అనేది థియేటర్స్ చూడాలి. టీజర్ లోని 'ప్రేమ ఇది ప్రేమ గుండెల్లోన సడిరేపేదే ప్రేమ...' సాంగ్ బీజీఎం హార్ట్ టచింగ్ గా ఉంది. టీజర్ చివరలో 'ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తర్రా ఈ పోరీలు, అది నీ పానం పీక్కతినకపోతే నన్ను అడుగురా..' అనే డైలాగ్స్ ఆసక్తి కలిగిస్తున్నాయి. 'దీవాన' సినిమాలో ఒక ఇంటెన్స్ బ్యూటిఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీ చూడబోతున్నట్లు టీజర్‌తో తెలుస్తోంది. ఈ చిత్రానికి కాస్ట్యూమ్స్ మానస, ప్రొడక్షన్ డిజైనర్ ఝాన్సీ గోజల, ఎ డిటర్ హృషికేశ్ పాస్పుల్, డీవోపీ వంశీ పచ్చిపులుసు, మ్యూజిక్ ఈశ్వర్ చంద్.

# ఇండస్ట్రీకి పెద్ద దిక్కు ఎవరూ లేరు: తమ్మారెడ్డి



తెలుగు సినిమా పరిశ్రమకు పెద్ద దిక్కు ఎవరో లేరని ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ సంచలన వ్యాఖ్యలు చేశారు. పెద్ద దిక్కు అనేది ఒక పదవి కాదని ఆయన అన్నారు. వదలా సినిమాకు సంబధించిన ప్రెస్ మీట్‌లో ప్రజాపక్షం ప్రతినిధి అడిగిన ఓ ప్రశ్నకు తమ్మారెడ్డి భరద్వాజ ఈ విధంగా స్పందించారు. ఎవరైనా చేసే పనులను బట్టి పెద్ద దిక్కు అవుతారు. ఒకాయన చేసిన పనుల వల్ల ఇండస్ట్రీకి ఆయన పెద్ద దిక్కు అయ్యాడు. ఆయన చేసిన మంచి పనుల వాళ్ళ, మేమంతా ఆయన దగ్గరికి వెళ్లడం వల్ల ఆయన పెద్దదిక్కు అయ్యారు. ఇవ్వాళ ఆయన లేరు కాబట్టి పెద్ద దిక్కు ఇంకెవరూ లేరు. కొత్తగా పెద్ద దిక్కు రావడం అనేది జరగదు. ఆయన ఒక్కడే. ఇంకొక్కడు రాడు...లేడు కూడా. అని తమ్మారెడ్డి భరద్వాజ పేర్కొన్నారు.నేను సినిమా తీసి దాదాపుగా పది సంవత్సరాలు అవుతోంది. సినిమా అంటే భయపడుతున్న సమయంలో కిషోర్ వచ్చే సినిమా చేద్దామన్నారు. జగపతి బాబుకి కథ చాలా నచ్చింది కథ పై నమ్మకంతో మొదలుపెట్టాం. అప్పటికి ఇప్పటికీ ఏం మారలేదు. ఈ సినిమా అని చేసినంతకాలం పని తప్పితే ధ్యాస లేదు. ఈ రోజుల్లో కూడా 24 గంటలు పాటు పనిచేస్తున్నారని ఈ సినిమా చేశాక తెలిసింది. అందరు కూడా చాలా సిన్సియర్ గా పనిచేశా రు. దానికి ఫలితం మీరు చూసిన గ్లింప్స్. జగపతిబాబు ఈ సినిమాకి ఒక నిర్మాత క ంటే ఎక్కువగా పని చేశారు. బాబు లేకుండా ఈ సినిమాని అసలు ఊహించలేము. చోటా కె నాయుడు గురించి ఎంత చె ప్పుకున్నా తక్కువే. వీళ్ళిద్దరికీ థాంక్యూ వెరీ మచ్. సునీల్ నారంగ్‌కి థాంక్ యూ. నేను పరిశ్రమలకు వచ్చి 50 ఏళ్ళు అవుతోంది. చాలా కాలం త ర్వాత ఈ సి నిమా చేస్తున్నాను.

# రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూరల్ అగ్రి రీజియన్‌పై దృష్టి

### మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకం
### పోలీస్ శాఖలో దశలవారీగా ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగంలోకి తీసుకురండి
### ప్రీ బడ్జెట్ సమావేశాల్లో డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క



ప్రజాపక్షం/హైదరాబాద్: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు పెద్ద సంఖ్యలో పెట్టుబడిదారులు వస్తున్న నేపథ్యంలో శాంతిభద్రతలు కీలకమని, ఈ అంశంలో ఏ చిన్న పొరపాటుకు హోంశాఖ అధికారులు, సిబ్బంది అవకాశం ఇవ్వరాదని, ప్రతి కదలిక పోలీసుల కను సన్నల్లో ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. విధుల నిర్వహణ క్రమంలో హోం శాఖకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో గురువారం మొదట హోంశాఖ, అనంతరం తదుపరి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి పరిశ్రమలు, ఐటి శాఖల ప్రీ బడ్జెట్ సమావేశంలో డిప్యూటీ సిఎం పలు సూచనలు చేశారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ ఎకానమీ సాధించడమే లక్ష్యంగా రాష్ట్రం ముందుకు పోతున్న క్రమంలో ఈ లక్ష్యసాధనలో పోలీస్ శాఖ పాత్ర కీలకమని డిప్యూటీ సిఎం అన్నారు. 2047 త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీగా లక్ష సాధనలో పబ్లిక్, ప్రైవేట్ (పిపి) మోడల్ అనివార్యమని, ఆ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు వెళ్లాలని పరిశ్రమల శాఖ అధికారులకు డిప్యూటీ సిఎం సూచించారు. హైదరాబాద్ నగరం ప్రపంచంలో మేటి నగరంగా ఎదుగుతున్న క్రమంలో వేగంగా పలు సంస్కరణలు చేపడుతున్నామని ఇందులో భాగంగా పోలీస్ శాఖలో దశల వారీగా ఎలక్ట్రిక్ వాహనాల (ఈవి) వినియోగాన్ని పెంచాలని సూచించారు. నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర గణనీయంగా ఉంటుందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో సీసీ కెమెరాల వినియోగాన్ని పెద్ద సంఖ్యలో చేపట్టాలని, అవసరమైన చోట మరమ్మతులు చేపట్టాలని చిన్న కదలికను సైతం వెను వెంటనే గుర్తించి నిఘాను పటిష్టం చేసేందుకు సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని అందుకు అవసరమైన సహకారాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. క్యూర్, ప్యూర్ ప్రాంతాలతో పాటు రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రేర్ (రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ) కు సమ ప్రాధాన్యత ఇవ్వాలని డిప్యూటీ సిఎం సూచించారు. రేర్ రంగంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని పరిశ్రమల శాఖ అధికారులను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ను పెద్ద ఎత్తున ప్రోత్సహించాలనేది ప్రభుత్వం ఆలోచన అని తెలిపారు. ఎంఎస్ఎంఈల ద్వారా రాష్ట్ర నలుమూలలోని యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధితో పాటు పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు అవకాశం ఉన్న రంగమని తెలిపారు. మొత్తం 41 జిసిసిలతో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందని, ఇదే వేగాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వ నుంచి ప్రోత్సాహం కల్పిస్తామని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. డాటా సెంటర్లలో ఎఐ వినియోగాన్నిపెద్దఎత్తున చేపట్టాలని మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సి.వి.ఆనంద్, టిజిఐఐసిసి ఎండి శశాంక, డిప్యూటీ సిఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.


# రేపటి నుంచి పదవ తరగతి పరీక్షలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 14 నుంచి ఉదయం పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలను నిర్వహించగా, ఐదు నిమిషాల గ్రేస్ టైమ్‌తో విద్యార్థులు ఉదయం 9.35 గంటల వరకు మాత్రమే పరీక్ష కేంద్రంలోకి అనుమతినిస్తారు. ఆ తర్వాత వచ్చే వారికి అనుమతి ఉండబోదని పాఠశాల విద్యాశాఖ వెల్లడించింది. పరీక్ష హాల్‌లో హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్, పెన్,పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరేసర్,జ్యామెట్రీ వాటిని మాత్రమే అనుమతినిస్తామనిఅధికారులు స్పష్టం చేశారు. పదవ తరగతి పరీక్షలకు మొత్తం 5,28,239 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 5,17,727 మంది, ఒకసారి ఫెయిల్ అయిన వారు 10,512 మంది ఉండగా, బాలురు 2,67,954 మంది, బాలికలు 2,60,285 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,07,573 మంది, సంక్షేమ పాఠశాలల నుంచి 60,139 మంది, ప్రైవేట్ పాఠశాలల నుంచి 2,50,015 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. బిఎస్ఇ వెబ్‌సైట్ (www.bse .telangana.gov.in)లో హాల్‌టికెట్లను అ ందుబాటులో పెట్టారు. విద్యార్థులు పరీక్ష కు కనీసం ఒక రోజు ముందే తమ పరీక్షా కేంద్రాన్ని సందర్శించాలని పాఠశాల విద్యా శాఖ సూచించారు. పరీక్ష రోజు ఉదయం 8.30 గంటల వరకే కేంద్రానికి చేరుకోవాలని, తద్వారా పరీక్ష సమయానికి లోపలికి వెళ్లడానికి అవకాశం ఉంటుందని అధికారులు సూచించారు. పరీక్ష కేంద్రంలోనికి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతి ఉండబోదని పాఠశాల విద్యాశాఖ స్పష్టం చేసింది. సెల్‌ఫోన్లు తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను పూర్తిగా నిషేధించారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఆరోగ్యంగా ఉండే విధంగా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని విద్యాశాఖ సూచించింది.

# నేడు,రేపు రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు

### ప్రారంభించనున్న కూనంనేని
### హాజరుకానున్న నారాయణ, పల్లా, కె. రామకృష్ణ




ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం: భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ఎన్నికైన కార్పొరేటర్లు, మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తరుపున నేడు, రేపు రెండు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. పాల్వంచలోని సుగుణ గార్డెన్స్‌లో నిర్వహించే ఈ శిక్షణా కార్యక్రమాన్ని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని సాంబ శివరావు తొలి రోజు శుక్రవారం ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ కంట్రోల్ కమిషన్ చైర్మన్ డా .కె.నారాయణ, సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కే రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్ పాషాతో పాటు రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు హాజరుకానున్నారు.

**మొదటి రోజు 13వ తేదీ శుక్రవారం:**

- ఉ.10 గం.లకు ప్రారంభమయ్యే ఈ శిక్షణా తరగతుల్లో డాలర్ పుట్టుక, ప్రాధాన్యత, డాలర్ మారకపు విలువ, బడ్జెట్‌పై అవగాహన అనే అంశాన్ని కూనంనేని సాంబశివరావు వివరిస్తారు.
- ఉ.11 గం. నుండి 12 గం. వరకు ఆర్టికల్ 73,74 సవరణలు రాజ్యాంగ బద్ధత, స్థానిక సంస్థల ప్రాధాన్యత అనే అంశంపై మాడభూషి శ్రీధర్ మాట్లాడుతారు.
- మ.12 గం. నుండి 1 గం. వరకు ప్రభుత్వాలు,చట్టాల దుర్వినియోగం అనే అంశంపై ప్రొఫెసర్ ఖాసీం మాట్లాడుతారు.
- మ.2 గం. నుండి 3 గం. వరకు ప్రజా స్వామ్యంలో స్థానిక సంస్థల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ కోదండ రామ్ మాట్లాడుతారు.
- సా.3 గం. నుండి 5 గం. వరకు ప్రజాప్రతినిధులుగా కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ నాగేశ్వర రావు వివరించనున్నారు.
- సా.4 గం. నుండి 5 గం. వరకు స్థానిక సంస్థలు, కమ్యూనిస్టుల పాత్ర అనే అంశంపై ప్రొఫెసర్ హరగోపాల్ వివరించనున్నారు.

**రెండో రోజు 14వ తేదీ శనివారం:**

- ఉ.10.30 గం. నుండి 11.30 గం. వరకు భారతదేశ సమాఖ్య విధానం, రాష్ట్రాలకు, స్థానిక సంస్థలకు నిధుల కేటాయింపులో కేంద్రప్రభుత్వ వివక్షత అనే అంశంపై పరకాల ప్రభాకర్ వివరిస్తారు.

**ఏర్పాట్లు పరిశీలించిన సాబీర్ పాషా:**

రెండు రోజుల శిక్షణా తరగతులను పురస్కరించుకుని గురువారం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా సుగణ గార్డెన్స్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా తరలివస్తున్న నాయకులు, ప్రజాప్రతినిధులకు ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా చూడాలని ఆయన వాలంటీర్లకు సూచించారు. ఈ శిక్షణా తరగతులను విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులతో పాటు నియోజకవర్గ పుర ప్రముఖులు, వార్డు సభ్యులు హాజరుకావాలని పాషా కోరారు. ఆయన వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం. జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, వీశంశెట్టి పూర్ణచంద్రరావు తదితరులున్నారు.

# ... రూపొందించాలి

(మొదటి పేజీ తరువాయి)



తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, మహిళా నాయకురాలు విజయలక్ష్మి పండిట్, ప్రొఫెసర్ సారంగపాణి, కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పోజు సూర్యనారాయణ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రభులింగం, దొడ్డ వెంకటయ్య, మెడకంటి వెంకట్ రెడ్డి, ఒళ్ళు ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి కంబాల శ్రీనివాస్, కోశాధికారి డి.జి. నరేంద్ర ప్రసాద్, రైతు మహిళా నాయకురాలు స్వరూప, ఎం. వెంకటేశ్వర్లు, లెక్చరర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణి ప్రశంస మాట్లాడుతూ మహిళా రైతులపై సమగ్ర డేటా సేకరించి, వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక మహిళా రైతుల విధానాన్ని రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా రైతులు ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నందున వాటిని అధిగమించేందుకు సంఘటితంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. మహిళలు కష్టపడి వ్యవసాయం చేసినప్పటికీ వారిని రైతులుగా అధికారికంగా గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారసత్వ హక్కులపై చట్టాలు ఉన్నప్పటికీ అమలు లోపాల వల్ల మహిళల పేరుపై భూమి దేశంలో కేవలం 14.7 శాతం మాత్రమే ఉందన్నారు. ఈ పరిస్థితిని మార్చేందుకు జాయింట్ పట్టాలు ఇవ్వడం లేదా మహిళల పేరుతోనే భూమి పట్టాలు మంజూరు చేసే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**కేరళలో అమలవుతున్న 'కుదుంబశ్రీ' పథకం అమలు చేయాలి : పరుచూరి జమున**

పరుచూరి జమున మాట్లాడుతూ పితృస్వామ్య భావజాలం కారణంగా మహిళా రైతులు అనేక అణచివేతలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. మహిళలు సమూహాలుగా, సహకార సంఘాలుగా ఏర్పడి వ్యవసాయం కొనసాగించేందుకు కేరళలో అమలవుతున్న కుదుంబశ్రీ తరహా పథకాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళలు తమ అస్తిత్వాన్ని, ఉనికిని బలపరచుకునేందుకు చైతన్యంగా ముందుకు రావాలని సూచించారు.

**రైతు, మహిళా ఉద్యమాల ఫలితంగానే రైతు సంవత్సరం : పశ్య పద్మ**

తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ మాట్లాడుతూ రైతు, మహిళా ఉద్యమాల ఫలితంగా ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఎఫ్‌పి), డాక్టర్ ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ సూచనల మేరకు ఐక్యరాజ్యసమితి 2026 సంవత్సరాన్ని అంతర్జాతీయ మహిళా రైతుల సంవత్సరంగా ప్రకటించిందని తెలిపారు. 'ఇది సంతోషకరమైన విషయం. 1908వ సంవత్సరంలోనే అమెరికా దేశం లో దర్జీ (మిషన్ కుట్టే మహిళలు) పనిచేసే మహిళలు 14 గంటల పని చేయడం వారి ఆరోగ్యాలని పూర్తిగా దెబ్బ తీసుకునే పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. వారి శ్రమ దోపిడీ ద్వారా యజమానులు లాభపడుతున్నారన్నది అర్థం చేసుకున్న ఆ మహిళలు పోరాటాన్ని కొనసాగించడం ఉధృతం చేయటమే మహిళా హక్కుల సాధనకు మార్గదర్శకమైనది.1910 వ సంవత్సరంలో క్లారా జెట్కిన్ మహిళలకు ఓటు హక్కు కోసం, విద్య, ఉపాధి ఉద్యోగ చేయాలని, ప్రపంచ శాంతి సాధనకు అంతర్జాతీయ మహిళా దినోత్సవం మార్చి ఎనిమిదవ తారీఖున నిర్వహించమని పిలుపునివ్వడం జరిగింది. నాటి నుండి నేటి వరకు ఈ నినాదాలపై మహిళలు ప్రపంచవ్యాపితంగా పోరాడుతున్నారు. 1975వ సంవత్సరంలో అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ఐక్యరాజ్యసమితి ప్రకటించింది. నేడు మహిళా రైతుల సంవత్సరంగా ప్రకటించటం సంతోషకరమైనది. ప్రపంచ వ్యాప్తంగా 41 శాతం మహిళలు రైతులుగా కొనసాగుతున్నారు' అని పశ్య పద్మ అన్నారు. మహిళా కౌలు రైతులకు ప్రత్యేక సహాయం అందించాలి.. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో మహిళా రైతుల వివరాలు స్పష్టంగా లేవన్నారు. మహిళా రైతు లకు సాంకేతికపరమైన శిక్షణలు ఇవ్వటం ద్వారా శ్రమను తగ్గించుకునే పరికరాల ద్వారా సులభతరంగా వ్యవసాయం చేయటానికి సంబంధిత చర్యలు పాలకులు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయం రంగంలో కొనసాగుతున్న మహిళలు పోషకాహారం కూడా తీసుకొని దుస్థితి దేశంలో నెలకొని ఉందన్నారు. పోషకాహార పంటలను పండించటానికి పంటల ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని, భర్తలు పని కోసం వలసకు వెళ్ళటం వల్ల ఒంటరిగా వ్యవసాయాన్ని కొనసాగిస్తున్న మహిళలకు, కౌలు మహిళ రైతులకు ప్రత్యేకంగా సహాయపడటానికి అవసరమైన చర్యలు అన్నింటిని తీసుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేవలం 12 శాతం మహిళలకే భూమి ఉన్నదని, అది కూడా ఎక్కువగా భర్త మరణించిన తరువాత వచ్చిన హక్కు మాత్రమేనని తెలిపారు. కుటుంబం, సమాజంలో ఉన్న లింగ అసమానతలను తొలగించినప్పుడే మహిళలకు ఉన్న చట్టపరమైన హక్కులు పూర్తిగా అమలవుతాయని అన్నారు. వజ్రాల అరుణ, శోభ, శాంతి, పద్మ, రజినితో పాటు వివిధ జిల్లాల నుంచి వచ్చిన మహిళా రైతులు, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, కౌన్సిల్ సభ్యులు సదస్సులో పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com